


అభ్యుదయ ఆంధ్ర అభ్యుదయ రచయితల మాస పత్రిక

ఇందులో

ముఖచిత్రం : బాపూజీ

చిత్రకారుడు — మా. గోఖలే

Editor, Printer & Publisher : K. Vinayaka Rao
Secretary, Andhra Progressive Writers' Association, Governorpet.
Printed at Abhyudaya Press, Bezwada.



ప్రతిజ్ఞ

మహాత్ముని దారుణ హత్యావార్త విశ్వప్రపంచాన్ని దిగ్భ్రమలో ముంచెత్తింది. పరిభ్రమణం మాని, భూగోళం నిలువున నీరై, ఒక్కసారి నిట్టూర్చినట్లయింది.

"నా కేలల్లాడదు, బంధులార, నిలుడీ !" అని కేలెత్తి యావద్భారతానికీ స్వాతంత్ర్యపథం చూపి, ముందుకు నడిపి, అమాయికంగా ఆ విజయోత్సవంలో మనం తన్మయులమై వున్ననాడు కూడా, ఉపవాసవ్రతంలో ఆత్మపరిశోధనలో నిమగ్నుడై వున్న ఆశోకమూర్తి, ఆ అశోకమహాదాశయుడు, ఆ బాపూజీ నేడు మనమధ్య లేడు. భారత ప్రజానీకానికీ, ప్రజాచైతన్య మూర్తి బాపూజీకీ ఆ గర్భశత్రువులైన స్వార్థపరుల కుట్ర నేటికి ఫలించింది. ఈ స్వార్థపరులే తమతుచ్ఛ ప్రయోజనాలకోసం సామ్రాజ్యవాదులతో కలిసి బాపూజీ నిర్మించిన స్వాతంత్ర్యోద్యమాన్ని ఎదుర్కొన్నారు. అయినా, ఆయన ప్రజానీకం కఠోరదీక్షతో నిరంతర ఆత్మబలిదానంతో సాధించుకున్న స్వాతంత్ర్యం, ఆయనకూ ఆయన ప్రజానీకానికీ దక్కకుండా దేశంలో మతకలహాలు రెచ్చగొట్టి, తమదోపిడినీ దౌర్జన్యాన్నీ

చిరస్థాయి చేసుకోవాలని ప్రయత్నించారు. కాని బాపూజీ గానీ భారత ప్రజలుగానీ అరశతాబ్దంగా సాగించిన స్వాతంత్ర్యోద్యమం తెల్లదొరల స్థానంలో నల్లదొరలను నిలబెట్టడానికి కాదు. ఆఉద్యమంపూర్తికాలేదు. మహాత్ముడు తనప్రజల పక్షాన నిలబడ్డాడు. స్వార్థపరులు రెచ్చగొట్టిన మతకలహాలను నిర్మూలించడానికీ, ప్రజల్లో సామరస్యం నెలకొల్పి, ప్రజా స్వాతంత్ర్య పోరాటాన్ని ఇంకా ముందుకు తీసుకుపోవడానికీ బాపూజీ నిలబడ్డాడు.

ఈ విశ్వరూపం చూసి, గుండెచెదిరి, ప్రాణం తల్లడిల్లి, భీరులైన నీచ స్వార్థపరులు కుట్రపన్ని, దొంగచాటుగా గాంధీజీని హత్యచేసారు. ఇంతటితో గాంధీజీ మరణిస్తాడనీ, తమ ఆటలకు అడ్డుండదనీ విందులు చేసుకున్నారు.

కాని, గాంధీజీ ఒక్కడు కాడు. వాళ్లను భయభ్రాంతుల్ని చేసిన ఆ విశ్వరూపం ఒక్క వ్యక్తిదికాదు. నలభైకోట్లమంది భారత ప్రజల జాతీయచైతన్యం మూర్తిచెందిన ఆ మహాత్వం, ఎనభైకోట్ల చైతన్యజ్యోతులు ప్రసరించిన విశ్వ తేజస్సుతో ఘనీభూతమైన ఆ విశ్వరూపం ఎన్నటికీ అంతరించేది కాదు. ఎందరు మహారాజులుగానీ, ఎందరు కోటీశ్వరులుగానీ, ఎందరు జమీందార్లుగానీ దాన్ని హత్య చెయ్యలేరు. వీళ్ల మరతుపాకులూ, ఆటంబాంబులూ దాన్ని సోకనైనా లేవు.

మహాత్ముని హృదయంలో ప్రతిఫలించిన భారత ప్రజానీకానికి చావులేదు! వారి ఆశయానికి చావులేదు! గాంధీజీకి చావులేదు! ప్రపంచ ప్రగతికి చావులేదు!

ఆమహదాశయాన్ని విశ్వమంతటా కోటికోట్లగొంతులు ఎలుగెత్తి చాటుతాయి. అభ్యుదయ రచయితలం, కళాకారులం ప్రజానీకం ముందుండి, ఆ ఉత్తమ సంప్రదాయాన్ని మహోజ్వలం చేసి తీరుతామని ప్రతిజ్ఞ చేస్తున్నాం.

★

★ జ్వాలానృత్యం

శ్రీ అనిశెట్టి సుబ్బారావు

ప్రకృతి కంఠం: ★

స్మృతిచాలని తొలియుగాన నవతరించి
విశ్వస్తన్య కాంతి సదా వర్షించగ
కంపించితి కాంక్షలతో ! కంటి నమర మానవులను !

ఒక పుష్పం ఒక నేత్రం
ఒక బాష్పం ఒక గాంధీ

నే పులకించిన అగాధ సౌందర్య స్వప్నఫలం !
హాతాచ్ఛబ్ద మొక్కటివిని హడలి త్రుళ్ళిపోతున్నా,
పుత్రశోకమున క్రుంగిన పురిటి గడ్డ నౌతున్నా —
అన్నీ నరజాతిపంట ! అమృతం విషసమ్మిళితం :
చితిమంటలు శిశువునవ్వు లగడ్తలాదర్శాలూ
ఆదర్శాల గడ్తలూ అన్నీ నరజాతిపంట !

ఓహో మానవులారా !
క్రమించండి, మీరు విక్రమించండి !
ఔరా పిశాచులారా !
క్రమించండి, మీరిక నిష్క్రమించండి !

పిశాచ కంఠం:

గాంధీజీ మరణం !
మరణం మరణం మరణం
గాంధీజీ మరణం !

ప్రాణోదయ మైనపుడే పడగెత్తానోయి నేను !
ప్రతినరు హృదయాంతరాన బ్రతికే వున్నానునేను !
శోకాంతర ఘనతిమిరం, గుండెలు కుళ్లే నిరాశ
వెనుకోరలు పీడకలలు అన్నీ నా స్వరూపాలు!
కుటిలస్వార్థ ద్వేషంతో క్రూరకుటిల కుట్రలతో
నరయాత్రను ప్రళయఘోర నరకంగా మార్చుతాను !—
నరులు పురుగులై విలవిల అల్లాడిన తొలినాడే:
ఒక సోక్రేటస్ వాక్కు—వెడలి మీరు లేచి ముందడుగిడ
గద్దెనెక్కి— ధర్మమూర్తినై గరళం త్రాగించా:
ఒకజీసస్ కనులకాంతి మీ మనస్సు వెలిగించగ
పలికి మతాచార్యుడనై శిలువమీద నాటించా:
ఒకబుద్ధుని కరుణాశ్రువు మీ హృదయం వికసింపగ-
కాలగతిని కఠినశిలా విగ్రహాన బంధించాం!
నేడీ గాంధీజీ మీ నీరస మానవజాతిని
కంఠాశ్లేషమున నెత్తి ముందుకు నడిపించునా ?
ఎక్కడికీ మహాయాత్ర ?
నరాలు మెరుపులు, కన్నులు జ్యోతులు
ఊపిరి తపస్సు, ఊహలు సత్యాలైనవి
ఎక్కడికీ మహాయాత్ర ?
పొంచిదాగి బలిగొన్నాను ! పడగవిసిరి బలిగొన్నాను !
ఏవాక్కూ మిమ్మిక మేల్కొల్పలేదు
ఏకాంతీ మీ మార్గం వ్యాపించదు
ఏకరుణా మీస్వర్గం స్థాపించదు
ఇక శోకం మీ లోకాన్నేలుతుంది !

గాంధీజీ మరణం !
మరణం మరణం మరణం
గాంధీజీ మరణం !

అమర కంఠం:

గాంధీజీ మరణం !
గాంధీజీ గాంధీజీ గాంధీజీ
గాంధీజీ మరణం !

పదిలక్షల గుండెలు పొదిగిన
ఒక స్వప్నం కన్నీరై కారినట్లు :
పదిలక్షల గుండెలు పండిన
ఒక సూర్యుడు బ్రద్దలుగా పగిలినట్లు :
పదిలక్షల గుండెల జ్వలించు
ఒక సత్యం దుర్భ్రమగా మారినట్లు :

గాంధీజీ మరణం !
గాంధీజీ గాంధీజీ గాంధీజీ
గాంధీజీ మరణం !

ఆవులించు ఎడారిలో అర్ధరాత్రి ఆకలితో
తల్లి పాలరొమ్ము కనని పిల్ల ఏడ్చినట్లేడ్చితి :
నోరులేని బాధనేను ! కనులులేని కోర్కెనేను !
పుడమి, కడలి బొబ్బరిల్లి భోరున రోదించు - కాని :
దిగంతాల వ్యాపించిన దివ్య మానవుణ్ణి నేను !
ఉదయం ఊహలు శిశువులు, హృదయం వర్షం హాసం
అన్నీ నా స్వరూపాలు !
అంధయుగా లధోగుహాలు రణమరణం దుష్ట వాంఛ
భూకంపం పెనుతుపాను లధిగమించి వస్తున్నా !
గగనమంటు దవ జ్వాలనై పగనై లేస్తున్నా !

"బ్రతుకనంత మగాధమిది
బ్రతుకు కజేయు సమరమిన్నది—

బ్రతుకు నెవ్వ రార్పువారు ?
ప్రగతి నెవ్వ రడ్డువారు ?"
గరళం తాగినవాణ్ణి, శిలువను మోసినవాణ్ణి
మహా బోధి నీడ చిరతపస్సమాధి నున్నవాణ్ణి
ప్రతిజ్ఞ ఇదిగో వినండి !
"పిశాచగణ మాశ్రయించు
నిశీథాలు చీల్చుతాను !
జ్వాలాప్రవాహమై మన
జైత్రయాత్ర సాగుతుంది !
ఇక స్వప్నా లిక సత్యా
లిక సూర్యులు మన బ్రతుకులు !
జ్యోతులు వెలిగించండి !
జ్యోతులు వెలిగించండి !"

కవి గీతం:

ఓ మహాత్మా ! ఓ మహర్షి !
అనాగరికనరజాతికి అక్షరాలు నేర్పినావు !
మృగసమరజ్వరం మాన్పి జాగృతి దీపించినావు !
ఓ మహర్షి ! ఓ మహాత్మా !
ఉన్నారిట నీ సంతతి జ్ఞానప్రఫుల్లిత నేత్రా
లున్నారిట నీకాంతిలో ఉత్తమ ధర్మ నినాదాల్
ఓ మహాత్మా ! ఓ మహర్షి !
ఒరిగిపోడు మానవుడిక ! ఉరికిముందు కుప్పొంగును !
భూగోళం కౌగలించి గగనం కెగబ్రాకి సాగు !
ఓ మహర్షి ! ఓ మహాత్మా !

చిరంజీవి! ★

(శ్రీ హారీ్ ఛటో ననుసరించి
మల్లవరపు : అనువాదం)

మరువకుడీ జనులారా
మనకోసం కలలు కన్న
మహాత్ముణ్ణి! మహాప్రాణి!

భారతదేశ విముక్తికి బంగారపు కలలుకన్న
మహాత్ముణ్ణి, పేదజనుల పెన్నిధియా మహాత్ముణ్ణి!

గోచిపాత దాల్చితాను దేశస్థుల కట్టబెట్ట
నూతన ధవళాంబరముల నాతనికల! ఆతనికల!

నిరాహారదీక్ష నెలలు తనదేహం బలిచేసుకు
జనపాళికి భుక్తిగూర్ప కలగాంచెను! కలగాంచెను!

దార్జన్యపు లోకాటవి నాతని దేకాంతవాణి!
కంటకపథ జీవయాత్ర గాయమైన పాదయుగళి
కాయము క్షతమై వ్రాలిన కదలిపోవు నేకాగిగ
కలకాలపు కలలదారి!

మరువకుడీ! జనులారా! చిరంజీవి మహాత్ముణ్ణి!

(2)

గాంధీజీ హత్య

మతదురహంకార ఫాసిస్టు కృత్యము

రచయితల కర్తవ్యం

■

శ్రీ పి. వి. శివయ్య

"గాంధిజీని తుపాకితో కాల్చారు" అని రేడియో కార్యక్రమం మధ్యలో ఆపి ప్రకటించింది. వినేవారి మనస్సు చకితమైంది. కాని– నమ్మలేదు.

కొంత సేపటికి మళ్లీ, "హంతకుడు మూడు మార్లు కాల్చాడు గుండు మహాత్ముని గుండెలోంచి దూసుకుపోయింది. పరిస్థితి ఆందోళనకరంగా ఉంది"

శ్రోతలు నిర్ఘాంతపోయారు. మొదటి వార్తను విని అంతంతటనుంచి ప్రజలు ఆశ్చర్యంతో రేడియోల చుట్టూ గుంపులుగా మూగారు.

ఇంతలో మళ్లీ, "గాంధిజీ పరమపదించారు"

శ్రోతల గుండెలు, గొంతుల్లో కొట్టుకొని నిలిచాయి. ఏమీతోచదు. మాటల్లేవు ఆర్చిన కనురెప్పల వెంట అశ్రువులు ధారలైనాయి. "గాంధీజీ......"

అందరికీ దగ్గుత్తికలు పడ్డవి ముస్లిం నాయకుడు లియాకతు మూర్ఛిల్లాడు. ముజఫర్ పూర్ లో ఒక ముస్లిం గుండె పగిలి చనిపోయాడు.

మరొక వ్యక్తి "గాంధీజీతో పాటే నేనూ" అని సముద్రంలో దూకాడు.

పట్టణాల్లో, పల్లెల్లో, వీధి వీధినా, సందు సందునా, యింటింటా– హాహాకారాలు ఏడ్పులు. ఏడ్పులతో ఎర్రబారి గాజుగుడ్లలాగయి, కన్నులు రెప్పలార్చడం లేదు. ఉచ్ఛ్వాస నిశ్వాసాలు ఆడక, ఎదురొమ్ముల సముద్రాలు లోకొక్కొక్క అలగా పైకుబికి వస్తుంది.

జాగృతజాతికి జీవస్ఫూర్తి –

నూత్న సంస్కృతికి జీవదాత :

ఢిల్లీలో, ఒక బక్క చిక్కిన వ్యక్తిని ఎవడో చంపితే దేశమింత ఘోషిల్లడమెందుకు? ఆ బక్కచిక్కిన వ్యక్తిలో విశాల భారత జాతీయ హృదయం వసించింది.

"ఒక హిందూ మహావ్యక్తిని 'ఇండియా' కోల్పోయింద"ని కాయిదే-ఆజాంలాంటి నాయకులు విచారించవచ్చు. కాని ఆ మహావ్యక్తి హిందూ–ముస్లిం భేదం లేకుండా నలభైకోట్ల భారతీయుల హృదయాలను వశపరుచుకున్న మహాపురుషుడు.

చిరకాల దాస్యపు రాయిడికి; చిట్లి చీలి దారులు దారులైన జాతిని తిరిగీ ఒక ప్రజగా, ఒక సమాజంగా నిలుపజాలిన నూత్న సంస్కృతికీ, నూత్న జాగృతికీ సృష్టికర్త, జీవన్మూర్తి.

దక్షిణాఫ్రికా బ్రిటిషు పరిపాలనలో భారతీయులందరూ అంటరానివారే! తెల్లవారి రైళ్లెక్కరాదు. తెల్ల హోటళ్లు ప్రవేశించరాదు. తెల్లవారి గడపలు తొక్కరాదు. ఈ నల్లని అంటరానితనాన్నెదిరించి పోరాడాడు. జయించాడు.

ఇండియాలో బ్రిటిషు పరిపాలన క్రింద భారతీయులకు భారతీయులే అంటరాని వాళ్లు. ఇందులో తెల్ల బాధ్యతేముంది? అంటరానితనాన్ని తరతరాలుగా ధర్మమని సమర్థిస్తూన్న మన పాతసమాజ వ్యవస్థదే బాధ్యత. అస్పృశ్యతా నివారణోద్యమం ప్రారంభించాడు.

స్వతంత్రదేశాల్లో స్త్రీలు స్వతంత్రులు. తమ భవిష్యత్తుకు తామే అధికారిణులు. పురుషులతో పాటు జాతీయ జీవనంలో సమానపాత్ర వహిస్తారు. మరి మన దేశంలోనో— బాల్యవివాహాలు, జీవిత పర్యంత వైధవ్యాలు, విద్యాగంధంలేని అజ్ఞానాంధ జీవితాలు మన స్త్రీలవి. సమాజంలో సగపాలున్న స్త్రీలను దాస్యంలో వుంచిన సనాతన ఛాందసాన్నెదిరించాడు. స్త్రీలు సంస్కారోద్యమాల్లో, స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొనాలని పిలుపిచ్చాడు. స్వచ్ఛంద సేవికాదళాలెన్నో ఏర్పడ్డాయి.

భారతీయుల అజ్ఞానానికీ, దరిద్రానికీ మూలకారణం పరప్రభుత్వంక్రింద బానిసత్వమే. పరప్రభుత్వాన్ని తొలగించడానికి సత్యాగ్రహమాయన ఆయుధం. సత్యాహింసలద్వారా శాంతిస్థాపన ఆయన ఆశయం. ఎందరు సత్యసంధులు లేరు? ఎందరు అహింసావ్రతులు లేరు? ఎందరు శాంతికాముకులు లేరు?

గాంధిజీ గొప్పతనమెందులో ఉంది? సత్యం, అహింస, శాంతి! యివి యెన్ని రూపాలెత్తినా, ఏస్వభావం పొందినా స్థలకాలాల ననుసరించి ఎన్నివిధాల నిర్వచింపబడినా, ఇవి మానవలోకానికి వాంఛితాలు. ప్రియతమాలు. ఇవి శాశ్వత సత్యాలు. కాని యిదికాదు విశేషం.

గాంధీజీ వీటికి రాజకీయ నిర్వచనమిచ్చాడు. బానిసత్వంలో అణగారిన భారతీయులకు వీటిద్వారా పరప్రభుత్వపు నిరంకుశ యంత్రాన్ని ధిక్కరించడం నేర్పాడు. రాజకీయ పోరాటంలో స్వతంత్రం కొరకు త్యాగంచేయడం నేర్పాడు. బానిసత్వం రేకెత్తించిన అసంతృప్తిని జాతీయ చైతన్యంగా తీర్చిదిద్దాడు. గాంధీజీ మహాత్ముడయ్యాడు. ప్రపంచ మాతన్ని శాంతిమాతన్నది.

బెంగాలు విభజనోద్యమ ప్రారంభం నుంచి దేశంలో హిందూమహమ్మదీయ సమస్య తలెత్తటం ముస్లింలీగు స్థాపన తెల్లప్రభువులు హర్షించడం, స్వాతంత్ర్యోద్యమానికి అపాయసూచనలు. "హిందూ ముస్లిం ఏక్ హో" అని నినాద మిచ్చాడు. ఖిలాఫత్ సమస్య చేపట్టాడు. దేశంలో అలీసోదరులు భీమార్జునులు గాంధీజీ ధర్మజుడు. ధర్మయుద్ధం, సవ్యభారతయుద్ధం, అని కథలు చెప్పుకున్నాం. రౌలటు చట్టం, పంజాబు వధల తరవాత, అగ్ని

పర్వతం బ్రద్దలైంది. సం॥ 1920–30 లలో రెండు బ్రహ్మాండమైన జాతీయ ఉద్యమాలు సాగాయి. హిందువులు సిక్కులు మహమ్మదీయులు అందరు సోదరసైనికులవలె కలిసి పోరాడారు, కలిసి త్యాగం చేశారు, కలిసి రక్తం చిందించారు.

ఈ ఉద్యమాలు దేశం మూలమూలలకు ప్రాకాయి. వీటికి గాంధీజీ మంత్రోత్సాహం, గాంధీజీ శక్తి కేంద్రం. గాంధీజీ నాయకుడు, దేశప్రతినిధిగా కాంగ్రెసు ఆయనలో లీనమైంది.

యువకులు పోరాడారు. ప్రజలు స్వతంత్రజీవితపు కలలు గన్నారు. విద్యార్థులు కార్యశూరులైనారు. కవుల కలాలు వీరవిహారం చేశాయి. "గాంధీ విజయం" "పాంచాల పరాభవం" నాటకాలు, "మాలపల్లి" నవల "మాకొద్దీ తెల్ల దొరతనం", "దండాలండిబాబు", "వద్దురా మనకొద్దురా" పాటలు ప్రతి తెనుగునోట ధ్వనించి, తెనుగుకొండలు ప్రతిగర్జలు చేశాయి. తెలుగు సంద్రాలు ప్రళయ ఘోషలు చేశాయి.

అస్పృశ్యతా నివారణ, మద్యనిషేధం, స్త్రీ స్వాతంత్ర్యం, హిందూ-ముస్లిం ఐక్యత అన్ని ఉద్యమాలను ప్రతిబింబించుతూ, కథలు, నాటకాలు, పాటలు, ఎన్నెన్నో వెలువడ్డాయి. అఖిలభారతంలాగే తెలుగు జీవితం గాంధీజీతో మిళితమైపోయింది. తెలుగు సారస్వత వికాసంలో, తెలుగు జీవితవికాసంలో అది గాంధీఘట్టం. గాంధీ యుగం. గాంధీజీయెడల తెలుగుల ప్రేమ, భక్తి విశ్వాసాలు చూడండి: బసవరాజు అప్పారావెలా పాడాడో—

నాల్గు పరకల పిలక నాట్యమాడే పిలక
నాలుగూ వేదాల నాణ్యమెరిగిన పిలక॥
బోసినోరు విప్పితే ముత్యాల తొలకరే
పెదవి కదలించితే వరహాల వర్షమే॥
చకచక నడిస్తేను జగతి కంపించేను
పలుకు పలికితేను బ్రహ్మ వాక్యేను॥

భారత జాతీయోద్యమ పితరుడు, బాపూజీ, మహాత్మాజీ, గాంధీజీ, నిర్యాణం చెందితే, అఖిల భారతదేశమూ, తెలుగు దేశమూ దుఃఖించదూ? ప్రపంచమే సంతాపం చెందదూ? ఆశ్చర్యమా?

ఈ హంతకుడెవడు ?

నాథూరామ్ వినాయక్ గోడ్సే అనామకుడు గాడు, "హిందూరాష్ట్ర" అనే హిందూమహాసభ పత్రికా సంపాదకుడు. అతడు హిందూమహాసభ దురహంకారి. ఉన్మాదపు పోటులో యేమన్నా గాంధీజీని హత్యచేశాడా? కాదు. చేజేతుల, కావాలనే చేశాడు.

దీనివెనుక కుట్రవున్నది. కటక్ రాష్ట్రీయ స్వయంసేవక సంఘ ఆఫీసులో పెన్సిలుతో గీసిన బొమ్మ దొరికింది. గాంధీజీ గుండెపైన గుండుదెబ్బ. దానికి సూటిగా గురిపెట్టిన రివాల్వరు!!

ఈ హత్య కెన్నాళ్ళనుంచి ప్లాను వేశారో. అంతకు పూర్వమొకడు ప్రార్థన సభలో గాంధీజీపైన చేతిబాంబు విసిరాడు, ఇతర కాంగ్రెసు నాయకులను గూడ హత్యచేసే ప్రయత్నాలున్నాయని ప్రభుత్వమే ప్రకటించింది.

హత్యకు వెనుక

ముస్లింలీగు నాయకుల మతతత్వపూరిత

మైన పాకిస్తాన్ ప్రచారం ప్రారంభమైన తరువాత, బ్రిటిష్ ప్రభుత్వం "స్వతంత్రం" పేరట దేశాన్ని చీల్చివేసే మంత్రిత్రయ ప్రణాళిక వద్దిన తరవాత, హిందూమహా సభ ముస్లిం విద్వేషాన్ని హిందూ ప్రజల్లో రెచ్చగొడుతూ వచ్చింది. గాంధీ జీ నెహ్రూలు తమతమ మార్గాల్లో యీ మత విద్వేషాన్ని ఖండిస్తూ వచ్చారు. మంత్రివర్గ ప్రణాళిక నంగీకరించడంతో, దేశాన్ని మత ప్రాతిపదిక మీద ఇండియా పాకిస్తాన్లుగా చీల్చడంతో, హిందూ-ముస్లిం మత దుర హంకారులు చెలరేగారు. లీగుకు కాళ్లొచ్చి నాయంటే గాంధీ, నెహ్రూ కాంగ్రెసు లే కారణమని, వారిపైన హిందూమహాసభ నాయకులు తీవ్రమైన విషప్రచారం చేస్తూ వచ్చారు.

రెండవ ప్రపంచ మహాయుద్ధం తరువాత భారతదేశంలో మరల విప్లవ సముద్రం పొంగింది. మత విద్వేషాన్ని మతకలహా లనూ తుడిచిపెట్టేస్తున్నది. కార్మికులు, కర్షకులు, విద్యార్థులు, ఉద్యోగులు, పోరాట రంగంలో కురికివచ్చారు. ఈవిప్లవోధృతికి పరాకాష్ట నావికా సైన్యం తిరుగుబాటు.

బ్రిటిషువాళ్లు కుట్రచేశారు. ఈ విప్లవాన్నణచడం తమచేతకాదు; కాంగ్రెసు లీగునాయకుల చేతనే చేయించాలి. వారి నధికారంలో పెట్టాలి. తాము వెనుక నాటక మాడాలి. స్వతంత్ర మిస్తామన్నారు! దేశాన్ని చీల్చారు! అధికారమిచ్చారు! ఆగస్టు 15 న స్వతంత్ర మొచ్చింది?

పాకిస్తాన్ (ముస్లిం)మతరాజ్యం. ఇండియన్ యూనియన్ మతరాజ్యం కాదు. ఇండియన్ యూనియన్ హిందూ మత రాజ్యం కావాలి. పాకిస్తాన్ పైన దండెత్తాలి. జయించి అఖండ హిందూస్తాన్ కరిపించాలి. ఇదే మత దురహంకారులకోర్కె.

"హిందూమత రాజ్యం!" "ముస్లిం మత రాజ్యం!" మతదురహంకారులు చెలరేగారు. ముస్లింలీగు, ముస్లిం నేషనల్ గార్డ్సు హిందూమహాసభ, రాష్ట్రీయ స్వయం సేవకసంఘం, సిక్కు అకాలీదళం, పంథిక్ బోర్డు అల్పసంఖ్యాకుల హత్యకు తారసిల్లాయి.

పాకిస్తాన్ లో, ఇండియన్ యూనియన్ లో ప్రజలకు కావలసింది ప్రజాతంత్రం. దున్నే వాడికి భూమి, కష్టించే వాడికి తిండి, అల్పసంఖ్యాకుల ధన ప్రాణ మాన సంస్కృతులకు రక్షణ. అన్నదమ్ముల పోరులేని, అన్ని జీవితసుఖాలూ వున్న ఐక్యభారత ప్రజారాజ్యం. అందుకే సామాన్యుల తహతహ, ఆందోళన, పోరాటమూనూ.

స్వార్థపరులకు, పరాన్న భుక్కులకు ఇది గిట్టుతుందా? ఇది సాగితే తమ గతి ఏమౌతుంది? కాదు— ఇది సాగనీయ కూడదు. జమీందారులు, "స్వతంత్ర" సంస్థానాధిపతులు, కోటీశ్వరులు మత రాజ్యాలకొరకు జరిగే మారణహోమంలో ఆజ్యం పోశారు. బ్రిటిషువారు మారణాయుధా లిచ్చారు వీరందరికీ.

దేశం మండుతూంది! ఎన్ని లక్షల భారతీయప్రాణాలు బలియైనాయో. రక్తమెన్ని నదులు పారిందో! ఎందరు హిందూ ముస్లిం యువతులూ, తల్లులూ, బిడ్డలూ అనాథలై ఘోషిల్లారో!! ఎన్నిలక్షలం దిక్కులేని కాందిశీకులు!!!

అబ్బ! ఆగస్టు 15! స్వతంత్రమా? కాదు. ప్రజలకు సుఖజీవనం లేనిది స్వతంత్రం కాదు. అల్పసంఖ్యాకులకు రక్షణ లేనిది స్వతంత్రం కాదు.

నెహ్రూ ఖండించారు, గాంధీజీ ఖండించారు. ప్రాయోపవేశాలు చేశారు.

నరరక్తం చవిచూచిన పులికి భగ్ర పన్నాలు రుచిస్తాయా?

మతదాహానికి, మతరాజ్యానికి గాంధీజీ అడ్డు. నెహ్రూ అడ్డు. నెహ్రూ ప్రభుత్వం అడ్డు. "గాంధీజీ నశించాలి!" "నెహ్రూ నశించాలి" ఇవీ నినాదాలు ఇదీ ప్రచారం. విద్వేషం, అసహనం, మతదురహంకారం. కత్తులు, కర్రలు, గండ్రగొడ్డళ్లు, పిస్టళ్లు, తుపాకులు కవాతులు, సంచాలకులు-రాష్ట్రీయ స్వయంసేవక పదఘట్టనలకు భూమాత ఘూర్ణిల్లుతోంది. అంతా ఫాసిజం! పచ్చి ఫాసిజం!! ఉత్తమ నాగరకతా సంస్కృతుల వినాశనం.

పాకిస్తాన్ నుంచి పారిపోయి వచ్చిన కాందిశీకులీ ప్రచారానికి మొనటిబలి. దేశం మూలమూలలకు కాందిశీకులు చేరారు. వారు చేరినచోటల్లా మతద్వేష బీజాలు మొలకెత్తినవి. స్వార్థపరులందరూ కొందరు విద్యార్థులూ, ఈ మొక్కలకు నీరుపోస్తున్నారు; పెంచుతున్నారు.

ఢిల్లీలో లక్షలు కాందిశీకులున్నారు. అక్కడ నుండి పారిపోయివచ్చిన యీ కాందిశీక భీరువులు యిక్కడ వీరులు. వీరిలో ముస్లిం విద్వేషాగ్ని కణకణలాడుతూంది. విరజిమ్ముతూన్న వేడిమికి ఢిల్లీ పౌరులుగూడ తల లొగ్గారు. ఢిల్లీ అంతటా "గాంధిజీ నశించాలి. నెహ్రూ నశించాలి, నెహ్రూ ప్రభుత్వం నశించాలని, కరపత్రాలుపంచితే ఢిల్లీపౌరులు ఉదాసీనత్వం వహించారు. హిందూముస్లిం సఖ్యతకోసం గాంధీజీ జనవరి 13న ప్రాయోపవేశం చేశి నప్పటికీ వాతావరణం అంతసుముఖం కాలేదు.

హిందూమహాసభ, రాష్ట్రీయ స్వయం సేవక సంఘ ఫాసిస్టులు ఇదే అదనను కున్నారు. ఎన్నాళ్లనుంచో వేసుకున్న ప్లానులు సాధించాలనుకున్నారు. డిసెంబరు 20 న బాంబువిసర బోయారు. సాగలేదు. ప్రభుత్వం కదలక పోవడంతో మరీ తెగించారు. డిసెంబరు 30 న ప్రార్థనవేళ రెండుగజాలదూరంనుంచి గోడ్సే కాల్చాడు. గాంధిజీ కాలగర్భంలో లీనమైనాడు. కటక్ సోదాలో బయటబడ్డ చిత్రం నిజమైంది.

ప్రజల క్రోధాగ్ని

భారతప్రజల కిన్నాళ్లూ ఈ హిందూ మహాసభ ప్రచారమూ, యీ రాష్ట్రీయ స్వయంసేవక సంఘ సంచాలకలూ తెలియక పోలేదు. కాని ఉదాసీనులై సహించారు. ముస్లింలీగు యొక్క మతద్వేష ప్రచారంవల్ల అలా జరిగి ఉండొచ్చు. పాకిస్తాన్ లోని హిందు సిక్కు అల్పసంఖ్యాకుల చిత్రవధలవల్ల ఇండియన్ యూనియన్ ప్రజలుగూడా మనసులు కినుకతో ప్రతీకారాన్ని కోరి యుండవచ్చు. లేదా ఇదంతా రాజకీయప్రచారమేగాని నిజంగా ఈ నినాదాలు ఆచరణలోకిరాని బుకాయింపులే ననుకొని యుండవచ్చును.

అందుకనే గాంధీజీని కాల్చివేశా రనగానే భారతప్రజలు, నిశ్చేష్టులు, నిశ్చేతనులు అయినారు. సర్వతో ముఖ వికసిత

మైన ఆయన వ్యక్తి, నూతన సంస్కృతికి నూతన జాతీయ చైతన్యానికి తానే పితయై ప్రోదిచేసిన ఆయన వ్యక్తి, సత్యము, అహింస శాంతియన్న శాశ్వత సత్యాలను తనలో యిముడ్చుకుని, దిగంతాలకు విరియించిన ఆయన విశ్వవ్యాపక వ్యక్తి. క్షణ కాలంలో ప్రత్యక్షమైంది ఇలాంటి మహాత్ముడా, హతుడైనాడు!

హంతకుడొక హిందువు. హిందూమహాసభవాడు; హిందూ మహా సభికులు, రాష్ట్రీయస్వయంసేవకులు పండుగలుచేసుకున్నారు. హిందూమహాసభ నాయకులు, సంస్థానాధిపతులు మొసలి కన్నీళ్లు విడిచారు. బ్రిటిషు టోరీపత్రికలు భారతీయ సమస్యా పరిష్కారాని కున్న పెద్ద ప్రతిబంధకం ఒకటి తొలగిపోయిందని సంతసించాయి.

ఎంతటిక్రూరత్వము! ఇండియన్ ఫాసిస్టు రాక్షసుల యీ కుట్రయొక్క నగ్నమైన అమానుషత్వం దేశమంతటికీ తెలిసివచ్చింది.

ప్రజాక్రోధాగ్నికి చెలియలికట్టలు తెగినవి. విక్రమించింది. హిందూ మహాసభ, రాష్ట్రీయ స్వయంసేవక సంఘ కార్యాలయాలు ఆ నాయకుల ఇళ్లు బద్దలైనవి, దగ్ధమైనవి. ఆ సభ్యుల్లో అవ్యక్త వారందరికి దేహశుద్ధి జరిగింది ఇంకా జరుగుతోంది. ప్రభుత్వం యొక్క మిలిటరీ అడ్డు వచ్చినా ఆగటం లేదు.

ప్రతిపట్టణంలో, ప్రతిపల్లెలో, బ్రహ్మాండమైన ప్రదర్శనాలు బ్రహ్మాండమైన సభలు భారతజాతి పసిఫిక్ మహాసముద్రమై ప్రళయఘోష చేసింది. 'మత దురహంకారులు నశించాలి! హిందూ మహా సభ రాష్ట్రీయ స్వయంసేవక సంఘాలను నిషేధించాలి! హంతకులను ఉరితీయాలి! ప్రభుత్వం నుంచి మత దురహంకారులను తొలగించాలి!!'

ప్రభుత్వం కదలక తప్పలేదు. దేశమంతటా రాష్ట్రీయ స్వయంసేవక సంఘాలను నిషేధించారు. ఆ సంఘాల నాయకులను వందల కొలది అరెస్టు చేశారు. హంతకుల కుట్రను పరిశోధిస్తున్నారు. దేశాన్ని శాంతంగా ఉండమన్నది పటేలు నెహ్రూ ప్రభుత్వం!

ఇంతటితో సరిపోతుందా? లేదు. క్రొత్త ఆశయం—పాత సిద్ధాంతం!

ప్రభుత్వం శాసనాలుప్రయోగించడమే చాలదు. మత దురహంకార రూపమైన ఫాసిజం యొక్క మూలకారణాన్ని ఛేదించాలి.

ప్రస్తుత సమాజం ద్వంద్వాత్మకము. ప్రజాపక్షం ఒకటి – ప్రజా వ్యతిరేకులైన స్వార్థపరుల పక్షం రెండోది. ప్రజలకు సుఖజీవనం కావాలి. నూతనమైన ప్రజాతంత్రము కావాలి. నూతనప్రజాసంస్కృతి కావాలి. స్వార్థపరులకు పాతదోపిడీ సాగాలి. పాతనిరంకుశత్వం సాగాలి. పాత కాలపు ధన సంస్కృతిసాగాలి.

గాంధీజీ ద్వంద్వాత్మకుడు. గాంధీజీ ఆశయాలు ప్రజాపక్షానివి. నూతనమైనవి. గాంధీజీ సిద్ధాంతం ధనపక్షపాతి. పాతదే. ప్రజా పక్షానికి ధనికపక్షానికి ఘర్షణ చూచాడు. ప్రజల అనుభవం చూచాడు. వ్యథపడ్డాడు. ఆశయాలను మనసార విశ్వసించిన సత్యాశ్రయుడు. మార్గమాలో చించాడు, ధనవంతులు ధర్మకర్తలుగా

ప్రజలకోర్కెలు నీడేర్చుతున్నాడు. కలవారికీ లేనివారికీ సామరస్యం ఉండాలన్నాడు "శాంతి" పేరిట "అహింస" పేరిట ప్రజలు తమ జీవిత పోరాటాలను ఆపేయాలన్నాడు. సత్యాగ్రహమైనా బ్రిటిషు వాని పైనేగా? వాడేడీ? గాంధీజీ పాత సిద్ధాంత పరిధులు దాటలేకపోయినాడు. ఇది ఆయన వైఫల్యాలన్నింటికి మూలమైన వైఫల్యం.

కోటీశ్వరులు, జమీందారులు, సంస్థానాధిపతులు, ధర్మకర్తలు. ఇది విపరీతం ప్రజలకు జీవిత పోరాటాలు తప్పలేదు. వీటిని గాంధీజీ హింసయని ఖండించారు. రాష్ట్రాల్లో, కేంద్రంలో ఉన్న కాంగ్రెసు ప్రభుత్వాలు వీటి నణచివేస్తున్నాయి. ఈ విచిత్ర ధర్మకర్తలైన కోటీశ్వరులు, జమీందారులు, సంస్థానాధిపతులు– అందరికీ ప్రభుత్వరక్షణ దొరికింది వీరి ప్రతినిధులైన మతవాదులకు, ధనవాదులకు రాష్ట్ర కేంద్ర ప్రభుత్వాల్లో స్థానాలు దొరికాయి. "స్వతంత్ర రాజ్యాంగం" కూడ వారిదే అవుతున్నది. గాంధీజీ హత్యకు కూడా వీరే ధర్మకర్తలు.

గాంధీజీ ఆశయాలైన నూతన ఆర్థిక విధానం, నూతన ప్రజాతంత్ర రాజకీయవిధానం, ఈ రెంటిమీద ఆధారపడిన నూతన ప్రజాసంస్కృతి వీటి నిర్మాణం కొరకు బ్రహ్మాండమైన ప్రజా ఉద్యమాలు నడుస్తున్నాయి.

కార్యక్రమం -

గాంధీజీ హత్య ఈ ఉద్యమాలకు గల నూతన ఫాసిస్టు ప్రమాదాన్ని స్పష్టంగా గుచ్చెత్తి చూపింది. ప్రజలు మరింత జాగృతులైనారు. ప్రజాసంస్థల్లోని, ప్రజా ఉద్యమాల్లోని అభ్యుదయ కాముకులంతా జాగృతులైనారు. చిన్న చిన్న విభేదాలను మాని యేకమౌతున్నారు. దురదృష్ట

[తరువాయి 77 వ పేజీలో]

గాంధి చనినాడు

శోకదేవత విశ్వరూపమును దాల్చి
లోకమంతట వికృత తాండవము చేసె;
దేశదేశాల, పలువిధ జాతులందు
సకల మతముల, మూలమూలలను దాని
చూచి, నిర్ఘాంతపోవని వారులేరు;
కటికి చీకటి దిశలెల్ల క్రమ్ముకొనెను.

— శ్రీ తాపి ధర్మారావు

మహాకవి శ్రీ గురజాడ అప్పారావుగారి వ్యాసం

విద్యా పునరుజ్జీవనము

★

సంగ్రహకుడు : శ్రీ అవసరాల సూర్యారావు

★

[ఈ శీర్షికతో రాసిన పంతులుగారి వ్యాసం పూర్తిగా లభ్యంకాలేదు. మార్పులేమీ లేకుండా యథాతథంగా ప్రకటిస్తున్నాము.]

విద్యలలోనూ, కళలలోనూ మునుపటి గ్రీకులు సాటిలేనివారై యుండేవారు. గ్రీకుల స్వాతంత్ర్యము సన్నగిల్లిన తరవాత, రోమనులు తలయెత్తి ఆనాటి లోకమును ఏకఛత్రంగా యేలిరిగాని విద్యలలో గ్రీకుల ఛాయలను బట్టిపోయిరి. కొంతకాలానకు, ఇటలీ దేశము కిరాతులు జయించడమును, రోమనులు కిరస్తానులు కావడము జరిగింది. కిరస్తానులకూ, కిరాతులకూ గ్రీకులవిద్యలయందు ఆదరణ లేక దేశం కొన్ని సంవత్సరములు అజ్ఞానాంధకారం కమ్మి వుండినది.

అంతట కొన్ని కారణముల చేత ఇటలీలో జాత్యభిమానమునూ, దేశాభిమానమునూ మొలకెత్తి బలిసినవి ; పాతవిద్యల నేర్చు అభిలాష కలిగినది. ఆ సమయంలో యిస్తంబూల్ తురకల పాలుకాగా, అక్కడి గ్రీకు పండితులు కొందరు యిటలీకి వచ్చి అక్కడి ప్రభువులవల్ల మన్ననలంది, గ్రీకు విద్యలను తిరిగి లేవనెత్తిరి. దీనినే "రినైవల్ ఆఫ్ లెటర్సు" (Revival of letters) అంటారు.

యూరోపుఖండం అజ్ఞానంలోనుంచి మేలుకోవడం అప్పుడే.

అదివరకు టోపీజాతులవారు కిరస్తాన మతమే నిజమైన మతమనిన్నీ విగ్రహారాధనచేసే గ్రీకు రోమనుల విద్యలలో విలువుండనేరదనీ వారి విద్యలు చదువుతే పాపమనీ నమ్మి ఉండేవారు. ప్రజలకు విద్య నేర్పితే దేశం బాగు పడు నన్న జ్ఞానము లేకపోయెను. బైబిలు నిర్జీవమైన లాటిను భాషలో చదివే వారు. దైవప్రార్థనలుకూడా ప్రజలకి అర్థంకాని లాటిను భాషలోనే వుండేవి. బయిబిలుదాటి సత్యమూ జ్ఞానమూ లేదనిన్నీ విగ్రహారాధకులైవుండే గ్రీకు రోమనులు మూర్ఖులనిన్నీ కిరస్తానులు నమ్మేవారు.

ఇటలీలో గ్రీకు లాటిను సరస్వతి ఉదయించగానే జనులకు కళ్లుమసకమాసినది. బుద్ధిమంతులు కిరస్తానుల మో[illegible] మౌర్ఖ్యమూ విగ్రహారాధకులై వుండిన గ్రీకులాటినుల జ్ఞానమూ కళాకౌశల్యమూ చూడగలిగిరి. యూరోపులోబుద్ధికి గొలుసులూడినవి. ప్ర[illegible] [illegible]స్వైన చేపట్టుట వలన ప్ర[illegible] [illegible]క్కింది.

వాటి రసానకు లోనైన విద్వాంసులు దేశభాషలు నిరసించేవారు.

గాని దేశాభిమానమూ, జాత్యభిమానమూ ప్రబలుటచేత మిక్కుటమైన ఆ దేశాభిమానం, ప్రతిభావంతులచేత దేశభాషలలో చెయిపట్టి రాయించింది. ఆ కథ ముందుచెబుతాను.

లాటినుకూ, యిటాలియనుకూ ఆనాడు వుండే భేదము సంస్కృతానకూ ప్రాకృతములకూ వుండిన యట్టిది. కొంతవరకూ గ్రాంధిక తెనుగుకూ, వాడుక తెనుగుకూ వున్న భేదంవంటిది వుతర దేశాలలో సంస్కృత ప్రాకృతములనే గాని, దేశభాషలను రాయడం పరువుతక్కువ అని పండితులు చాలా కాలం తలచేవారు. ఇప్పుడు ఆ భ్రమ తరిగిపోయినది. బంగా[illegible] ఆదరించడముకు సాహిత్య పరిషత్తులో సభ అయినప్పుడు "యిప్పటిబంగాళీకవులు సంస్కృత కవులను మీరినారని" వొక ప్రసిద్ధుడైన సంస్కృత పండితుడు నాతో అన్నాడు.

తెనుగు దేశంలోనూ, యిట్టి చిక్కు మునుపు కలిగింది. ఇప్పుడు కలుగుతూంది సంస్కృతాన్ని పట్టి అప్పుడూ కలిగింది. ప్రాచీన గ్రాంథిక భాషనుపట్టి యిప్పుడు కలుగుతూంది.

ఆంధ్రశబ్ద చింతామణి కవి అన్నాడు "స్వస్థానవేషభాషాః" తొలికాలంనాటి తెనుగు కవులు తాము ఉభయభాషా కవులమని చెప్పుకోకపోతే గొడుమూకలో కలుపుతారేమో అని "ఉభయ భాషా కావ్య రచనాభి శోభితు;" "ఉభయ కవిమిత్రు" అని తమ సంస్కృత పాండిత్యము వెల్ల కాచుతూవుండే వారు. తెనుగులో కూడా కావ్యములు రాస్తే ప్రత్యవాయం లేదని అధర్వణుడు చాట భారతం రాశాడు.

భట్టకలంక దేవుడి శబ్దానుశాసనం యిప్పుడు దొరకడం కష్టం. 1890 సంవత్సరంలో మైసూరు గవనర్మెంటువారు అచ్చువేశారు. ఇది ఒకగొప్ప కన్నడవ్యాకరణం. దీనిని గురించి రైయిస్ దొరవ్రాసినాడు:

"The date of its completion as given at the end of the work corresponds with 1604 A. D. It is thus from its period not an antique treatise dealing with archaisms and obsolete terms, interesting as a literary monument though of little practical value now, but has the advantage of treating of the whole range of the language down to the modern period and its rules are such as apply to the present times."

కన్నడమునకు వ్యాకరణమేల? అనే విషయమును భట్టకలంకుడు యిలాగున చర్చించినాడు-మంగళస్నికం - నమశ్రీ వర్ధమానాయ విశ్వవిద్యావభాసినే। సర్వభాషామయీభాషా ప్రవృత్తాయన్ముఖాంబుజాత్।

శబ్దానుశాసనంహి ప్రస్తుతమ్ తత్రచ అనుశాసన విషయభూతాః శబ్దాః కర్ణాటకాఏవ। తేచ సంస్కృత శబ్దవత్సకలదేశప్రసిద్ధాః సకలశాస్త్రోపయోగితయా సకల మహాజన పరిగ్రాహ్యాశ్చ న భవన్తి।

భాషావిషయత్వాత్ । భాషాయాంచ పామరాణామేవాధికారో నపణ్డితానామేతిన్నై తేఽను శాస్యాః । ప్రయోగానర్హత్వాదితి। కేషాంచిత సంస్కృతాగ్రహాగ్రహిగ్రస్తానాం పండితమ్మన్యానాంమనసిప్రఖ్యాతామన్యధాఖ్యాతిం ప్రత్యాఖ్యాతు మే తదేవ విశేషణ ముపవర్ణితవాన్ గ్రంథకారః (సర్వఇతి)। ఇదమత్రాకూతమ్ । యధాసంస్కృతశబ్దాః సాధ్యసాధు వివేచనవిషయ తయా శాసనార్హాః। తథాభాషాశబ్దాఅపి। యది చామీనానుశాస్యాః కథం తర్హి భగవద్భాషా తన్మయీ స్యాత్ । నహ్యపశబ్దమయీసా!"

అర్థం:- యెవనిముఖ పద్మము నుంచిసర్వభాషారూపమైన భాష ఉద్భవించిందో, అటువంటి జ్ఞానముతో ప్రకాశించే వర్థమానునికినమస్కారము.

పూర్వపక్షం:- కర్ణాటక భాషా శబ్దములు సంస్కృత శబ్దముల వలె సకలదేశ ప్రసిద్ధములుకావు. సకల శాస్త్రోప్రయోగములుకావు. అందరుపెద్దలుఅవలంబించ తగినవి కావు. యేలనంటే అవి పామరులు మాటాడుకో వలసినవేగాని పండితులు ఆదరించవలసినవి కావు.

సంస్కృతమందు అభిమానం అనేపిశాచం పట్టిన కొందరు పండితులనే పేరుపెట్టుకునేవారు మన సుూపెట్టుకున్న యీ ప్రతిషేధమును ప్రతిషేధించడము కోసమే గ్రంధకర్త "సవర్ణభాషామయీ" అనే విశేషణం ప్రయోగించాడు. సంస్కృతశబ్దాలవలెనే కర్ణాటక శబ్దాలు కూడా వ్యాకరణంరాయ తగినవే. యివిగాని తగినవికాకపోతే భగవంతుని ముఖమున పుట్టుభాష యీభాషా రూపంగా కూడా యెలాగ వుండగలదు?

భగవంతుని భాష అపశబ్దములతో నిండివుండ నేరదే?

ఒక ఇటాలియను కవికూడా అటునుంచి యిటుతిప్పియీమాటే రాసినాడు.

"Modern languages being capable of beauty have, as well as ancient ones, a divine character; they shall in their turn, become the language of the gods."

[ప్రజాశక్తి ప్రమరణాలయంవారికి కృతజ్ఞతతో]

విశ్వ విద్యాలయాలు

వ్యావహారికభాష ఆమోదించాలి

★

శ్రీ గిడుగు రామమూర్తిగారి వర్ధంతి సభలలో ప్రముఖుల ప్రసంగాలూ, తీర్మానాలూ

బెజవాడ:

బెజవాడ శ్రీ హనుమంత రాయ గ్రంథాలయంలో జనవరి 25వ తేదీన అభ్యుదయ రచయితల సంఘం అధ్వర్యాన శ్రీ గిడుగు రామమూర్తిగారి వర్ధంతిసభ జయప్రదంగా జరిగింది. సుమారు 2 వేల మంది ప్రజలు హాజరైనారు.

శ్రీ అనిశెట్టి సుబ్బారావుగారు అధ్యక్షత వహించారు. శ్రీ మాచినేని వెంకటేశ్వర రావుగారు ప్రార్థన గీతం పాడారు.

అధ్యక్షులు శ్రీ అనిశెట్టి సుబ్బారావు గారిలా ఉపన్యసించారు:

"శ్రీ గిడుగు రామమూర్తి గారు లేవదీసిన వ్యావహారి కోద్యమాన్ని మన పత్రికా సంపాదకులూ రచయితలూ-దేశమంతా అంగీకరించారు. ఆయన పెట్టిన వరవడిలో ఇప్పటికి అర్ధ శతాబ్దంగా మన ఉత్తమ సాహిత్యమంతా వస్తున్నది. కాని మన కళాశాలల్లోనూ విద్యాలయాల్లోనూ ఈనాటికీ వ్యావహారిక భాషకు ప్రవేశం లేదు. వారు ఏనాటికృతక గ్రాంధికాన్నో పట్టుకొని వ్రేలాడుతున్నారు. ప్రభుత్వం చేత, విశ్వవిద్యాలయాధికారులచేత వ్యావహారిక భాషను అంగీకరింపజేయడం కోసం అభ్యుదయ రచయితల సంఘం కృషి చెయ్యటానికి సంకల్పించింది. మన కళాసంస్కృతుల పురోగమనానికి కృషిచేస్తున్న విద్యార్థులూ ఉపాధ్యాయులూ తమ తమ సంస్థల ద్వారా ఆందోళనసాగించి, అభ్యు

దయ రచయితల సంఘు కృషికి తోడ్పడాలని కోరుతున్నాము."

తర్వాత శ్రీ అత్తలూరి సర్వేశ్వరరావుగారు గిడుగు రామమూర్తి పంతులుగారి జీవిత విశేషాలనుగూర్చి ఉపన్యసించారు. "ఆంధ్ర సాహిత్యంలో ప్రజలు నిత్యం వ్యవహరించే జీవద్భాషా ఉపయోగంకోసం నిరంతరం కృషి చేసారు. ఆయన ఆశయాన్ని మన సాహితీపరులందరుఅంగీకరించినా ప్రభుత్వ విశ్వ విద్యాలయాధికారులు ఇంకా గత యుగంలోనే జీవిస్తున్నారు. వారికళ్లు తెరిపించి, వారిచేత ఈ వ్యావహారిక భాషను ఆమోదింప జేయవలసిన బాధ్యత మనమీాద వుంది. అందుకోసం అభ్యుదయ రచయితల సంఘం కృషి చేస్తుం"దని చెప్పి, ప్రజలందరి సహకారాన్ని అర్థించారు.

శ్రీ పాటిబండ్ల మాధవశర్మగారు, గిడుగు రామమూర్తిగారు ఆంధ్ర వాఙ్మయాభ్యుదయానికై చేసిన కృషిని ప్రశంసించి, మన కళాశాలల్లోను విద్యాలయాల్లోను వ్యావహారిక భాషను ప్రవేశ పెట్ట వలసిన అవసరాన్ని గురించి చెప్పారు.

"రామమూర్తిగారు తన వ్యావహారికోద్యమం పొందిన విజయానికి సంతోషిస్తూకూడా, ఈ జీవద్భాషను కళాశాలల్లోనూ విద్యాలయాల్లోను ప్రవేశ పెట్ట జాలనందుకు విచారించారు. అదే మనకు ఆయన కడపటి సందేశం" అన్నారు.

తర్వాత శ్రీ నార్ల చిరంజీవిగారు శ్రీ గిడుగువారి ఆత్మాభిమానాన్నిగురించి ప్రసంగించారు.

శ్రీ గిడుతూరి సూర్యం, చావలి రామచంద్రరావు, హెచ్. వి. రాంగోపాల్, శ్రీరామకవచం సత్యనారాయణ, నార్ల చిరంజీవిగార్లు తాముర్రాసిన ఖండకావ్యాలను మనోహరంగా చదివి వినిపించారు.

చివరకు ఆంధ్ర ప్రజానాట్యమండలి (రాష్ట్ర దళం) వారు "నేనెవరిని" అనే ఏకాంక నాటికను, (ఇది కె. ఎ. అబ్బాస్ కథకు శ్రీ వెంపటి రాధాకృష్ణగారి

నాటకీకరణ) సరికొత్త శిల్పంతో, అద్భుతంగా ప్రదర్శించారు.

తెనాలి:

సంస్కృత కళాశాలలో శ్రీ కొల్లిపర భాస్కరరావుగారి అధ్యక్షతను సభజరిగింది.

శ్రీ రామకవచం వెంకటేశ్వర శాస్త్రిగారుగిడుగు వారిజీవిత విశేషాలను, వ్యావహారిక భాషా ప్రాముఖ్యాన్ని గూర్చి విపులంగా ఉపన్యసించారు. తర్వాత శ్రీ హరి సాంబశివ శాస్త్రిగారు సంస్కృతములో వ్యావహారిక భాషాపరిణామాన్నుదహరిస్తూ వ్యావహారిక భాషను, విశ్వ విద్యాలయంలో తప్పని సరిగా ప్రవేశ పెట్టవలసిన అవసరాన్ని నిరూపించారు.

అధ్యక్షులు ప్రసంగిస్తూ; భాష విజ్ఞానం కోసమేననీ, విజ్ఞానప్రచారం ప్రజల భాషలో జరిగినప్పుడే ప్రయోజనం కలుగుతుందనీ, గిడుగువారి కృషి విశ్వవిద్యాలయంచేత వ్యావహారిక భాషను గుర్తింప జేయటమేననీ అందుకోసం ఆందోళన చెయ్యాలనీ అన్నారు.

"వ్యావహారిక భాషనువెంటనే యూనివర్సిటీ గుర్తించాలని, ఆస్థానకవులను నియమించుటకంటె వుత్తమరచనలకు బహూకరించటం ప్రయోజనకారి అని: గిడుగువారి అముద్రిత గ్రంథాలను ప్రభుత్వం గాని, విశ్వవిద్యాలయంవారుగాని, ప్రచురించాలని తీర్మానించారు.

చిట్టిగూడూరు:

చిట్టిగూడూరువిద్యార్థులు శ్రీ గిడుగు రామమూర్తివర్ధంతిజరిపారు

అజాద్ మైదాన్‌లో జరిగిన బహిరంగ సభలో శ్రీ రామమూర్తిగారు ఆంధ్రభాషకు చేసిన సేవను ఉగ్గడిస్తూ పలువురు ప్రముఖులు ఉపన్యసించారు.

"ఆంధ్ర విశ్వ విద్యాలయం వారు వ్యావహారిక భాషను గుర్తించి వెంటనే అన్ని విద్యాలయాలలోను అమలు జరపాలని కోరుతూ తీర్మానించారు.

రాజమహేంద్రవరం:

వ్యావహారిక భాషను ప్రభుత్వం విశ్వ విద్యాలయం ఆమోదించి అన్ని పాఠశాలలలోను ప్రవేశ పెట్టాలని రాజమహేంద్ర వరం పట్టణ యువజన సంఘసమావేశంలో తీర్మానించారు.

పిచ్చికుక్కలు

శ్రీ తెన్నేటి సూరి

★

'పిచ్చాళ్లు' మనమీద
పిస్తోళ్లు పేల్చారు
మనిషినని చెప్పబోకోయ్
తమ్ముడా
మన్ని కరిచేస్తారురా
తమ్ముడా
కాల్చి చంపేస్తారురా ...... మనిషి

మతపిచ్చి, మదపిచ్చి,
రాజుల్ల రసపిచ్చి
పిచ్చికుక్కలు రెచ్చెరా
వీధిలో
పీకుతున్నాయంటరా ...... మనిషి

లోక నాయకుడు, సు
శ్లోకుండు బాపుజీ
ప్రార్థనకు వెడలేటి
బాటలో పొంచుండి
పిచ్చికుక్కలు కరచెరా
జగదేక
పావనుని హా ! శివశివా......మనిషి

★ సుప్తాస్థికలు ★

శ్రీ శ్రీరంగం శ్రీనివాసరావు

★

పరిత్రాణాయ సాధూనాం । వినాశాయచ దుష్కృతాం
ధర్మ సంస్థాపనార్థాయ । సంభవామి యుగ యుగే.
శిష్టమానవ రక్షణ సేయుకొరకు । దుష్టమానవ నాశనోద్యోగమునకు
ధర్మ సంస్థాపనము నిమిత్తము ధరిత్రి । యుగయుగమ్ముల యందు నేనుద్భవింతు.

ప్రకటన

సుప్తాస్థికలు: నిద్రపోతున్న ఎముకలు. ఎముకలు నిద్రపోతాయా? ఏమో. పోనీ, నిద్రిస్తాయనే అనుకుందాం. నిద్రించడం తప్ప మరేమీ చెయ్యలేవనే అనుకుందాం. నిద్రిస్తాయి కాబట్టి కలలు కూడా కంటాయా? ఏమో ఒక కవి యిలా అన్నాడు.

కవి

అవి ధరాగర్భమున
మానవాస్థికా పరంపరలు!
సుప్త నిశ్శబ్ద సంపుటములు!
అటనొకే దీర్ఘయామిని!
ఆ నిశా శ్మశాన శయ్యకు
ప్రాతః ప్రసక్తి లేదు!
ఆయుగమ్యుతమో రహస్యాంగణాన
తాండవించును
మృత్యు శైతల్య మొకటె
అవి నితాంత హేమంత
హృదంతరంత రనుభవాళి
ఘనీభవించిన సమాధులు.

ఆ మనుష్యాస్థికలు
నిద్రలో మునింగి
సంచరించును భైరవస్వప్నవీథి
అవిచలించును తమ
చర్మ కవచ మెప్పుడో
బ్రతికిన దినాల
తలపోత బరువుచేత
నా కనుంగవ కన్నీళు లైకరంగు
నవి మొనర్చెడు నీరవాహ్వాన మెరిగి

ఇంత శోషిల్లునేలో
నాహృదయ పుటము
వణకు నేటికో నా అస్థిపంజరమ్ము

ప్ర క ట న

అసికలు, సుషాసికలు! అయితే?
అదా! సుషి. రాత్రి. చీకటి-నిశ్శబ్దం
మరణం! ఎముకలు మరణానికి
చిహ్నం కాబోలు. ఎవరి మరణం,
ఏమి టిదంతా? ఇదంతా దేన్ని
గురించి? ఏదో ఉపద్రవం సంభ
వించినట్లు ఏమిటా రోదన నాదం?
ఏం జరిగింది? అలా కొట్టుకుంటు
న్నారేం మీ గుండెలు? ఏం
ఘోరం? ఏం విపత్తు? ఎవరు
పోయారు? ఏమిటిదంతా? ఎవరు?
ఎవరో మీ ఆత్మలకన్న ఆత్మడూ
ఆపుడూ ఎవరో మహాపురుషో,
మహాత్ముడో మీకు దూరంఅయి
పోయాడా? ఎవరికీ కనబడకుండా
ఎక్కడికో వెళ్లి పోయాడా? ఇదంతా
యేమిటి? ఎందుకీ యేడుపులు?

విషాద కంఠాలు

ఏమని చెప్పమంటావు
ఎందు కేడుస్తున్నామో?
ఎందు కేడుస్తున్నామో
ఏమో మాకే తెలియదు!
ఏమిటదంతా అంటావా?
ఏమో మాకూ తెలియదు!
ఎవరు? ఎందుకు? ఏమిటి?
ఇవన్నీ మాకేం తెలియదు.
ఎప్పుడు? ఎక్కడ? ఎలాగ?
ఏం ప్రశ్నలయ్యా! ఇవి?
నోరులేని గాలి నడుగు,
ఆవులించిన ఆకాశాన్నడుగు!
ఔను! ఘోరమే జరిగింది!
అనుకోనిదె నిజమయింది
ఎందుకా ఏడుస్తున్నాం అని
ఇంకా అడుగుతున్నావా?
ఒకళ్లూ ఇద్దరూ కాదు
ఒక కుటుంబం ఊరూ కాదు
ఒక నగరం ఒక రాష్ట్రం కాదు
ఒక దేశం ఒక ఖండం కాదు
సమస్త ప్రపంచం నేడు
సమగ్ర దుఃఖంలో మునిగిందయ్యా!
అమేయ మీ ఉపద్రవానిది
అంతర్జాతీయ పరిమాణం!
అమెరికాలో సాహుకారు,
ఆఫ్రికాలో నీగ్రో
భవనంలో మహారాజు
ఫ్యాక్టరీలో కూలీ
ఒకళ్లూ ఇద్దరూ కాదు
వందలూ వేలూ కాదు

ధరిత్రి ఈ కొసనించి ఆ కొసకి
దద్దరిల్లిపోయిందయ్యా !
ఇంకా ఏమని చెప్పమంటావు
ఎందుకేడుస్తున్నామో ?
హిమాలయం మా
హృదయభారం !
గంగానది మా కన్నీళ్లు !

ప్రకటన

ఔను ఔను, నా కర్థమవుతోంది. మిమ్మల్ని ఓదార్చడానికి ప్రయత్నించను. అయినా ఇటు చూడండి. ఈ శ్మశాన ప్రశాంతిని ! హెచ్చుతగ్గులు లేని ఈ మైదానాన్ని చూడండి. మృత్యువు భయంకరమైనదని మీ ఉద్రేకం చెబుతుందేమో కాని ఈ ప్రాంతం ఎంత ప్రసన్నమో ఒక్కసారి ఆలోచించి చూడండి ! ఎవరో ఇటు వస్తున్నారు.

సంధ్య

నేను సంధ్యని
దివసమ్మునకు వయోధికత
ప్రాప్తించినది
తీక్ష్ణ దీప్తులడంగి దినరాజు
కృశియించె !
వృద్ధాహ్ణ మిడినదీవెనచేత
జనియించి
ఔద్ధత్యమునచే అహర్పతిన్
మ్రింగితిని ;
ఈ నా భవమ్ములోకానంద
మొసగునా
నే నెప్పటికి కూడ ఇటు
వికాసింతునా ?
నా కే నిముసమేని
లేకుండునా మృతి ?
ఇట మాయమైన నాకెట
సమున్మేషమో?

అంధకారం

నేను చీకటిని.
ఈ దివారోచిస్సుధా
ధామమును గూల్చి
ప్రాదుర్భవించి నే
బయలుదేరిన యంత
జగతియో మోకాని
నగవే మరచిపోయి
వగపుచే నిట్టూర్చి
వనటచే తపియించు
నా మేలిముసుగులో
నలుపు లూరెడు నంట
నామీద జగతి కింతయు
ప్రేమలేదంట !

నక్షత్రం

నేను నక్షత్రాన్ని.
నీలోత్పల నికాశ

వీా నిశీథము నిండి
ఎలుగెత్తి యేడు
వెందుల కంధకారమా ?
వాగులైనా ప్రేమ
వరియించు నే నిన్ను
స్వాగతమ్మొసగు
నాశాగంధ వాయువుల్
నిలువలేనే నీవు
నిలిచియుండని వేళ
వెలుగలేనే నీవు
విస్తరిల్లని వేళ!
నీ కాటుకల చేత నా కనుల్
వికసించు !
నీకు నేనే, నాకు నీవె
ఈలోకాన !

ప్రకటన

మృత్యువు జగద్విజేత కావచ్చును. కాని మరణాన్ని ప్రేమజయిస్తుంది.

ఒక గొంతు

సకల ప్రాణులనూ సమానంగా ప్రేమించ గలిగిన వ్యక్తికి మరణమా? ఇది నిజమని ఎలా నమ్మడం?

రెండవ

పుష్పక విమానంలోవలె అతని హృదయంలో ఎంద రధివసించినా ఇంకా స్థలం ఉండనే ఉంటుంది.

మూడవ

ఎన్ని గ్రంథాలు చదివినా మానవ మేధస్సులో ఇంకా కొత్తభావాలకి తావున్నట్లు.

బృందగీత

చీకట్లతోటలో కన్నీటి లోయ
కన్నీళ్ల లోయలో, కారుణ్య రేఖ.
పాపాలకోనలో
పసిపాప నవ్వు
చీకట్ల కోటలో
చిన్నారి వెలుగు
మృత్యు నిశ్శబ్దాన
మృదు జీవ రవళి
ఎముకల నిద్రలో
ఇంపైన కలలు.

ప్రకటన

అదుగో! అదుగో! అటు చూడండి. భయంకర చితాగ్ని జ్వాలలనుండి పైకి లేస్తున్న ప్రశాంత తేజాన్ని చూడండి! అతని భౌతికశరీరం అగ్ని కాహుతి అయింది. అతని అనశ్వరాత్మ ఆకాశాల నాక్రమించింది.

బృందగీత

అతడు సామాన్య వ్యక్తి
అతడసామాన్య వ్యక్తి
తృణం కన్నా తేలిక
మేరువు కంటే ధీరుడు!

ఆగర్భ శ్రీమంతుడు!
నిత్య దరిద్ర నారాయణుడు!
వయస్సుమీరిన బడుగు,
వయస్సే లేని నిసువు!
అన్యాయం సమక్షంలో
ఆగ్రహోదగ్రమూర్తి
చరాచర ప్రపంచానికి
క్షమా మార్గదర్శి
అత డిప్పుడు లేడు
అత డెప్పుడూ ఉన్నాడు
అమరత్వం అందుకున్న
అతనికి మా నతులు !

ప్ర క ట న

అరే! ఎవరూ లేరే? ఎంత శూన్యంగా ఉందో ఈ స్థలమంతా? ఏదీ చితి, ఏదీ జ్వాల ? ఏవీ అస్థికలు? ఏదీ బూడిద ? ఏవీ లేవే ? అన్ని వస్తువులూ తమ ఆకారాన్ని పరిత్యజించినట్టుందే ? అంతా శూన్యాకాశం ? నిర్జన నిర్జీవ నిరుపాధిక నిశ్శబ్దం. (క్షణంనిశ్శబ్దం)

ఈనిరవధిక నిశ్శబ్దంలో ... ... ఏమిటా గుసగుసలు. వెలుగూ చీకటీ కాని, బుద్ధికీ కంటికీ అందని ఈవిచిత్రాకాశపథంలో ఒకసోదర తార సహస్రకోటి యోజనాల దూరంలో ఉన్న ఇంకొక సోదరీ తారతో సంభాషిస్తోంది.

౧ వ తా ర

అక్కా! ఒసేచుక్కా!

౨ వ తా ర

ఏం తమ్ముడూ!-

౧ వ తా ర

అదేమే అలా తుళ్లిపడి లేచావూ?

౨ వ తా ర

ఏం లేదు. నిద్రపోదూ !

౧ వ తా ర

మరి నువ్వెందుకు మేలుకున్నావూ
ఎందుకే అలా వణుకుతున్నావు ?

౨ వ తా ర

ఏం లేదు. పడుక్కుందూ. ఏమిటో నిద్రలో వినబడింది.

౧ వ తా ర

ఏమిటేఅక్కా, ఏమిజరిగిందేమిటి ?
ఏం వినబడిందినీకు ?

౨ వ తా ర

అబ్బ! ఏంలేదు పోనిద్దూ!

౧ వ తా ర

కాదే, చెప్పవే ?

౨ వ తా ర

ఏముందిలెద్దూ, ఎక్కడో భూగోళంలో, మినుకు మినుకుమనే భూగోళంలో, సరిగ్గా కనబడీ కనబడని భూగోళంలో-

౧ వ తా ర

ఆఁ—ఆఁ, ఏమయిందే ?

౨ వ తా ర

భూగోళం మీద హస్తినాపురం అనే ఊరుంది. దాని ప్రస్తుతం పేరు నాకు తెలియదు ... వింటున్నావా?

౧ వ తా ర

ఆఁ-వింటున్నాను. హస్తినాపురం అనే ఊళ్లో-

౨ వ తా ర

నాలుగు సార్లు రివాల్వరు పేలుడు వినిపించింది.

౧ వ తా ర

రివాల్వరా? రివాల్వరంటే ఏమిటే?

౨ వ తా ర

రివాల్వరంటే తెలియదూ ? ఆటం బాంబుకి ముత్తాత.

౧ వ తా ర

ఆటం బాంబు అంటే ఏమిటి ?

౨ వ తా ర

అబ్బ ఊరుకుందూ ! నీ ప్రశ్నలకు జవాబు చెప్పలేక పోతున్నాను.

౧ వ తా ర

పోనీలేవే అక్కా— పోనీ ఇది చెప్పు నాలుగు మోతలు వినడం వల్లనా నీకు నిద్రాభంగం అయింది ?

౨ వ తా ర

కాదు తమ్ముడూ ! వినుమరి !

ఆ రాక్షస ధ్వనుల నాల్గింటినీ మరో నాలుగు అక్షరాలు రెండు రెళ్లు నాలుగక్షరాలు ఎదుర్కొన్నాయి ! ఎంత పెద్ద యుద్ధమనుకున్నావు ? ఇప్పటికీ జరుగుతూనే ఉంది ! హింసకీ అహింసకి యుద్ధం! అబ్బా, ఇంకా వినబడుతూనే ఉంది! ఎలా కొట్టుకుంటున్నాయో నా గుండెలు !

౧ వ తా ర

ఏమిటే ఆ అక్షరాలు నాలుగూ ?

౨ వ తార

'హేరాం ! హేరాం !' అని.

౧ వ తా ర

అంతేనా అక్కా ? అంతేనా ? నాలుగుమార్లు రివాల్వరు చప్పుళ్లు 'హేరాం హేరాం' అనే గద్గద స్వరాలూ! అంతేకాదూ, అంతేనా?

౨ వ తా ర

అంతే అనా అడుగుతున్నావు తమ్ముడూ! అలా ఆవలిస్తున్నావేం?

౧ వ తా ర

అబ్బా, నిద్దరొస్తోందే !

౨ వ తా ర

నీకెలా నిద్దర పడుతోందిరా తమ్ముడూ

[పరిత్రాణాయ సాధునాం...]

[ఆలిండియా రేడియోకి కృతజ్ఞత]

ప్రగతి

మూలం: జాన్ ఎర్విన్

అనువాదం: ప్రయాగ

1919 వ సంవత్సరంలో ఒక వసంతదినం. ఇంగ్లాండు వుత్తరాన ఒకపల్లెటి గ్రామంలో ప్రొఫెసర్ హెన్రీ కోరీ పరిశోధనా మందిరం. తన వసతిసౌకర్యంకంటె, పనే ప్రధానంగా పెట్టుకొనే బ్రహ్మచారి యింటిలాగా, ఆ గది తగినంత పరిశుభ్రంగానే వుంది. గది మధ్యగావున్న పెద్ద టేబిలు మీద, ఇప్పుడు ప్రొఫెసర్ కోరీ చేస్తున్న పరిశోధన బాపతు పరికరాలన్నీ, అమర్చబడివున్నాయి. పెద్దపెద్ద బాంబుల్లోని భాగాలను ప్రదర్శించే చిత్రాలు, చుట్టూ గోడలనిండా, వున్నాయి. ఒక చిత్రంక్రిందుగా, ఒక పెద్ద బాంబునమూనావుంది. రకరకాల విమానాల భాగాలను చూపే చిత్రాలూ, ఆయా విమానాల నమూనాలూ వున్నాయి.

ప్రొఫెసర్ కోరీ, యాభై అరవయ్యేళ్ళవాడు, టేబిల్ ముందు కూర్చొని, ఆ పెద్ద 'రిటార్టు'లో రసాయనిక పరిణామాలను గమనిస్తున్నాడు. స్తబ్ధుగా చలనంలేని ఆకళ్లు; దట్టంగా ఆ గడ్డం కప్పివేయక పోయినట్లయితే చుట్టూ క్రౌర్యం గూడుకట్టిన ముడుతలుగల ఆనోరూ; ఏమైనా, మామూలుగా చూసే మనిషికి అతను క్రూరుడనిపించదు. ఏమీ ప్రమాదంలేని మనిషిలాగాను, దయగలవాడి లాగాను, అతన్ని గురించి ఎవరూ అంత పట్టించుకోనవసరం లేనట్లుగాను, తన పనిలో పూర్తిగా నిమగ్నమైన వాడిలాగాను కనిపిస్తాడు. కాని, అతనికికోపం వచ్చినప్పుడు మాత్రం, ఆక్రూరత్వం కొంత కనిపిస్తుంది. అతనికేమాత్రం విఘాతం తగిలినా, విఘ్నంకలిగినా అప్పుడుచూడాలి— తోడేలులాగా ఆ విసుర్లూ, కసుర్లూ. తన శాస్త్రపరిశోధనలో అంతగా తన్మయుడు కావడమే, ప్రధానంగా, అతని క్రూరత్వానికి స్పష్టమైనగురు. అతనికి ఆ పరిశోధనకంటే ముఖ్యమైంది మరేదీలేదు. ఒక చిన్న పరిశోధనా ఫలితం ముందు మానవజీవితం అతనికి చాలా అల్పమైనది.

అలవాటు ప్రకారం, తనలో తను యేదో గొణుక్కుంటూ, ఆ 'రిటార్టు' వంక తదేకదీక్షతో చూస్తున్నాడు. ఆ గొణుగుడు అప్పుడప్పుడు సంతృప్తిగాను, అప్పుడప్పుడు ఆదుర్దాగాను, ఒకసారి కోపంగాను, మళ్ళీ సంతృప్తిగాను సాగుతున్నది. తలుపు తట్టిన చప్పుడైంది, అతను వినిపించుకోలేదు. మళ్ళీ చప్పుడు. 'రిటార్టు' వంక వంగి మరీ తీక్ష్ణంగా చూస్తున్నాడు. తరువాత సంతోషంతో ఒక పెద్ద కేక పెట్టాడు. లేచి మళ్ళీ దాని వంకే చూస్తూ నిల్చున్నాడు. మూడోసారి మళ్ళీ తలుపు.

కో రీ :

(రిటార్టు మీదికి వంగి, పరిశోధన పూర్తి చేస్తూ) ఆఁ — విజయం పొందాను. చిట్ట చివరకు, చిట్టచివరకు-విజయం... (తలుపు కొట్టిన ధ్వని పెద్దగా వినపడుతుంది. అదిరి పోయినట్లు గుండ్రంగా తిరిగి—) హాఁ— ఓహో, నువ్వా, రా! లోపలికి రా!

[తలుపు తీసుకొని, ముసలి పనిమనిషి ప్రవేశం]

ప ని మ ని షి :

మెల్డన్ సతి...

కో రీ :

ఔను, హానా! ఔను. ఇంతకూ ఏమిటి?

హా నా :

మీరు టీకి క్రిందికి వస్తారో, లేక ఇక్కడే పైన తీసుకుంటారో ఆమె తెలుసుకోవాలనుంది.

కో రీ :

ఏం, ఆమె మళ్ళీ వచ్చిందా?

హా నా :

ఔను. మీరు స్టేషనులోనే కలుసుకుంటారని చూసిందట. ఆ చలిలో ఎంతసేపో అలా చూసి చూసి, చివరకు మార్షల్ కారులో వచ్చేసింది.

కో రీ :

నేను వెళ్దామనుకున్నాను. కాని— తీరిక లేకపోయింది. మరచిపోయాను. అయినా, తనంతట తానే ఇంటికి వచ్చెయ్యగల సమర్థత ఆమెకు బాగానే వుందిగా.

హా నా :

ఔను... మీరు టీకి క్రిందికివస్తారా, లేక ఇక్కడే తీసుకుంటారా?

కో రీ :

ఆ క్రింది గదిలో చలిగా వుంటుంది. నేను పైనే టీ తీసుకుంటానని మెల్డన్ సతికి చెప్పు. మరి, ఆమెకో మాట చెప్పాలి. ఓ, మంచిమాట వుందని చెప్పు. నా పరిశోధన పూర్తయింది; విజయం పొందాను.

హా నా :

ఆఁ... అలాగా?

కో రీ :

ఔనౌను. కాని... దాన్ని గురించి నీకు చెప్పి లాభంలేదు. నీ కర్థం కాదు.

హానా :

అర్థం కాదు.

కోరీ :

కాని, హానా, నాకు అభిమానం ఎక్కువ. బహుశా, నీకూ తెలుసేమోలే... వెళ్ళి మెల్లన్‌తో చెబుతావు కదూ?

హానా :

సరే. చెబుతాను.

కోరీ :

నా పరిశోధన నెగ్గిందని చెప్పడం మరచిపోయ్యేవు! పోనీ, వద్దులే— నువ్వు ఆమెకేమీ చెప్పకుండా వుంటేనే నయం. ఆపని నేనే చేస్తాలే. నువ్వు దాన్ని అపహాస్యం చేస్తావు. నాకెంత సంతోషంగా వుందో, ఆమెకుకూడా అంతే సంతోషం కలగాలి.

హానా :

ఇవాళ, ఆమె, ఆటే సంతోషంగా లేదు.

కోరీ :

సంతోషంగా లేదూ! ఎందువల్ల? నేను సంతోషంగానే వున్నానుగా; లేనూ?

హానా :

మంచిదే. కాని, మీకు తెలుసుగదా, ఇవాళిటికి సరిగ్గా మూడేళ్ళక్రితం ఆమె కొడుకు యుద్ధంలో చంపబడ్డాడు...

కోరీ :

(తన బాధ సాంతం మరచిపోయి) ఔను, నిజమే. నేను మరచిపోయాను. కాని, నిజానికి, ఎవరైనా, ఈ విషయాలను గూర్చి ఎల్లప్పుడూ ఆలోచిస్తూ కూచోలేరు.

హానా :

ఆమె అలాగే ఆలోచిస్తుంది.

కోరీ :

నేను ఆమెను స్టేషన్లో కలుసుకోనందుకు విచారిస్తున్నాను. కాని, హానా, నేను నా పరిశోధన చూసుకోవాలిగదా! ఏమైనా, ఆమె అట్లా 'బడ్డీ' చావును పట్టుకు కూచోడం నాకిష్టంలేదు. చచ్చినవాళ్ళను గురించి అంతసేపు ఆలోచించడం బ్రతికున్నవాళ్ళకు తగదు. కాని, ఆమె ఆడది; నిజానికి, తల్లి; కొడుకును కోల్పోయిన తల్లి. హానా, మనం కొంత అవకాశం ఇవ్వాలి, అంతే. మరి, ఇప్పుడు నా పరిశోధనను గురించి చెబితే, ఎలా వుంటుంది?

హానా :

సందిగ్ధంగా) ఇప్పుడున్న దానికంటే, ఇంకా ఎక్కువేమీ బాధపడదనుకుంటాను.

కోరీ :

అయితే, ఆమెను పైకొచ్చి, నాతోపాటు టీ తీసుకోమను. అప్పుడే నా పరిశోధన సంగతి చెబుతాను.

హానా :

సరే... (వెళ్ళబోతుంది.)

కోరీ :

ఆఁ... మరే, హానా, నేనామెను స్టేషన్లో కలుసుకోలేనందుకు చాలా విచారిస్తున్నానని చెప్పు. దాంతో కొంతబాధ తగ్గుతుంది. తర్వాత, నా పని ఎంత ముఖ్యమైందో, దానిమీద ఎంత ఇది ఆధారపడి వుందో— అర్థం చేసుకున్నప్పుడుందే, అప్పుడు ఆమె కుదుటపడుతుంది.

హానా :

చాలా బాగుంది. (తలుపు వైపు వెళుతూ,

ఆగి, మళ్ళీ వెనక్కి తిరిగి) నిజంగా—ఆమె సంతోషంగా లేదు. ఆమె మనస్సేగా బాగా వున్నట్టు లేదు. మరచిపోలేదు. చూడండి-

[ప్రొఫెసర్ టేబిల్ దగ్గిరకెళ్ళి మళ్ళీ తన పరిశోధనను పరీక్షిస్తున్నాడు. ఒక్క చిరు దగ్గు తప్ప, హానాకు సమాధానం లేదు. హానా వెళ్ళిపోయింది. కాగితంమీద ఏవో లెక్కలు వేసి, ఆ కాగితంకేసి ఆనందంగా చూస్తూ, ప్రొఫెసర్ కుర్చీలో కూర్చున్నాడు. అతని చెల్లెలు మెల్డన్ లోనికి ప్రవేశించడంతో ఆ ఆనందానికి అంతరాయం కలిగింది. మెల్డన్ వయస్సు దాదాపు నలభైమూడు సంవత్సరాలు. ఆమె వితంతువు కావడంవల్లా, ముఖ్యంగా కొడుకు చావువల్లా ఆమె నల్లని దుస్తులు ధరించింది. ఆమె చాలా చురుకుగా కన్పిస్తుంది. ఇప్పుడు దుఃఖభారంతో, జ్ఞాపకాలతో బాధపడుతున్నది. కాని, ఆమె నరాల్లో వున్న చైతన్యం ఆమెకు తగినంత బలం చేకూరుస్తున్నది. ఆమె కుప్పగూలిపోయి, ఆక్రోశించే మనిషి కాదు. ఈ ప్రపంచంలో తానొక్కతే వియోగం అనుభవించినట్లుగా నటించే మనిషీ కాదు. తన దిగులు గురించి మాట్లాడినప్పుడు ఆమెలో ఒక నిర్లిప్తమైన చక్కని తీవి కనిపిస్తుంది.]

మెల్డన్ :

హెన్రీ!

కోరీ :

హాఁ — (తిరిగి చూసి) ఓ... నా చెల్లీ, నిన్ను స్టేషన్లో కలుసుకోనందుకు చాలా విచారిస్తున్నాను!...

మెల్డన్ :

(కుంపటి ప్రక్కనే కూర్చొని) ఫర్వాలేదు, హెన్రీ. నువ్వు వస్తావని చూసాను- అంతే. వస్తానన్నావు కదూ— మరి, ఇంకా వస్తావని ఆ చలిలో అలాగే చాలా సేపు చూసాను.

కోరీ :

ఔను, చాలా విచారంగా వుంది. కాని, చూడు, నేనొక ప్రయోగం సాధిస్తున్నా. చిట్టచివరకు విజయమే పొందాను. నేను ఏమి కావాలనుకున్నానో, సరిగ్గా అదే సాధించాను. సరిగ్గా అదే. దీంతో ఎంత ప్రతిష్ట, ఎంత అదృష్టం! ఇప్పుడు నాకు సిరి సంపదలు వస్తాయి, కాని, అంతకంటె ముఖ్యంగా కీర్తి ప్రతిష్టలు రావాలి. నా పేరు శాశ్వతంగా నిలిచిపోతుంది. నా పరిశోధన సక్రమంగా సాగడం చూసి, 'ప్రతి ఒక్కటీ ఇంత ఖచితంగా నడుస్తున్నప్పుడు, నేను తన్ను కలుసుకోవాలని చెల్లి కోరదు. అయినా, పెద్దది, ఆమెకేం, ఇంటి దోవ నాకు తెలిసినంత బాగా ఆమెకు కూడా తెలుసు గదా!' అని నేననుకున్నాను. అందుకే నేను రాలేదు. ఇక్కడే వుండి, నా పని చేసుకున్నా. నువ్వు అర్థం చేసుకుంటావని నాకు తెలుసు. అంతే కాదు— సాధించాను విజయం, నా జీవితంలో ఎన్నడూ ఎరుగని గొప్ప అద్భుతమైన విజయం.

మెల్డన్ :

సరే.

కోరీ :

(అదిరిపోయి) అరే! నీలో ఏమీ సంచలనం కలిగినట్టు లేదే!

మెల్డన్ :

నిజంగా నీ విజయానికి నేను సంతోషిస్తున్నాను. కాని, హెన్రీ, అది ఏమై నప్పటికీ, దాన్ని గురించి నువ్వెప్పుడూ ఏమీ చెప్ప లేదు, చూడు.

కోరీ :

చెప్పలేదు, నిజమే. అసలు నా రహస్యాలు నా లోనే దాచుకోడం మంచిదని నా నమ్మకం. చెప్పవలసి వచ్చిందాకా, ఎవ్వరికీ ఏమీ చెప్పకూడదు— ఇదే నా నియమం. ఈ విషయంలో నేను పరిశోధన చేస్తున్న సంగతి, ఒక్క నాకు తప్ప, మరెవ్వరికీ తెలియదు. పరిశోధనా విజయంలో వున్న రహస్యమల్లా దాన్ని గుప్తంగా వుంచడమే. కాని, చెల్లీ, అదేమిటో ఇప్పుడు నీకు చెబుతాను. దాని అంతరంగిక వివరాలు ఇంకా రహస్యమే. ఏదో ఒక ప్రభుత్వంనుంచి తగిన ప్రతిఫలం వచ్చిందాకా అవి రహస్యంగానే వుంచుతాను!...

మెల్డన్ :

ప్రభుత్వం! అది ప్రభుత్వానికి సంబంధించిన విషయమా, ఏమిటి?

కోరీ :

అవును. అయితే, నేను దాన్ని మన బ్రిటిష్ ప్రభుత్వానికే ఇవ్వటానికి ప్రయత్నిస్తాను. కాని, వాళ్లు నేనడిగిన ధర పెట్టకపోతే, మరేదన్నా ప్రభుత్వానికిస్తాను. చెల్లీ, చాలామంది పరిశోధకుల్ని ఈ బ్రిటిష్ ప్రభుత్వం త్రోసిపుచ్చింది. కాని నన్నలా త్రోసిపుచ్చరు. త్రోసిపుచ్చరు. నా విషయం నేను జాగ్రత్తపడతాను. కాని, నేను కనిపెట్టింది ఏమిటో తెలుసుకున్నప్పుడు, అది కావాలని వాళ్లు ఒక్కదూకులో ఎగబడతారు.

మెల్డన్ :

నిజమా ?

కోరీ :

తప్పకుండా. అయినా...వాళ్లమీద నీకు అనుమానం వుండడం న్యాయమే ననుకో. అసలు, యుద్ధంలో వాళ్లచేత టాంకు లుపయోగించేటట్లు చెయ్యడం ఎంత కష్టమైంది;—ఎంతకష్టం! టాంకులు వాడటానికి ఈ గుర్రపు దళాలవాళ్లను నిర్బంధపెట్టాలిసొచ్చింది. వాళ్లు సైనికులుగా వుండేకంటే, గుర్రాలనుచంపే కసాయి వాళ్లుగా వుండాలిసింది. పోనీ! ఉక్కు టోపీలమాట కొచ్చినా, అంతే! ఈ పాడు యుద్ధ కార్యాలయం వాటిని వాడేటట్లు చెయ్యడం ఎంతకాలం పట్టింది! ... కాని చెల్లీ, చాలా విచారిస్తున్నాను. యుద్ధాన్ని గురించి నేను నీతో మాట్లాడవలసిందికాదు; అదీ ఇవాళ.

మెల్డన్ :

ఏం ఫరవాలేదు, హెన్రీ. యుద్ధకార్యాలయమంటే యుద్ధం కాదుగదా!

కోరీ :

కాదు. ఆ మాట నిజమే.

మెల్డన్ :

హెన్రీ, నీ పరిశోధన ఏమిటి?

కోరీ :

హాఁ— చెల్లీ! దాన్ని గురించి చెప్పవలసింది చాలా వుంది.

[టీ తీసుకొని హానా ప్రవేశం.

హానా :

ఇదిగో టీ తెచ్చాను.

కోరీ :

ఫా!... ఓహో, సరేలే! అక్కడ పెట్టు!

[మెల్లన్ వున్నచోట హానా టీ ఏర్పాట్లు చేస్తుంది. ఇంతలో ప్రొఫెసర్ టేబిల్ దగ్గర కెళ్ళి, 'రిటార్టు'లూ, పరిశోధనా సూత్రాలూ పరికిస్తూ, అప్పుడప్పుడు తనలో తాను చకితుడవుతూంటాడు.]

మెల్లన్ :

హానా, అన్నీ సిద్ధంగా వున్నాయా?

హానా :

వున్నై. యుద్ధస్మృతికిగాను మీరు కావాలన్న పూలదండ తోటమాలి తెచ్చి పెట్టాడు. వంట ఇంట్లో వుంది. తెమ్మంటారా?

మెల్లన్ :

అఁ — తీసుకురా, హానా!

[టీ ఏర్పాట్లు పూర్తిచేసి, హానా వెళ్ళిపోతుంది.

మెల్లన్ :

హ్యారీ, వచ్చి టీ తీసుకో!

కోరీ :

ఆఁ, ఆఁ...ఇదిగో—

మెల్లన్ :

రా, హ్యారీ!

కోరీ :

హాఁ—ఓ అదా, సరేలే. వస్తున్నా, ఒక్క నిమిషం!

మెల్లన్ :

నువ్విప్పుడు రాకపోతే, టీ చల్లారిపోతుంది.

కోరీ :

(లేచి, టీ టేబిల్ దగ్గరకు వస్తూ) ఓ... ఆడవాళ్లు ఎంత ఆందోళన చేస్తారు! అసలు మీ ఆడవాళ్ళ సంగతి విపరీతం సుమా. ఏవో ఇతర వస్తువులకోసం, ఉన్న వాటిని పాడుచేస్తారు. దేన్నీ సమన్వయించడంగానీ, దేనిమీదా కేంద్రీకరణగానీ లేదు. తన్నుదాను మరచిపోయి, సంపూర్ణంగా ఆత్మార్పణం చేసే శక్తి అసలేలేదు. అందుకనే ఆడవాళ్ళెప్పుడూ గొప్ప కళాకారులుగానీ, శాస్త్రజ్ఞులుగానీ కాలేదు. వాళ్లు అన్నింటినీ విసర్జించి, ఒక్కదాన్ని అనుసరించరు కనుక— అంతే - కాని, ఏమైనా, వాళ్లు అనుసరించటమే భావ్యం.

[హానా పూలమాల తీసుకొని వస్తుంది. దానిమీద ఒక చీటీ అంటించి వుంటుంది.

హానా :

ఇదుగో నమ్మా, దండ!

కోరీ :

ఏమిటది ?

మెల్లన్ :

(హానా దగ్గరనుంచి దండ తీసుకొని) యుద్ధస్మృతికిగాను ఎడ్డీ సమాధిమీద వుంచడానికి నేను తోటమాలి దగ్గిర్నించి తెప్పించాను. ఎడ్డీకోసం!

కోరీ :

ఓహో, అదా ? సరేలే.

మెల్డన్:

టీ త్రాగాక దీన్ని సమాధివద్దకు తీసుకెళ తాను. నీవుకూడా వస్తావా ? హెన్రీ—

కోరీ :

రావాలనే వుంది, నిజంగా. కాని, యీ పనులన్నీ చేసుకోవాలి గదా !

మెల్డన్:

సరేలే. (హానాతో) వెళ్ళు, హానా. ఈ దండ ఇక్కడే వుంచుతాను.

[హానా వెళుతుంది.

మెల్డన్:

(కోరీతో) ఈ పూలు చాలా అందంగా వున్నాయి కాదూ, హెన్రీ !

కోరీ :

అవును. చాలా అందంగా వున్నాయి. చూడు,చెల్లీ,ఈ-నేను కనిపెట్టింది వుందే...

మెల్డన్:

ఇంకా కొంచెం టీ కావాలా, హెన్రీ ?

కోరీ :

(అస్పష్టంగా) ఓ హ్-హ్— (తర్వాత స్పష్టంగా)అవునుకావాలి, మరోఅరకప్పు!

[ఆమె చేతికి కప్పు అందిస్తాడు. ఆమె టీ పోసి మళ్ళీ అతని కిస్తూ వుంటుంది.

కోరీ :

నేను కనిపెట్టిందుందే, ఇది, మన యుద్ధ విధానంలో విప్లవం తెస్తుందనుకో!

మెల్డన్:

ఆఁ! అది యుద్ధాన్ని నిర్మూలిస్తుందా?

కోరీ :

యుద్ధాన్ని నిర్మూలించటం!... ప్రియమైన చెల్లీ! ఆకతాయితనంగా మాట్లాడకు!

మెల్డన్:

ఆ విషయ మంటే నాకు చాలా ఇష్టం ప్రపంచంలో అన్నింటి కంటే అది నాకు ముఖ్యమైందిగా కన్పిస్తుంది, హెన్రీ. దీన్ని గురించి... మన యువకుల్ని బలి చేస్తున్న నిర్మాణయుతమైన ఈ హత్యాకాండను గురించి, నాలాంటి స్త్రీలు ఎంత తీవ్ర వేదన పడతారో నువ్వు గమనించవు. నా వంక చూడు! యుద్ధం ప్రారంభమైనప్పుడు నా భర్త వున్నాడు, నా కొడుకున్నాడు. యుద్ధం అయిపోయేసరికి, నాకు ఒక్కరు కూడా మిగలలేను. నేను ఒంటరి పక్షిని... ఇది భయంకరమైన ఒంటరితనం!...

కోరీ :

(ఇదంతా ఒకే విషయంమీద ఆవేశంతో మాట్లాడటంగా తోచి, కొంచెం బాధపడి) నాకు తెలుసు, చెల్లీ, యుద్ధం నిన్ను చాలా దెబ్బకొట్టింది-ఎడ్డీ చంపబడటమూ,, టాం అంత చెడ్డ యిదిగా చనిపోవటమూ- ఏమిటి మరి!...

మెల్డన్:

టాం హృదయం బ్రద్దలై చనిపోయాడు. హెన్రీ, యిది నీకేదో ఆవేశంగానూ, అశాస్త్రీయంగాను తోచవచ్చు. కాని, నిజం. నామీద ఆ మృత్యువుకు దయ రాలేదేమా అనీ, ఈ ఒంటరిగా జీవిం చాల్సిన నిర్బంధం ఎందుకా అనీ అనిపిస్తూ వుంటుంది...

కొ రీ :

ఆగు, చెల్లీ, ఆగు. ఒంటరిగా కాదు. కాదు, కాదు, ఒంటరిగా ఎన్నటికీ కాదు. నీవు నాతో సుఖంగా వున్నావు కదా? నీ ఒకే ఒక సోదరుణ్ణి!......

మె ల్డ న్:

నువ్వు, కన్నబిడ్డ పోయినలోటు తీర్చలేవు, హెన్రీ!

కొ రీ :

అవును, నిజమే; నేను తీర్చలేననే అను కుంటాను. కాని, చెల్లీ, యింకా నిస్పృహ చెందాల్సిన అవసరంలేదు. నా పరిశోధనను గురించి చెప్పనీ.

[తన టీ కప్పు క్రింద పెట్టి చెప్పటానికి సిద్ధపడతాడు.

మె ల్డ న్:

నీకు మరి కొంచెం టీ కావాలా?

కొ రీ :

వద్దుగాని, విను, చెల్లీ! ఇప్పుడు నేను మన యుద్ధ విధానంలో విప్లవం రావాలన్నా నంటే, అది ఇంకా వేగంగా జరిగి పోవా లన్న మాట. ఈ గడచిన యుద్ధం ఐదేళ్లు పోనీ దాదాపు ఐదేళ్లుపట్టిందంటే, నిజంగా హాస్యాస్పదం; అర్థంలేని పని. అది ఐదు వారాలకంటే ఎక్కువకాలం పట్టి వుండా లిసింది కాదు.

మె ల్డ న్:

యుద్ధాలకాలం తగ్గించేందుకు నీ వేమన్నా సాధనం కని పెట్టావా?

కొ రీ :

అవును. అంతే. అలా చెప్పవచ్చు ననుకుం టాను. యుద్ధంలో పోరాడేవారు చూడా లిసింది ఏమిటంటే– తాము కొట్టే మొట్ట మొదటి దెబ్బతో శత్రువు వెంటనే లొంగి పోయేట్టు చూడాలి– అంత గట్టి దెబ్బ తియ్యాలన్న మాట.

మె ల్డ న్:

ఆc– తెలిసింది!

కొ రీ :

అంటే, ఆయుధాలు ఇప్పటికంటే ఇంకా ఎన్నో — ఎన్నో రెట్లు భయంకరంగానూ మారణసాధనాలుగానూ తయారు చెయ్యా లన్న మాట.

మె ల్డ న్:

ఇంకా భయంకరంగానా! అది సాధ్యమా?

కొ రీ :

అవును. ఇంకా మనం యుద్ధభీభత్సం యొక్క అంతు చూడనేలేదు! చూడనేలేదు!

మె ల్డ న్:

నాబిడ్డ, పంధొమ్మిదేళ్ళవాడు, యుద్ధంలో చంపబడ్డాడు. అసలా యుద్ధమేమిటో వాడికి పూర్తిగా తెలియనుకూడా తెలి యదు. ఇది నాకు చాలా భయంకరంగా కన్పిస్తుంది!

కొ రీ :

నిజానికి, కన్నకడుపు-అలానే అనిపిస్తుంది. కాని, ఈ విషయాన్ని విశాలదృష్టితో చూడాలి. నీ సొంత ఆవేదనలు అవతల పెట్టు...

మె ల్డ న్:

ఆపని నేను చెయ్యలేను, హెన్రీ. ఈ యుద్ధమంతా చూడగా నా కొక్కటే

తెలుస్తుంది. నా కొడుకును, స్కూలునుంచి ప్రపంచంలోకి వచ్చిన కొత్తలో, వాడి జీవితం వికసించనున్న సమయంలో, వాణ్ణి నానుంచి వేరుచేసి, చంపించడం - యిదే యుద్ధమంటే నాకు అర్థమయ్యేది! హెన్రీ, నేను ఆటే తెలిపగలదాన్ని కాదు. నాయొక్క, నావాళ్ళయొక్క అనుభవాన్ని బట్టి మాత్రమే నేను విషయాలు అర్థం చేసుకోగలను. నాఒక్క బిడ్డ, నా ప్రాణం, నాహృదయానందం, ఆ ఎడ్డీ! వాడిమీద యెన్నెన్ని ఆశలు పెట్టుకున్నాను! వాడు కాస్తా దక్కకుండా పోయాడు - ఇంకా యేముంది... లేదు, లేదు... ఏమీ లేదు!

కోరీ:

(చాలా మృదువుగా) అవును. నాకు తెలుసు. చెల్లీ, ఏమైనా నీవు నీదుఃఖాన్ని పట్టుకు అంతగా పాకులాడకూడదు. ఇది నీకు మంచిది కాదు. నీవొక విశాలమైన దృక్పథం తీసుకోవాలి. ఇప్పుడు నీవే ఒక రాజకీయ వేత్త వనుకో!...

మెల్డన్:

నా ఎడ్డీ రాజకీయవేత్తే అయి వుంటే, యుద్ధానికేవెళ్లి వుండేవాడు కాడు. ఇంకెవరినో పొమ్మని నిర్బంధించేవాడు.

కోరీ:

అంత దుఃఖం పెట్టుకోకు, చెల్లీ.

మెల్డన్:

హెన్రీ, నేను దుఃఖానికి అతీతంగా వున్నాను. ఇవాళ నేనేం కనుక్కున్నానో నీకు తెలుసునా?

కోరీ:

ఊహూం — తెలియదు.

మెల్డన్:

నాకీవరకు తెలియదు—ఎడ్డీ ఎట్లా చంపబడ్డాడో! ఇవాళ తెలుసుకున్నాను.

కోరీ:

నువ్వు దాన్ని గురించి అంత ఆలోచించడం మంచిదికాదు.

మెల్డన్:

ఆవేశంతో నేను దాన్ని గురించే ఆలోచించాలి. ఆలోచించకుండా వుండలేను!... ఎడ్డీవున్న దళంలోనే వున్న కుర్రాడొకడు ఇవాళ నాకు కనపడ్డాడు, వాడు చెప్పాడు. పాపం, ఈ సంగతి నాకు తెలియదని వాడు గ్రహించేలోపుగానే, నోరు జారాడు!...

కోరీ:

యుద్ధాన్ని గురించి జనం అంతగా మాట్లాడకూడదు. అలాంటి విషయాలు మరచిపోవడం మంచిది!

మెల్డన్:

(నిమిత్తపడుతూ) గుండుదెబ్బ తగిలి ఎడ్డీ చనిపోయాడనీ, ఆ శ్రేణులవెనుక ఎక్కడో సమాధి చేశారనీ కమాండరు నాకు వ్రాసిన సంగతి జ్ఞాపకం వుంది కదూ?

కోరీ:

అవును, జ్ఞాపకమే.

మెల్డన్:

అది, నాకు, కొంత ఓదార్పుగానే వుంది. వాడు ముక్కలుముక్కలుగా పేలిపో

కుండా, చనిపోయినప్పుడు కూడా నా ప్రియమైన ఆ చక్కని బిడ్డగానే, వీరోచితంగా సాటి సైనికులచేత సమాధిపొందిన సైనికుడుగానే... వున్నాడనుకోడం కొంత తేలికే ననిపించింది. కాని, హెన్రీ!...

కోరీ :

అయితే, సమాధి చెయ్యలేదా ?

మెల్డన్:

లేదు. సమాధి చెయ్యటాని కేముంది ? గుండు వచ్చేసింది...మరి...మరి...మిగిలిందేమీ లేదు. (ఒక క్షణం నిశ్శబ్దం) ఇది భయంకరంగా లేదా, హెన్రీ ? ఆ చావు ఏం ఇదిగా వుంది!...ఓ దేవుడా, నా దేవుడా !...దాన్ని గురించి నీవేదో విశాలమైన దృక్పథం తీసుకోమంటావు! నా బిడ్డ!...ఎడ్డీ, అతని సైనికులూ ఎక్కడో ఓ అగాధమైన చిన్న ట్రెంచీలో వున్నారట; ఎనిమిది రాత్రులూపగళ్ళూ అలాగే కళ్లు కాయలుకాసి పోతూ; యింతలో ఒక గుండు వచ్చేసి, అందులో ఒక గ్రూపు మధ్య పడి, వాళ్ళను నాశనం చేసేసింది. ఐదుగురు... మిగిలిందేమీ లేదు యేమీ లేదు !

[ఆమె కుర్చీలో వెక్కి జేరగిలబడిపోయింది. ప్రొఫెసర్ మళ్ళీ తన టేబిల్ దగ్గిరకెళ్ళి ఆ కాగితాలనూ, రిటార్టులనూ చూస్తున్నాడు.

మెల్డన్:

నీవు కనిపెట్టిందేమిటి ?

కోరీ :

దాన్ని గురించి ఇప్పుడు మాట్లాడకుండా వుండటం మంచిదనుకుంటాను! నీవు మరి తల్లక్రిందైై వున్నావు ఆ కుర్రాడెవడో, ఎడ్డీనిగురించి నీకు చెప్పివుండాలిసింది కాదు!

మెల్డన్:

వాడు నాకు తెలుసనుకున్నాడు. కాని, హెన్రీ, నీవు కనిపెట్టిందేమిటి ?

కోరీ :

మరెప్పుడన్నా చెబుతాలే, చెల్లీ

మెల్డన్:

నాకిప్పుడే తెలుసుకోవాలనుంది. ఏదో ఒకటి. యుద్ధం యింకా వేగం అయిపోయేట్టు! త్వరలో అంతమైపోయేట్టు!

కోరీ :

నిజం చెల్లీ, ఇది మానవ కారుణ్యంతో చేసిన పరిశోధన. కాని, యుద్ధాలెప్పటికీ లేకుండా పోతాయని నేను నమ్మను; గుర్తుంచుకో; ఎప్పటికీ అంతంకావు. మనం మానవమాత్రులం ఎప్పుడూ కయ్యానికి కాలు దువ్వుతూనే వుంటాం. అలాంటప్పుడు మనం చెయ్యాల్సిం దేమిటంటే, ఏజాతిగానీ తప్పని సరైతేనే గాని యుద్ధానికి దిగనంత భయంకరంగా యుద్ధ విధానాన్ని తయారు చెయ్యాలి. అదీ నా వుద్దేశ్యం. యుద్ధాన్ని నేను భయంకరం చెయ్యబోతున్నాను. నిజంగా భయంకరం చేస్తాను.

మెల్డన్:

ఆఁ......

కోరీ :

ఇక్కడ ఈబల్లమీదఒకటుంది.చూడు,ఒకరకంబాంబు తయారుచేసే సూత్రం. అది

యుద్ధాన్ని అమితమైన వేగంతో భయంకరం చెయ్యడమే కాకుండా అసలు యుద్ధం ప్రారంభించి, వెంటనే అయిపోయేటట్లు చేస్తుంది.

మెల్లన్:

ఆ బల్లమీదా?

[లేచి అక్కడికి పోతుంది.

కోరి:

ఔను. అనేక పరిశోధనలు చేసి, గణిత శాస్త్రం ప్రకారం ఒక సూత్రం తయారు చేసాను. కొన్నికొన్ని విషవాయువుల యొక్క, ప్రేలుడు పదార్థాలయొక్క కూడికతో ఒక కొత్తరకం బాంబు చెయ్యడం కనిపెట్టాను. ఆ బాంబు వేస్తే ఒక్క క్షణంలో వేలకువేలు తుడిచి పెట్టుకు పోతారు. వేలకు వేలు!

మెల్లన్:

వేలకు వేలు?

కోరి:

అవును, అంతే.

మెల్లన్:

తుడిచిపెట్టుకుపోతారా...ఎడ్డీలాగానే.

కోరి:

ఓ నా ప్రియమైన చెల్లీ, నిజంగా నీవంత నిరుత్సాహ పడకూడదు. మనం వాస్తవ ప్రపంచాన్ని గురించి ఆలోచించవలసి వుంది ఈ దేశం ప్రపంచంలో తన స్థానాన్ని నిలబెట్టుకోదలచి నట్లయితే, తన చేతనైన అన్ని సాధనాలూ ఉపయోగించి తీరాలి. ఈ పరిశోధనను నేను నా దేశానికి సమర్పించడంలో నిజంగా గొప్ప దేశభక్తియుతమైన కర్తవ్యాన్ని నిర్వహిస్తున్నానని నా అభిప్రాయం. ఇప్పుడు, చూడు! నా సూత్రం ప్రకారం మనం ఒక బాంబు చేసుకోవచ్చు. బాంబు — చాల పెద్ద బాంబు - అంటే జర్మనీవాళ్ళు లండన్ మీద వేసిన రకం చచ్చురకం తుంపు బాంబు కాదు - చాలా గొప్పబాంబన్న మాట — పూర్తిగా విషవాయువులతో నిండివుంటుందన్నమాట. దాన్ని ఓ పెద్ద విమానంనుంచి వెయ్యాల్సి వుంటుంది. అయితే ఆ విమానం యింకా తయారు కాలేదు. ఈసారి యుద్ధం వచ్చినప్పుడు!...

మెల్లన్:

మళ్ళీ యుద్ధమా?

కోరి:

అవును. మళ్ళీ ఇరవై ముప్ఫై యేళ్ళలో మనకు యుద్ధం వస్తుందని నేనంటాను. నువ్వు ఒప్పుకోవా? ఏమైనా, యాభై సంవత్సరాలకు మించదు. అప్పుడుండే, మనం యుద్ధం చెయ్యదలచుకున్న దేశంమీద పెద్ద పెద్ద విమానాలతో ఈ బాంబులు కుమ్మరించడమే మన అంత్యసందేశ మన్న మాట— జపానువాళ్లు రష్యావాళ్ళఓడలను ముక్కలు ముక్కలుగా పేల్చివేయడంతో రష్యామీద యుద్ధప్రకటన చేసినట్లు! ఉన్న తేడా అల్లా ఏమిటంటే, మన బాంబులు అంతకంటె ఇంకా శక్తివంతంగావుంటాయి. అప్పుడు జపానువాళ్లు కొన్ని ఓడల్ని మాత్రమే ముంచారు. మనం పట్టణాలు పట్టణాలు... బహుశా, ఒక జాతి జాతినీ... ధ్వంసం చేసేస్తాం!

మెల్డన్:

అం......

క్లోరీ:

ఈ బాంబు పడ్డచోట ఆ జిల్లాలో విశాల ప్రదేశం దీని ప్రేలుడుకు భస్మీపటలమై పోతుంది. దీనిలో నుంచి ఒక తీవ్రమైన విషవాయువు, వాసనా రంగూ లేని విష వాయువు విపరీతంగా వ్యాపిస్తుంది. ఎవ డైనా ఆ గాలి పీల్చాడో, వాడికి విషం ఎక్కిందన్న మాటే. తమశరీరాలు స్వాధీనం తప్పేదాకా, వాళ్ళకు ఆ గాలి పీల్చినట్లే తెలియదు. ఇక అప్పుడు వాళ్ళను ఏ మందూ కాపాడలేదుకూడా! ఒకే ఒక్క బాంబుతో మాంచెస్టరంతటి గొప్ప పట్టణంలో వున్న జనాభా నంతటినీ తుడిచి పెట్టవచ్చు. ఒకే ఒక్క బాంబు, చెల్లీ!

మెల్డన్:

అంటే, స్త్రీపురుషులనూ బాలబాలికలనూ అందరినీ తుడిచిపెట్టడమన్న మాటేగా!

క్లోరీ:

అవును! అంతే. అసలు ఈరోజు సైనికుడికీ పౌరుడికీ ఆలోచిస్తే ఏమీ భేదం లేదు. ఫ్యాక్టరీలో మందు గుండు సామాను తయారుచేసే స్త్రీకి, ట్రెంచీలలో వాటి నుపయోగించే పురుషుడికీ తేడా ఏమిటి? కొద్దిమంది మనుష్యులు ఆ కాశంనుంచి పెద్ద పట్టణాన్ని సైతం త్రుటిలో నేలమట్టం చెయ్యటానికి సమర్థమయిన సూత్రాన్ని ఆ కాగితాలమీద వ్రాసుకుని, దాంతో నేనీ టేబిల్ దగ్గర కూర్చో గలిగానన్న సంగతి ఆలోచిస్తే అది నిజంగా భయం కరంగా వుంటుంది. అదికాక, ప్రపంచంలో కల్లా ఇది చెయ్యటం తెలిసినవాణ్ణి నేనొ క్కణ్ణే.

మెల్డన్:

ఇదే ప్రయోగంకోసం ఇతర దేశాల్లో తమ మేధస్సు నుపయోగించే నీలాంటి వాళ్లు లేరా?

క్లోరీ:

లేకేం, వున్నారు. ఇంత శక్తివంతమైన మారణాయుధాన్ని మరెవ్వరూ కనిపెట్టి వుండరనుకుంటాను. నేను ఈ పరిశోధనే 1914 లో చేసివుండినట్లయితే, యుద్ధం ఆ సంవత్సరాంతానికే అయిపోయివుండేది. బహుశా, ఒక్క జర్మనీవాడుకూడా ఇప్ప టికి మిగిలి వుండేవాడుకాడు. అది ఒక గతజాతి అయిపోయివుండేది.

మెల్డన్:

ఒకవేళ, ఎవడైనా మనశత్రువు ఇలాంటిదే కనిపెట్టి, మనమీద ఉపయోగించవచ్చు గదా!

క్లోరీ:

మనం ఎప్పుడూ ఆ ప్రమాదానికి సిద్ధపడాలి సిందే. ఏమైనా, నే కనిపెట్టిందుండే, యిది మన ప్రజలకు లభ్యమవుతుంది. ఈ తడవ యుద్ధమే వచ్చినట్లయితే, మన శత్రు వులకంటే ముందు మనమే వాళ్ళమీద ఈ బాంబు వేస్తేసరి, అంతటితో అంతా తీరిపోతుంది.

మెల్డన్:

నా ఎడ్డీని నాశనంచేసిన గుండు, వాణ్ణి తుడిచి పెట్టిన గుండు కనిపెట్టిన వా డెవడో...నీవంటి వాడే ననుకుంటా!

కోరీ :

(లేచి, ఆమె బుజం తడుతూ) ఇప్పుడు మళ్ళీ ఆ విషయం ఎత్తకు, చెల్లీ. ఇటు ఈ కుంపటిదగ్గరకు రా. జీవితాన్ని గూర్చి ఆశాదృష్టి అలవరచుకోవాలి గాని...

మెల్లన్:

ఆశాదృష్టి! నా ప్రియమైన హెన్రీ, నీ తెలివితేటలలా వుంచి, నీవే ఈ జగత్తులో కల్లా మూర్ఖుడి వేమో ననిపిస్తుంది అప్పుడప్పుడు.

కోరీ :

ఆగు, చెల్లీ, ఆగు!

మెల్లన్:

నేను తెలివిగలదాన్ని కాను. నా భర్త కోసం బిడ్డకోసం వున్న ప్రేమ తప్పితే జీవితంలో మరేమీ లేని అతి సాధారణమైన స్త్రీని. నేను నీ చెల్లెల్ని కావడ మనేది నాకు విపరీతంగా తోస్తుంది. కాని నా బిడ్డ ఛిన్నాభిన్నంగా ప్రేలిపోవడాన్ని గురించి ఏదో పెద్ద రాజకీయవేత్త దృష్టిలో చూడాలని నీవు చెప్పడంచూస్తే, హెన్రీ, నీవు మతిలేని వాడివని - ఊహ చచ్చి రక్తం ఘనీభవించి పోయిన మూర్ఖుడివని- అనిపిస్తున్నది. ఒక పెద్ద పట్నాన్ని క్షణంలో భస్మీభూతం చెయ్యగల బాంబును నీవు కనిపెట్టినందుకు నేను సంతోషించాలని చెబుతుంటే నీవు పిచ్చివాడివని క్రూరమైన భయంకరమైన పిచ్చివాడివని- అనిపిస్తున్నది.

కోరీ :

నా ప్రియమైన చెల్లీ!...

మెల్లన్:

ఒక్క నిమిషం, హెన్రీ. నీవు నాదృక్పథం, కల్లా కపటాలు లేని ఒక అమాయిక స్త్రీ దృక్పథం-ఏమిటో అర్థం చేసుకోటానికి ప్రయత్నించు. నేను తలచుకున్నట్లుగా నే మన ఎడ్డీని ఒక్కసారి తలచుకో!...

కోరీ :

ఇది నీకు మంచిది కాదు, చెల్లీ.

మెల్లన్:

ఎందుకు కాదు? మంచిదే. మళ్ళీ ఆ కొన్ని కటి రోజులే జ్ఞాపకం వస్తాయి. నేనూ టామూ ఆ నవయౌవనంలో ఆటకాయతనంగా... అయితే, ఎంత ఆనందం... ఎడ్డీ కడుపున పడ్డాడని తెలిసినప్పుడు ఆ ఆనందం, చెప్పలేని ఏదో ఆ ఆందోళన... ఆ తర్వాత ఎన్ని రాత్రులు! టాం నా ప్రక్కన నిద్ర పోతూండగా నేను లేచి కూర్చొని, కలుగనున్న పసికందునుగూర్చి ఎలా ఆలోచించే దాన్ని; ఆ రానున్న పాపాయిమీద ఎంత ప్రేమ; అతని తండ్రి అయినందుకు టాంను ఎంత ప్రేమించే దాన్ని; మగపిల్లవాడే అయి తీరుతాడని నాకెంత నమ్మకం ఉండేది! నేను నా బిడ్డను చూడకుండానే చచ్చిపోతానేమో, తర్వాత వాడు ఎక్కడో పెరిగి నన్ను గురించి తెలుసుకోనే తెలుసుకోడేమో నని అప్పుడప్పుడు భయంవేసేది కూడా. తర్వాత, ఆ గలుసుకాస్తా బయటపడ్డాడు. చక్కగా ఎంత ముద్దొచ్చేవాడు! ఎప్పుడూ నన్నే అంటిపెట్టుకొని వుండేవాడు. టాం వాణ్ణి చూసి చాలా సంతోష పడేవాడు, గర్వించేవాడు. కాని, నాఅంత సంతోషం

గానీ, గర్వంగానీ ఆయనకెక్కడా లేదు. వాణ్ణి మేము కళ్ళల్లో పెట్టుకు పెంచాం. నీకు తెలుసు, ఎంత చక్కగా వుండే వాడో!

కోరీ :

అవును, చక్కగానే వుండేవాడు.

మెల్డన్:

వాడు చాలాగొప్పవాడై అందరి ప్రేమకూ పాత్రుడు కావాలని...నిజంగా ప్రజలు వాణ్ణి ప్రేమించే వారు; నీవు కూడా ప్రేమగా చూసేవాడివి. కాదూ. హెన్రీ?

కోరీ :

అవును, నేను ప్రేమించేవాణ్ణి, వాడుచాలా ఆకర్షణీయంగా వుండేవాడు. నువ్వు......

మెల్డన్:

ఆతర్వాత వాడికి జబ్బుచేసింది. వాడు చచ్చిపోతాడేమో నని మేము ఎంతఇదై పోయామో నీకు జ్ఞాపకం వుందికాదూ, హెన్రీ? పాపం, టాం, తనకష్టసుఖాలు ఎప్పుడూ నోరువిప్పి చెప్పుకోలేని టాం! దిగ్భ్రమ చెంది ట్టు నేలమీదకా లునిలువ కుండా తిరుగుతూండే వాడు! హెన్రీ, నేనప్పుడేమనుకునేదాన్నో చెప్పలేను. నేను చెప్పలేక పోతున్నాను. వాడికోసం ఎన్ని ప్రార్థనలో చేసాను; నా మనస్సంతా ఒక పెద్ద ప్రార్థనా మందిరమయింది. ఎలాగో వాడు కుదటపడ్డాడు, పుంజుకున్నాడు, చదువులో కూడా పైకొచ్చాడు. తోటి పిల్లలతో ఆట పాటల్లో గెలుపొందేది, ఆ ఆనందంతో వచ్చి...వాడు నా కళ్ళ ఎదుట కన్పిస్తున్నాడు. తోటి పిల్లలకు వాడిమీదఎంత గౌరవం! వాడితో కలసినందు స్తుంటే ఎంత సంతోషంగా వుండేది. టాం కూడా ఎంతో మెచ్చుకొని వాడికొక నవరసు బహుమానమిచ్చాడు! ...(ఆమె కన్నీటి దొంతరల్లో మునిగి పోతుంది. దుఃఖంగా, తన చేతులతో పెదవులను తడుపుకుంటుంది.) నాముద్దుబిడ్డ!—

కోరీ :

ఇది నిన్ను శ్రమంగదీస్తుంది, చెల్లీ. దీన్ని గురించి మరెప్పుడూ మాట్లాడకు.

మెల్డన్:

(తేరుకొని) యుద్ధం ప్రారంభమయ్యేసరికి వాడు ఆక్స్ఫర్డులో చేరి ఎంతోకాలం కాలేదు. తర్వాత వాడు వెళ్ళిపోయి, సైన్యంలో చేరాడు. వాణ్ణిచూసి గర్వ పడాలో, కోప్పడాలో మాకు తెలియదు. కాని, ముఖ్యంగా గర్వపడ్డాం. వాడు ఆ మురికి యూనిఫారంలో ఆ మొద్దు బూట్లు తొడుక్కొని వుండటం చూస్తే, ఆ తర్వాత వాడు ఆఫీసరు యూనిఫా రంలో వున్నప్పుడు లాగానే, యెంతో ప్రేమ పొంగుకొచ్చేది. వాడు ఫ్రాన్సుకు వెళ్ళేటప్పుడు నేను నా కొడుకుకు తగినతల్లిగా వుండాలనీ, ఏడవకుండా వుండాలనీ ప్రయత్నించాను. అప్పుడు నవ్వడం ఎంత కష్టం! హెన్రీ. కాని నవ్వు తెచ్చుకున్నాను. తక్కినవాళ్ళ ముందు తనకు అవమానం కాకుండా వుంటానికి నేను నవ్వుతూ వీడ్కోలివ్వటం వాడి కిష్టమని నవ్వాను. వాడు అక్కడ దిగడంతోటే జర్మన్లు హడలిపోతారని కూడా హాస్యంగా అన్నాను. కాని

నేను భయపడుతూనే వున్నాను, వాడు దూరంగా వున్నంతకాలం భయపడుతూనే వున్నాను. టెలిగ్రాం తెచ్చే బంట్రోతును చూడగానే నాహృదయం బద్దలయిపోయింది! ...ఆతర్వాత వాడు సెలవుమీద మొట్టమొదటిసారి ఇంటికి వచ్చాడు. కాని నాబిడ్డఇంకాఆచిన్నపిల్లడు కాడు. బాగా ఎదిగి పెద్దవాడైనాడు; అసాధారణమైన జ్ఞానం సంపాదించాడు. వాడిఎదుట నేను నిజంగా సిగ్గుపడ్డాను. వాడు ఎన్నెన్ని దేశాలో చూసాడు; ఎన్నెన్ని సంగతులో తెలుసుకున్నాడు. వాడు పెద్దవాడైనాడని ఇక నేను వాడిమీద ఆధారపడవచ్చునని అనుకుని ఎంత గర్వించాను!ఆసెలవుల్లో వాడున్నన్నాళ్లూ విచారించడానికే తీరేదికాదు, ఒకటే సంతోషం. వాడు వెళ్లిపోయాక కొంచెం ఏడ్చానుకాని,ఎలాగైనా వాడుయుద్ధంలో చావడనే నమ్మకం కలిగించుకోడం వల్ల అంత బాధ లేకపోయింది. వాడు మళ్లీ రెండోసారి సెలవు తీసుకున్నప్పుడు కాపైనే, భద్రంగా ఇంటికి తిరిగివస్తాడని నాకు గట్టిగా నమ్మకం. మనం వాణ్ణి పోగొట్టుకుంటామేమోనని ఎప్పుడూ బాధపడేటాం కూడా, వాడు మళ్లీ ఇంటికి వస్తాడని నమ్మసాగాడు. కాని, వాడు రాలేదు. వాడు ఫ్రాన్సులో దిగంగానే రంగంలోకి వెళ్లవలసి వచ్చింది. ఎనిమిది రోజుల తర్వాత చంపివెయ్యబడ్డాడు— వాణ్ణి! ఎన్నడూ చూసైనా ఎరగని వాళ్ళ చేత, వాణ్ణిచంపి వుంటామనైనా తెలియని వాళ్ళ చేత నీవు చెబుతున్నావే, అట్లా పేల్చివేయబడ్డాడు, ఎన్ని సంవత్సరాలుగానో నేను పెంచుకున్న ప్రేమ, ఆశ, కోరిక, ఆవేదన— అన్నీ గతించిపోయాయి! నేను వాడికి పాలిచ్చి పెంచాను. అహర్నిశలు నీడలాగా కనిపెట్టుకొని కాపాడాను, చిన్నచిన్న పాఠాలు నేర్పాను— వాణ్ణి చూసుకుని భూమి పట్టకుండా గర్వించాను— కాని ఒక్క నిమిషంలో నా చక్కని కొడుకు... పేల్చివేయబడ్డాడు, హెన్రీ! (మళ్లీ ఒక్క క్షణంలో తేరుకొని) అర్థం చేసుకో, హెన్రీ, నేను దీన్ని గురించి విశాల దృక్పథం తీసుకోలేను. అర్థం చేసుకోవూ? ఛిన్నాభిన్నమై, నాశనమైపోయిన నా బిడ్డ శరీరాన్ని మాత్రమే నేను చూడగలను; అంతే!

కోరీ :

అవును! నీ దృక్పథం నాకు అర్థమవుతుంది. అసలు, విశాల దృక్పథం అలవరచుకోటమనేది కష్టమేనని ఒప్పుకుంటాను. ఏమైనా ఎడ్డీ, తన దేశంపట్ల తన కర్తవ్యాన్ని నిర్వర్తించాడనే సంతృప్తి వుండనే వుందికదా! అదలా వుంచి, ఎడ్డీ తన ప్రాణానికి ఎంతమంది జర్మన్లనో బలి తీసుకొని వుంటాడని నేను ఖండితంగా చెప్పగలను!...

మెల్డన్:

అందువల్ల నాకు సంతృప్తి కలగదు, హెన్రీ! నాలాగానే ఎవరో ఓ జర్మన్ అభాగ్యురాలు దుఃఖపడుతున్నదని తలచుకోవడం నాకేమీ ఆనందం కలగదు. కలగదు, హెన్రీ, నేనుకూడా ఆ జర్మన్ స్త్రీతో కలిసి, నీవంటి పురుషులమీద పగ తీర్చుకోవాలని వుంది!

కో రీ :

నావంటి పురుషులా !

మె ల్డ న్:

అవును. విశాల భావాలుకల మనుష్యులు. మీరు యిలాంటి బుద్ధిహీనులు కనుక. నావంటి ఒక తెలివిలేని మనిషి నా బిడ్డ లాంటి ఒక చక్కని మనిషిని సృష్టిస్తే, మీరు, మీ తెలివితేటల్తో దాన్ని కేవలం నాశనం చెయ్యగలరు. అందుకే నీవు బుద్ధిహీనుడి వనుకుంటున్నాను.

కో రీ :

తెలిసింది. ఈ భావాలతో నీవు నన్ను గానీ, నా పరిశ్రమనుగానీ అభినందిస్తావని నేను యెంతమాత్రం అనుకోడంలేదు. అయితే, నా దేశస్థులు - వాళ్ళ కేమన్నా జ్ఞానం వుంటే - నన్నెలా గౌరవించాలో తెలుసుకుంటారు. ఈ దేశంలోకల్లా వున్న పరమ మూఢుడికి కూడా, నా బాంబే, నా పేరు తెలియజేస్తుంది. యుద్ధకాలంలో 'మిల్సు బాంబు'ను గురించి మాట్లాడు కున్నట్టుగానే, ప్రజలు 'కోరీ బాంబు'ను గురించి కూడా మాట్లాడుకుంటారు. ఏదో ఒక పారితోషికం అయితే నా పరిశ్రమకు తగిన ప్రతిఫలం ముట్టదు కనక, ఈ పరిశోధనకు గాను నేనోక పెద్ద మొత్తం అడుగవలసి వుంటుంది తన ప్రతి బాంబుమీద మిల్సుకు రాయల్టీ ముట్టింది. కాని, అప్పుడవి చాలా చిన్నవి కావడంవల్ల లక్షలకు లక్షలు వాడవలసి వచ్చింది. అలా కాక, నా బాంబులు పెద్దవి. ఒక్కొక్క పట్టణానికి ఒక్కొక్కటి చాలు. అవును, నేను చాలా పెద్దమొత్తం అడగవలసి వుంటుంది. సాధారణంగా నిరుపయోగమని అనుకునే యుద్ధనావలకోసం వాళ్ళు ఇప్పుడు కోట్లకుకోట్లు ఖర్చుపెడు తున్నప్పుడు, నిశ్చయంగా యుద్ధఫలితాన్ని తేల్చగల నా బాంబుకుగాను నేను చాలా ఎక్కువ మొత్తం అడిగే హక్కు వుంది. అసలు, ఎంతడబ్బు అడగాలో! చెల్లీ, ఎంత అడగవలసి వుంటుంది? దాని విలువకు తగ్గట్టుగా వాళ్ళేమీ ఇవ్వరు. అది అంతవరకు నిజం. బహుశా, రెండుమూడు లక్షలివ్వవచ్చు. కాని, చెల్లీ, నువ్వే నా స్థితిలో వుంటే, ఎంత అడిగేదానివి?

మె ల్డ న్:

నాకు నా కొడుకు కావాలని అడిగేదాన్ని.

కో రీ :

ఇదిగో, చెల్లీ, దయయుంచి ఆ విషయం ఎత్తకు. వద్దు. మనం భవిష్యత్తును గురించి ఆలోచించాలి. గతాన్ని గురించి కాదు. ఎలాగూ ఇవ్వరు కనుక అంత ఎక్కువ మొత్తం అడగాలనిలేదు. కాని ఎలాగైనా ఇస్తారుగదా అని అంత తక్కువమొత్తమూ అడగను— నీ వుద్దేశ్య మేమిటి, చెల్లీ, వాళ్లనే ఒక ధర చెప్పమనటం మంచి దంటావా?

మె ల్డ న్:

నాకు తెలియదు.

కో రీ :

నీవు ఈ విషయంలో కొంచెం శ్రద్ధ తీసుకోవాలి. ఇది నాకు చాలా ముఖ్యం. నాకొక బిరుదంకూడా ఇవ్వాలిసి వుంటుంది.

పదిలక్షల పౌన్లూ, ప్రభు బిరుదం కావాలంటాననుకో!...

మెల్డన్:

ముప్పై షిల్లింగులు చెప్పరాదూ?

కోరీ:

(పూర్తిగా ఆగ్రహంతో) నిన్ను సహించడం కష్టం! ఇక నేనిది భరించలేను! నువ్వేదో పాపం కష్టాల్లో వున్నావు కదా అని నీతో ఇంతగా పొద్దుపుచ్చుతున్నాను. అయినా ఓర్పుకు హద్దువుంది. నీవు నన్ను కనీసం మర్యాద కోసమన్నా, అభినందించలేదు సరిగదా, ఇప్పుడు నిష్ప్రయోజనమైన దేనికోసమో ఆక్రోశిస్తూ నీవు దుఃఖంలో మునిగి, నన్ను కూడా బాధపెడుతున్నావు. నీవు పోనాను కూడా ఇలాగే కలవరపెట్టి వుంటావు. నా ప్రియమైన చెల్లీ, నీ మంచి కోరి చెబుతున్నాను. నువ్వు ఈ విషయాలమీదికి నీ మనస్సును పోనీయకూడదు. అది మంచిది కాదు. అందువల్ల నాకుగానీ, నీతో కలిసి వుండే తక్కినవాళ్లకు గానీ కష్టం అనిపిస్తుంది. నీ బిడ్డ చంపబడ్డాడు, నిజమే— అలాగే అనేకమంది ప్రజల బిడలు గూడా చంపబడ్డారు—కాని మనం మిగతా జీవితమంతా అలాగే ఏడుస్తూ గడపలేము. నేను నాపని చేసుకోవాలిగదా!...

మెల్డన్:

నీ బాంబు?

కోరీ:

ఊ!

మెల్డన్:

ఛిన్నాభిన్నంగా ధూళి క్రింద చిమ్మి వెయ్యగా మిగిలిన పురుషుల యొక్కా, స్త్రీలయొక్కా, పసిపాపలయొక్కా శరీరాల్లో విషం పెట్టి మరణ యాతనకు గురి చేసే ఆ బాంబు.

కోరీ:

మన యుద్ధవిధానంలో ఇదొకవరమనుకో, చెల్లీ! అసలు ఒకమనిషి బాంబువల్ల ముక్కలు ముక్కలై పోతేనేం; లేక, కత్తితో పొడవడంవల్ల చచ్చిపోతేనేం;— ఇందులో తేడా ఏముంది? నిజానికయితే, ఈ రెంటిలో బాంబే ఎక్కువ దయతో కూడిన ఆయుధం. ఇలాంటి విషయాల్లో ఆవేశం ప్రకటించి ప్రయోజనంలేదు. యుద్ధం యొక్క లక్ష్యం చంపడమే, ఏపక్షమైతే ఎక్కువమంది ప్రజల్ని, మరీ తక్కువ కాలంలో చంపుతుందో, భవిష్యద్యుద్ధాల్లో ఆ పక్షం విజయం పొందుతుంది. నాబాంబు ఎవరి చేతిలో వుంటుందో వాళ్లకది యుద్ధాన్ని వేగంగాను తీవ్రంగాను జరిపే శక్తినిస్తుంది. ఆలోచించేవాడెవడైనాసరే, ఈ బాంబును కనిపెట్టడంలో, దాని ఉపయోగం ద్వారా, నేను నాదేశానికి సేవ చేశాననే విషయం కాదనలేడు. ఇవాళ ఎడ్డీ చనిపోయినరోజు కావడం, దానికితోడు ప్రొద్దుట విన్న విషయం నీమనస్సును కలతపెట్టడం జరక్క పోయినట్లయితే, నీవైనా నాతో ఏకీభవించేదానివే.

మెల్డన్:

ఈ పరిశోధనా రహశ్యం నీకుతప్ప మరెవ్వరికీ తెలియదా, హెన్రీ?

కోరీ:

తెలియదు, అసలు నేనీపనిలో వున్నానని కూడా ఎవరికీ తెలియదు.

మెల్డన్:

నీవు నీ పరిశోధనను నాశనం చేసేసి, ఆ రహస్యాలను ఎప్పటికీ బయటపెట్టకుండా వుంటేటట్లయితే మన ఎడ్డీవంటి యువకులు లక్షలమంది మృత్యుభయం లేకుండా జీవిస్తారుగదా?

కోరీ:

నాకు తెలీదు. అదంతా వట్టి ఊహాగానం అందులో ఏమీలేదు. ఇతరులు నాబాంబు కంటె కూడా భయంకరమైనదాన్ని కని పెడతారు.

మెల్డన్:

కాని, హెన్రీ, నీవు పరిశోధనను బయట పెట్టకుండా వుంటే?

కోరీ:

బయటపెట్టకుండానా!

మెల్డన్:

అవును. నీవు నీసూత్రాన్ని నాశనంచేసినట్లు ప్రజలు తెలుసుకుంటే నీవు వారి హృదయ పరివర్తన కెంతో తోడ్పడినవాడివవుతావు!......

కోరీ:

నా ప్రియమైన చెల్లీ, తెలిసినవాళ్ళందరూ నాకు మతిపోయిందంటారు. కొంతమంది దుర్బలులో వేదాంతులో నన్ను పొగడవచ్చు. కాని మామూలు మనిషిమాత్రం దేశభక్తి లేకుండా వున్నందుకు నన్ను నిందించడమే కాక, మూర్ఖుడినంటారు.

మెల్డన్:

హెన్రీ, నీ పరిశోధన నాశనంచెయ్యి, నేను బ్రతిమాలుతున్నాను.

కోరీ:

ఆఁ, ఏమిటి ? నువ్వు...

మెల్డన్:

దాన్ని నాశనం చెయ్యమని బ్రతిమాలుతున్నాను ఎడ్డీ స్మృతికోసం యీపని చెయ్యి, హెన్రీ!...

కోరీ:

నా ప్రియమైన చెల్లీ, దుఃఖం నీ మనస్సును క్రుంగదీసిందనుకుంటాను. నా పరిశోధనను నాశనం చెయ్యటమా !

మెల్డన్:

నీ బాంబు మానవజీవితాన్నే నాశనం చేస్తుంది. ఆ బాంబునే నాశనం చెయ్యి, హెన్రీ, బ్రతిమాలుతున్నాను.

కోరీ:

పిచ్చిదానా ! పిచ్చిదానా !

మెల్డన్:

అయితే, నీకోసం నేనే దాన్ని నాశనం చేస్తాను[ఆమె టేబిల్ దగ్గిరకెళ్ళి, దాన్ని తోసిపారేస్తుంది ఆరిటార్టులన్నీ యెక్కడివక్కడ బద్దాబద్దలై పోయాయి.

కోరీ:

ఏమిటీ అఘాయిత్యం ?

మెల్డన్:
నీ పాపిష్టి పరిశోధనను అంతం చేస్తున్నాను.

కోరి :
(కఠోర హాసంతో) యింత మాత్రంతో అది నాశనం కాదు. అదంతా నా తలలోనే వుంది. నీవు చేసిందంతా, చెల్లీ, నా గది పాడుచెయ్యడం తప్ప మరేం కాదు. ఇది వట్టి చిలిపిచేత అంటాను.
[క్రిందికి వంగి, ఆ పడిపోయిన వాటిని ఎత్తడం మొదలుపెడతాడు.

మెల్డన్:
(అతని వెనకాల నిల్చొని) అదంతా నీ తలలోనే వుందా!

కోరి :
ఔను, వుంది. ఒక మతిలేని ఆడది తప్పితే మరెవరైనా ఆ సంగతి గుర్తించేవారే. ఇదంతా చేతగాని తిరగడంగాని——

మెల్డన్
అయితే, అదంతా నీ తలలో వుందా?

కోరి :
ఔను. మళ్ళీ మళ్ళీ అడగడం దేనికి? రా, నువ్వు ఖరాబుచేసిన గది తుడిచెయ్యటానికి కాస్త సహాయం చెయ్యి.

మెల్డన్:
హెన్రీ, నేను చెప్పిన పని చెయ్యవా?

కోరి :
మరీ మూర్ఖురాలివి కావాకు. (చుట్టూ చూసి) అదే, అక్కడుండే, ఆ గుడ్డ ఇవ్వు. ఇదంతా తుడిచేస్తాను.
[ఆ పగిలిపోయిన గాజు ముక్కలూ వగైరా ఏరుతూంటాడు. ఆమె గుడ్డకోసం టేబిల్ దగ్గరకు పోతుంది: అక్కడ టేబిల్ మీద ఓ పొడుగాటి కత్తి కన్పిస్తుంది. అప్రయత్నంగా దాన్ని చేతబట్టుకొని, దాని వంక చూస్తుంది.

కోరి :
(ఓర్పు లేకుండా) రా, త్వరగా, రా. అక్కడేం చేస్తున్నావు?

మెల్డన్:
నేనిక్కడేదో చూస్తున్నాను—ఈ కత్తి!

కోరి :
సరే, దాన్ని తర్వాత చూడవచ్చు. ముందు ఆ గుడ్డ పట్టుకురా. ఇదిగో బల్లక్రింద ఎడ్డీ కోసం తెచ్చిన పూలదండ వుంది. నువ్వు దాన్ని కూడా పాడు చేశావు!

మెల్డన్:
ఎడ్డీ దండ!
[అలా కత్తితోనే, ఆమె కోరీ వైపు వస్తుంది

కోరి :
అవును.

మెల్డన్:
హెన్రీ నీవు పరిశోధనను మరచిపోతే, ఆ దండసంగతి నాకు లక్ష్యం లేదు. ఎడ్డీకి ఇచ్చే కానుక, నా కానుక కంటే, మహత్తరమైనదవుతుంది.

కోరి :
సరెలే, నేను మరచిపోలేను, ఒక మతిలేని ఆవేశంకోసం నా పరిశోధన వదలుకోవాలి! అసాధ్యం!

మెల్డన్:
అది జీవితాన్ని నాశనం చేస్తుంది, హెన్రీ!

కో రీ :

అసలు దానికీ దీనికీ సంబంధం ఏమిటి? ఆగుడ్డ ఇటివ్వు.

[ఆమె చేతిలోంచి గుడ్డ లాక్కుంటాడు కాని, రెండో చేతిలోవున్న కత్తిని చూడ లేదు.

మెల్డన్:

అయితే, నువ్వుదాన్ని నాశనం చెయ్య వన్నమాట! అంతేనా?

కో రీ :

(కసిరినట్లు) చెయ్యను!

మెల్డన్:

(అతని మీదికి కత్తిఎత్తి) అయితే నేను...

[నిరాశతో, ఆవేశంతో అతణ్ణి కత్తితో వెన్నున పొడిచేస్తుంది గద్గద కంఠంతో మూలుగుతూ, ఒక్కక్షణం అటూ ఇటూ ఊగి, గాలిలో తడవుకుంటూ బోర్లా పడతాడు.

[ఆమె అతని కెగువగా నిలబడి, అతని శరీరంవంక దిగ్భ్రమగా చూస్తున్నది. అప స్మారంగా ఏడుస్తున్నది. అంతలో అక స్మాత్తుగా వంగి, తెగిపోయిన పూలమాల తీసుకొని హృదయానికి హత్తుకొంటూ, ఎదుటిగోడవైపు గాభరాగా చూస్తున్నది.

మెల్డన్:

ఎడ్డీ! ప్రియమైన ఎడ్డీ! చంపవలసి వచ్చింది. తప్పనిసరి! చంపాను. ఎడ్డీ!......

— తె ర —

వీరేశలింగ
శతవార్షికోత్సవము

ఏప్రిల్ 16 వ తేదీన జరిగే వీరేశలింగ శతవార్షికోత్సవాన్ని ఆంధ్రదేశమంతటా దిగ్విజయంగా జరపాలని ఆంధ్రాభ్యుదయ రచయితలసంఘం నిర్ణయించింది. ఆ సందర్భంలో వీరేశలింగ సాహిత్యం, సంస్కరణోద్యమాన్ని గూర్చిన ప్రముఖుల వ్యాసాలు, గీతాలు, చిత్రాలతో "అభ్యుదయ" ఏప్రిల్‌లో ప్రత్యేక సంచికగా వెలువడుతుంది. ప్రతులకు త్వరపడి ముందే వ్రాయమని కోరుతున్నాము.

—సంపాదకులు : అభ్యుదయ

హిందూ ముస్లిం ఏక్ హో!

★

అఖిలభారత ప్రజానాట్యమండలి మహాసభ - ప్రదర్శనలు

గుజరాతురాష్ట్ర ముఖ్యపట్టణం అహమ్మదాబాదులో విద్యుత్కాంతిమయమూ, సర్వాలంకృతమూ అయిన చలువపందిరిలో మూడు వందల మంది ప్రతినిధులూ, పదిహేను వేల మంది ప్రేక్షకులూ ఆసీనులైనారు. శ్రీ రవిశంకర రావాల్ రమ్యమైన వేదిక నలంకరించారు. గుజరాత్ వైజ్ఞానిక దళం "జై,జై, గర్వీ గుజరాత్" పాడారు. గీతం గర్వంగా, హుందాగా సభామందిరంలో ప్రవహించింది. ముగ్ధ కళాదేవి ఉత్కంఠిత అయింది.

బెంగాల్ దళం "సారే జహాఁసే అచ్ఛా హిందో సఁతాన్ హమారా" పాడారు. దేశమాత యెడల ప్రేమతో భక్తితో సభ పులకించింది.

నాట్యరంగం ప్రజాజీవితానికి ప్రతిబింబంలాంటిది. వివిధ భావాలుకలవారు సమావేశం కాగల ఐక్యవేదిక, "నాట్యం భిన్నరుచేః జనస్యబహుధాపి, ఏకం సమాధానం" అన్నారు మన పూర్వులు.

"కళను వాస్తవిక ప్రపంచంలోకి తీసుకురావడానికి ఎంతో శాస్త్ర పరిశోధన చేయాలి. అన్ని రాష్ట్రాల్లోనూ, భారత ప్రజానాట్యమండలి యాజమాన్యాన కళా పరిషత్తులను స్థాపించాలి. అందరం కలసి కృషిచేయాలి" అంటూ శ్రీ చైతన్యప్రసాద్ దివాన్జీ మహాసభను ప్రారంభించారు.

కళాయజ్ఞం—

1947 డిసెంబరు 25 నుంచీ 30 వరకూ మహాసభ కళాయజ్ఞంలా జరిగింది. శ్రీరవిశంకర రావల్ అధ్యక్షుడు. మనోరంజన్ భట్టాచార్య, ఆర్. ఆర్. నిష్వాణి, అహమద్ అబ్బాస్ మొదలైనపెద్దలుఋత్విజులు వివిధ రాష్ట్రాలనుంచి సమావేశమైననాట్యమండలి ప్రతినిధులు, 15 వేలమంది ప్రేక్షకుల సమక్షంలో కళాదేవిని ఆరాధించారు. ఉపాసించారు.

బొంబాయి (బలరాజ్ సహానీ) దళ "ఘూత్ గాడీ" "గాంధీ–గూండా" నాటికలను ప్రదర్శించింది. మహారాష్ట్ర (అమర

షేక్) దళం "తమాషా"ను (మా బుర్రకథ లాంటిది) ప్రదర్శించింది. సంయుక్తరాష్ట్ర దళం అప్పటికప్పుడు రంగస్థలంమీద ఆశువుగా నాటిక నొకటి ప్రదర్శించింది. బెంగాల్ దళం "అమరజీవుల"ను ఛాయా నాటిక ప్రదర్శించింది. అస్సాం దళం 'మణిపుర్' నృత్యం చేసింది. ఆంధ్ర దళం "బద్మాష్ షామూషా" "తెలంగాణా" నాటిక, "పంటసిరి" "కష్టజీవి" "సుత్తి కొడవలి" నృత్యాలు ప్రదర్శించింది. ఆంధ్ర మోనో ఆక్టరు డాక్టరు చంద్రశేఖరం "విచిత్ర బ్రాహ్మణుడు" అభినయించారు.

ఇంకా సమిష్టిగానాలు, వ్యష్టిగానాలు నృత్యాలు, జానపదాలు, ఎన్నెన్నో ప్రదర్శించారు. అంతా శిల్పమే. అన్నీ కళాఖండాలే. మహాసభంతా కళారసమయ జగత్తు.

బ్రహ్మాండమైన శాంతిఉత్సవం—

డిసెంబరు 28 అహమ్మదాబాదు చరిత్రలో మరువరాని స్వర్ణఘట్టం. అది కళాకారుల శాంతి ఉత్సవం.

అలంకరింపబడిన యెనిమిది లారీలు. ఒక్కొక్క రాష్ట్రదళం ఒక్కొక్క లారీలో యెక్కింది. అందరూ అద్భుతంగా, చిత్రవిచిత్ర వేషాలను ధరించారు. ముందు లారీలో రవిశంకర రావల్ మనో రంజన్ భట్టాచార్య, అబ్బాస్, నిహ్వాణి మొదలైన పెద్దలధిష్టించారు.

ఆంధ్రలారీ టాంక్ మీద శ్రీ డాక్టర్ చంద్రశేఖరం జవహర్‌లాల్ వేషమూ, శ్రీ వెంపటి రాధాకృష్ణమూర్తి ముస్లిం వేషమూ, కోసూరి పున్నయ్యగారు "యెల్లమంద" వేషమూ వేసి చెరో వేపున నిలుచున్నారు. జవహర్‌లాల్ వారిద్దరి మధ్య పతాకాన్ని ఎగురవేస్తూ నిలుచున్నారు. దళంలో ఎనిమిదిమంది సముచిత వేషాలను ధరించి డప్పులమీద వరుసలు వాయిస్తూ, అడుగులువేసి నృత్యంచేస్తుంటే, హిందూ ముస్లిం పూల దుకాణాల నుంచి పూలమాలలు వర్షించాయి.

నాల్గు బజార్లు కలిసిన చౌక్ చేరింది వుత్సవం. లక్షా యేభైవేలమంది ప్రజలు చేరారు. అహమ్మద్ అబ్బాస్ ఉపన్యసించాడు.

"అహమదాబాద్ సోదరులారా! దూరశ్రవణయంత్రం గర్జించింది.

"హిందూ ముస్లిం సోదరులారా! మేం మీ బిడ్డలం. కళాసేవ చేస్తున్నాం. యీనాడు మీ సుందర నగరంలో మహాసభను జరుపుకుంటున్నాం. మీ రెంతో ఆదరాభిమానాలు చూపించారు. మా కన్ని విధాలా తోడ్పడ్డారు. మీకు కృతజ్ఞులం.

"కాని చూడండి! దేశం ఎంతటి మారణహోమగుండమయిందో చూడండి. తగాదాలు కాదు, ఎత్తిపొడుపులు కాదు నేడు కావలసింది. శాంతి! కావాలి. సంపూర్ణ శాంతి కావాలి. నెహూ్రు శాంతి కావాలంటున్నాడు. రైతుకూలీ ప్రజా సామాన్యం శాంతి కావాలంటున్నది. మా ప్రజానాట్యమండలి గూడా శాంతి కావాలంటున్నది. హిందూ-ముస్లిం సామరస్యమే, శాంతియే, మన భవిష్యత్సుఖజీవితానికి మార్గం. ఏమంటారు మీరంతా? శాంతిని కోరుతున్నారా?" అని ఉద్రిక్తుడై గంభీరంగా ప్రశ్నించాడు.

"శాంతి కావాలి !
హిందూ ముస్లిం భాయ్ భాయ్"

నినాదాలు అసంఖ్యాక కంఠాలనుండి మిన్నుముట్టి దిక్కులు ప్రతిధ్వనించాయి.

ప్రజాగాయకుడు అమర్ షేక్ "హిందుసంఘ రాజ్యాచార" అని ఐక్యతాగానం చేశాడు. ప్రజలు శృతికల్పారు. హిందువులు ముస్లిములు తన్మయులై ఒకరి నొకరు కౌగలించుకున్నారు. మహాసభ భారదేశాని కైక్యతా సందేశమిచ్చింది.

వేత్తలు కళాప్రయోజనం నిర్ణయించారు

ప్రఖ్యాత శిల్పశాస్త్రవేత్త, కళాకోవిదుడు, నిహ్వాణిగారుఇలా ఉద్ఘాటించారు.

"భారత ప్రజానాట్యమండలి, భారత ప్రజల సంస్థయని దానిపేరే చెప్తుంది ఇది రంగస్థలం ద్వారా, నాటకం ద్వారా నృత్యం ద్వారా, ప్రజా వాంఛలనూ, ఆశయాలనూ చిత్రిస్తుంది వారిసంస్కృతిలో ఉత్తమోత్తమ స్వభావానికి దోహదమిస్తుంది. అంతేకాక దేశాన్నెదుర్కొన్న సమస్యలను వాస్తవిక దృష్టితో పరిశీలించి ప్రస్తుత విషమ స్థితినుంచి తరించే పరిష్కారమార్గమును సూచిస్తుంది."

(బాంబే క్రానికిల్)

ఆంధ్రదళానికి అగ్రతాంబూలం -

మహాసభ ప్రజానాట్యమండలి శాఖల నివేదికలను పర్చించి కార్యక్రమ నిర్ణయం చేసింది.

"ఆంధ్ర ప్రజా నాట్యమండలి సమిష్టిగానాలు విప్లవపటుత్వం గల్గి గంభీరంగా ఉన్నై. వారి జానపద నృత్యాలూ గేయాలూ, శాస్త్రసమ్మతాలే గాక వైపుణ్యమూ, దర్శనీయత్వమూ బాగున్నవి. నైజాం నిరంకుశత్వానికి వ్యతిరేకంగా తెలుగు ప్రజల పోరాటాన్ని చిత్రించే "మాభూమి" నాటకం చూడలేక పోయినందుకు విచారిస్తున్నాం. ఆ నాటకం వారి రాష్ట్రంలో నూటికిపైన దళాలేర్పడి ఒక్క సంవత్సరం తిరక్కముందే వెయ్యి మార్లకు పైగా ప్రదర్శింప బడ్డది. ఇది ప్రపంచం మొత్తంమీద చెప్పుకోదగ్గ ఘనకార్యం."

(బాంబే క్రానికిల్)

ఆంధ్రదళానికి అహమదాబాదాంధ్రులు మెడల్ బహూకరించారు.

కార్యవర్గం:

నూతన సంవత్సరానికి —

అధ్యక్షులు :
శ్రీ మనోరంజన్ భట్టాచార్య.
(బెంగాలు)

ఉపాధ్యక్షులు :
శ్రీమతి సుబ్బలక్ష్మి.
(తమిళనాడు)

శ్రీ రవిశంకర్ రావల్ (గుజరాత్)

కార్యదర్శి :
శ్రీ నిరంజన్ సేన్.
(బెంగాల్)

సహాయ కార్యదర్శులు :
అబ్బాస్, పార్వతి
(బొంబాయి)

శ్రీ రాజారావుగారిని దక్షిణ ప్రాంతానికి జోనల్ కార్యదర్శిగా ఎన్నుకున్నారు.

నూతన సంవత్సరానికి కార్యక్రమాన్నీ, విధానాన్నీ నిర్ణయించుతూ భారత ప్రజానాట్యమండలీ, యితర వైజ్ఞానిక సంస్థలూ, కళాసాధనాలద్వారా మతదురహంకారాన్నీ, ద్వేష ప్రేరేపక సిద్ధాంతాలనూ వాటివల్ల వచ్చే అపాయాలనూ వ్యతిరేకించి పోరాడాలని మహాసభ ప్రోత్సహించింది.

గిట్టని వాళ్ళున్నారు —

దేశం ప్రజలది.

అహమ్మదాబాదు నగరంకూడా ప్రజలదే నని యీ మహాసభా, శాంతి ఉత్సవమూ ఋజువుచేశాయి. కాని అహమదాబాదులో సంపన్నులు, అధికారులైనవారు వేరే ఉన్నారు. పత్రికలు వారివి. ఇంతటి ఉత్సవమూ, కోలాహలమూ అహమదాబాదు నగరాన్ని ముంచెత్తుతూంటే ఒక్క పత్రికా ప్రచురించలేదు. శాంతిఉత్సవం జరిగిన మరునాడు అబ్బాస్ సమాధానం చెప్పారు.

"ఈ పట్టణంలో చాలామంది పెద్దలను కలుసుకున్నా. వారు మా కళా సేవను గురించి పొగిడారు.

"కాని ప్రజానాట్యమండలి కమ్యూనిస్టుల పలుకు బడి కింద వుందనీ, దానికి వచ్చిన విరాళాల సొమ్మంతా కమ్యూనిస్టు పార్టీకి వెళుతూందనీ అనుమానాలు వెల్లడించారు.

"నేను కమ్యూనిస్టును గాను. కాని ప్రజానాట్యమండలికి బాధ్యతా స్థానంలో ఉన్నాను. కమ్యూనిస్టులు, సోషలిస్టులు కాంగ్రెసువారు అందరూ యీమండలిలో కలసి పని చేస్తున్నారు. ప్రజా నాట్యమండలి యే రాజకీయ పార్టీకి సంబంధించిది కాదు. మీరు మాప్రదర్శనాలద్వారా వాన్ని చూడ ల్గాగ.

"మేము కళారూపాలద్వారా ప్రజల్లో చైతన్యం కలిగిస్తున్నాం. రైతుకూలీ జీవితాలను చిత్రిస్తున్నాం. హిందూముస్లిం ఐక్యతా ప్రదర్శనాలు చేస్తున్నాం. సంస్థాన ప్రజాపోరాటాలను చిత్రిస్తున్నాం ప్రజా స్వామిక నిర్మాణానికి కృషి చేస్తున్నాం."

"మరొక విషయం. ఇంతటి మహాసభ జరుపుతూంటే, ఇండియన్ పార్లమెంటు అధ్యక్షుడు శ్రీ మవలంకరుగారి నుంచీ యింతమంది పెద్దలు హాజరవుతూంటే; ఈ పట్టణమునుండి వెలువడే గుజరాతీ దిన పత్రికలు దీన్ని గురించి ఒక్కవార్తా ప్రకటించలేదు. మాయ! యీ మహాసభా, ఈ ప్రేక్షకులూ, ఈ ప్రదర్శనాలూ ఆఖరుకు నిన్నటి బ్రహ్మాండమైన ఉత్సవమూ అంతా మాయ! జరగలేదు!"

సభ కరతాళ ధ్వనులతో ప్రతిధ్వనించింది. అబ్బాస్ ప్రయోగించిన వాడి ములుకులకు నిలువలేక ఒక్క పత్రిక మాత్రం "మహాసభ జరుగుతుంది. కాని ప్రదర్శనాలన్నీ ఎర్రగా వున్నాయి." అని వ్రాసింది.

కాని ప్రదర్శనాలు విప్లవభారతదేశాన్ని ఆకర్షించినవి. కాశ్మీర్ ప్రతినిధి యిలా అర్థించాడు:

"షేర్-ఇ-కాశ్మీర్ ప్రభుత్వం ప్రజానాట్యమండలికి కాశ్మీర్‌లో భవనం కట్టించి యిచ్చింది. బొంబాయి దళాన్ని విమానం మీద పిలిపించి యుద్ధరంగంలో సైనికుల

కొరకు రేడియో ద్వారా పాటలు, నాటికలూ వినిపించింది. మీ సహాయసానుభూతులు మాకు పరిపూర్ణంగా ఉంటే, స్వర్గ సమానమైన మా మాతృభూమి కాశ్మీర్ నుండి దుండగీండ్రను తరిమి నాశనంచేస్తాం. ఆంధ్ర, బెంగాల్, బొంబాయి ప్రజానాట్య మండలిదళాలు కాశ్మీరుకు చాలా సాయం చేశాయని, మా నాయకుడు షేక్ అబ్దుల్లా తెలుసుకుని అభివందనాలు పంపాడు. మీరలాగే సాయం చేస్తారని ఆశిస్తున్నాను."

— ఒక విలేఖరి.

"కళలు సమాజ జీవిత ప్రతిబింబాలయితేనే ప్రజాదరణ వుంటుంది"

★

ఆంధ్ర నాటక కళాపరిషత్తు 14 వ మహాసభ

"ఏదేశపు ఔన్నత్యమైనా, దాని కళాసంస్కృతులమీద ఆధార పడుతుందే గాని, సైనిక బలంమీద కాదు. మన స్వతంత్ర ప్రభుత్వం మన జాతీయ కళా సంస్కృతులకు దోహదం చెయ్యాలి. ఒక నాటకంగానీ, ఫిలింగానీ - ఏ కళాఖండమైనా సరే నేటి మానవసమాజానికీ జీవితానికీ ప్రతిబింబాలుగా వుండి, అన్నివర్గాల ప్రజల ఆదరణనూ చూరగొనాలి!"

అన్న సుప్రసిద్ధ కళావేత్త శ్రీ శాంతారాంగారి ప్రారంభక వచనాలతో ఆంధ్రనాటక కళాపరిషత్తు 14 వ మహాసభ ప్రారంభమైంది. అయితే, ఇది ఏదో మామూలు వార్షికోత్సవం కాదు; లాంఛనప్రాయంగా జరిగిపోయిందీ కాదు. నానాటికీ పెంపొందుతూన్న జాతీయ కళాసరస్వతికి యాదృచ్ఛికంగా ఇదొక వేదికై పరిషత్తుకే కొత్తజీవం పోసింది.

జనవరి 15 మొదలు 18 వ తేదీదాకా, వరసనే నాలుగురోజులూ, రాత్రింబగళ్లూ మహాసభా కార్యక్రమం నిర్విరామంగా జరిగినప్పటికీ, ప్రేక్షకుల్లో ఒక్క నిట్టూర్పు లేదు. అదే మహాసభా విజయానికి గుర్తు.

ఆంధ్రదేశంలో ఆదర్శనాటక శాలలు నిర్మించవలసిన అవసరాన్ని గురించి తహతహలాడుతూ, తనజీవితమంతా ఆంధ్ర నాటక రంగానికి అంకితంచేసి, ఆకృషిలోనే తన జీవితాన్ని ముగించిన శ్రీబళ్లారి రాఘవ గారి పేరిట, 'రాఘవకీర్తి మందిర' మనే ఒక ఆదర్శ నాటక శాలకు శంకుస్థాపన జరగటం ఈ సభా కార్యక్రమంలో ప్రధానమైనది. తరువాత, నటీ

నటుల్లో, శ్రీమతి కృష్ణవేణి శ్రీ ఉప్పులూరి సంజీవరావు, ముదిగొండ లింగమూర్తి గార్లకు ప్రసిద్ధ నాటక రచయితగా శ్రీ పింగళి నాగేంద్రరావు గారికీ, దర్శకుల్లో శ్రీ బి. ఎన్. రెడ్డిగారికీ సన్మానాలు జరిగాయి. శ్రీ చెళ్లపిళ్ల వేంకట శాస్త్రి గారికి విధ్యుక్తంగా 'పాదపూజ' చేశారు.

ముఖ్యంగా సన్మానితులలోనూ, ఉపన్యాసకులలోనూ ఎక్కువ మంది, మన జాతీయ కళాభ్యుదయానికి ప్రస్తుత ప్రజా ప్రభుత్వం సహాయ పడాలని నొక్కి చెప్పారు. "ఇంతకాలం మన జాతీయ నాయకులు కళవైపు కన్నెత్తి చూడలేదు. ఇకనైనా చూస్తారా?" అని శాంతారాం గారు ప్రశ్నించారు. "ప్రజావిజ్ఞానానికి అవసరమైన నాటకాలమీదా సినీమాల మీదా ప్రభుత్వం లేనిపోని పన్నులన్నీ వేసి వాటిని ప్రజాసామాన్యానికి అందుబాటులో లేకుండా చేస్తున్నదనీ, ప్రజాజీవితాన్ని ప్రతిబింబించే నాటకాలనుగానీ సినిమాలనుగానీ అనేక సెన్సార్లకు గురి చేస్తున్నదనీ శ్రీ లింగమూర్తిగారన్నారు. మన కళాభివృద్ధిని అరికట్టే విధానంమాని, ప్రభుత్వం, ప్రజలతోపాటు, కళకు ప్రోత్సాహమూ సహాయమూ ఇవ్వాలని కోరారు.

మహాసభాధ్యక్షులు, మద్రాసు ఆర్థిక శాఖా మంత్రి, శ్రీ బెజవాడ గోపాలరెడ్డి గారు తమప్రభుత్వం కళాభివృద్ధికి తప్పక దోహదం చేస్తుందని హామీ ఇచ్చారు. 'రాఘువ కీర్తిమందిర' నిర్మాణానికి గాను, స్థానికసంస్థల మంత్రితోను బెజవాడ మునిసిపాలిటీతోను ఆలోచించి, ధన సహాయం జరిగేలాగా చూస్తానని కూడా వాగ్దానం చేసారు. కాని, సాధారణంగా అధికారులకు అలవాటైన ధోరణిలో 'మనకు మంచి నాటకాలే రావటం లే'దనీ, 'మనకు మంచి నటులే లే'రనీ కొన్ని ఆరోపణలు చేసారు. ఇలాంటి ఆరోపణలు ఎన్ని హామీలనైనా కాపాడగల ఆయుధాలుగా మాత్రమే ఉపయోగిస్తాయి. ఎన్ని మంచి నాటకాలు నిషేధాజ్ఞల క్రింద నలిగిపోలేదు? ఎందరు మంచి నటులు ప్రోత్సాహం లేక అణగారి పోలేదు?

కాని, రాజకీయవాదిగానే కాక సాహితీ పరుడుగా కూడా కళారంగంలో అడుగు పెట్టిన శ్రీ గోపాలరెడ్డిగారు తమ ఆరోపణలను ప్రభుత్వంవారి సహాయనిరాకరణానికి కారణాలుగా ఉపయోగించరని నమ్మవచ్చు. ఆయన చెప్పినట్లు, ప్రభుత్వం మన కళాభ్యుదయానికి తోడ్పడుతుందనీ, ఇకనుంచీ మన కళారంగంలో నిషేధ నిర్బంధాలపరిపాలన అంతరిస్తుందనీఆశించవచ్చు.

అయితే, సభకు వచ్చిన పెద్దలూ పిన్నలూ ఇలా తమతమ అభిప్రాయాలు వెల్లడించడం జరిగిందే కాని, వీటినుంచి పరిపత్తు తీసుకున్న ఒక భవిష్యత్ కార్యక్రమ మంటూ లేదు—ఒక్క రాఘువకీర్తి మందిర నిర్మాణం మినహా. కొత్తగా మన నాటకరంగంలో ప్రవేశిస్తున్న యువనటీనటులను ప్రోత్సహించి, నిర్మాణయుతంగా, ముందుకు తీసుకుపోవడానికిగానీ; మన నాటకరంగానికే నూతన చైతన్యం సమకూరుస్తున్న అభ్యుదయ నాటక సాహిత్యాన్ని పెంపొందింప చేయడానికిగానీ పరిపత్తుకు కార్యక్రమం లేదు.

(మిగతా 78 వ పేజీలో)

★ గాంధీజీ ★

శ్రీ జాస్తి సీతారాందాస్

★

భరతపితా ! పరమపూజ్యా !
దీనుల యాశాస్వరూప !
క్షుభితజగతి శాంతిదాత !
జోహార్లివిగో !'

శరణార్థుల రక్షణలో
ప్రజాశాంతి స్థాపనలో
నిమగ్నులై యున్నయపుడు
ఒకమూఢుని దుష్టచేష్ట
హఠాత్స్వప్న ప్రాయంగా
మీభౌతిక శరీరాన్ని
ఇక లేదనిపించిందా
బలిదానం పొందిందా
గాంధీజీ !

శరీరంబె లేదుగాని
మరువలేము మరచిపోము
మీరిచ్చిన సందేశం
వెలిగించిన దివ్యజ్యోతి
ఎప్పటికీ మర్చిపోము!

ఏసుక్రీస్తు మహామహుని
ఎవరెవరో దుర్మార్గులు
అతని వాక్కు లాపాలని
శిలువవేసి హింసించిరి!
ఏసుక్రీస్తు లేడుగాని
చచ్చిపోదు సందేశం !

ఏ ఆశయ సిద్ధికొరకు
ఏ జీవన లక్ష్యాలకు
మీపావన జీవితాన్ని
చిరమంకిత మిచ్చారో
ఆ జీవన లక్ష్యాలకు
ఆయాశయ సిద్ధులకై
మేమూ కృషిచేస్తాం !
మీఅడుగుల ఒరవడిలో
వెనువెంటనె వస్తున్నాం !

ఎందుకో తెలుసా?

ట్రీ కొడవటిగంటి కుటుంబరావు

★

నన్ను మాయమ్మ ఎందుకు కొట్టేదో తెలుసా? ఆవిడకు నామీద ప్రేమ లేదనుకున్నావా? ఒకసారి నన్నావిడ కొడుతుంటే ఎవరో చూచి, "ఏమమ్మా, నువ్వు పశువ్వా, గొడ్డువా? చిన్న వెధవను పట్టుకు అట్లా కొడతావు?" అని అడిగారులే. నువ్వుకూడా ఆవిణ్ణి పశువనిగాని, గొడ్డనిగాని అనుకున్నావా? పొరపాటు.

నన్ను కొట్టినప్పుడల్లా మాఅమ్మ అంతరాత్మలో ఎంత బాధపడేదో నీకు తెలుసా? పైకి మామూలు మొహంపెట్టి గుండెలు వెక్కి-వెక్కి ఏడవొచ్చు తెలుసా? నీకు తెలీదు. తన కన్న కొడుకుని ఎవరూ చూడనిసమయంలో కూడా గట్టిగా కౌగలించుకునే ధైర్యం లేక పోవడం ఎంత బాధాకరమో నీకు తెలుసా? నువ్వు నిద్రపోతున్నావనే నమ్మకంతో ఒక్క-సారి ముద్దు పెట్టుకుందామని మొహం దగ్గిరికి తెచ్చి, తీరా ఇంకో అంగుళంలో నీ చెంప ఉందనగా—ఆవిడ ఊపిరి నీ చెంపమీద తగిలికూడా — బిడియం కొద్దీ మొహం వెనక్కి తీసుకునే మనిషి అంతరాత్మ, పంజరంలో పక్షిమాదిరిగా, ఎట్లా కొట్టుకుంటుందో నీకు తెలుసా?

నువ్వు ఏ చదువూ సంధ్యా లేని ఆడదానవై వుండి, సంఘంలో అమలులో ఉన్న ఆచారాలు హేయమైనవనే జ్ఞానం నీలో ఉండి, వాటిని ప్రతిఘటించే సంస్కారం లేక పోతే ఏం చేస్తావు?

నీ కొడుకు తెలివిగలవాడనీ, తెలివికితోడు. సాహసం కూడా ఉంటే సమాజం ఆదరించని ప్రవర్తనలో పడతాడనీ భయం ఉంటే ఏం చేస్తావు?

నీ కొడుకును కొట్టకపోతే నీకు పిల్లల్ని పెంచే పద్ధతి చాత

కాదనీ, నువ్వు నీ పిల్లాణ్ణి పాడు చేస్తున్నావనీ, నలుగురూ అంటూ రనే అభిమానం ఉంటే ఏంచేస్తావు?

నీ జీవితంమీద నీకు కాస్త యినా అధికారం లేదనుకో. ముప్పైఏళ్ళ నీ జీవితంలో ఒక్క స్వల్ప విషయమైనా నీ కనుకూలంగా — నీ కలలు నిజమైనట్టుగా — జరగ లేదనుకో. నీలో కలలుకనే శక్తికూడా పూర్తిగా ఇంకిపోయిందనుకో, నీ కలలు మరొకరికి చెప్పుకోవడంకూడా సంఘద్రోహమేనని నీకు రూఢి అయిందనుకో, ఏంచేస్తావో చెప్ప గలవా ? చెప్పలేవు. నీకు తెలీదు.

నీకు వస్తుతహా తెలివి తేటలు లేకపోయినా, వాళ్ళూ వీళ్ళూ చదువుకుని చెప్పే మాటలు విన్నావు. వింటే ఏమయింది ?

వేదాంతులు వేదాంతం చెప్పారు. కష్టసుఖాలు కర్మను బట్టి కలుగుతాయన్నారు; ఇహం శాశ్వతం కాదు, పరమేచూసుకో మన్నారు; ద్వంద్వాలకుఅతీతంగా ఉండ మన్నారు. ఈ ప్రపంచం మొహం చూసి చెప్పూ-ఇది ఈ విశాలమీదనే నడుస్తున్నదా?

నీతివేత్తలు నీతి చెబుతారు. పిపీలికాది బ్రహ్మ పర్యంతమూ బ్రహ్మపదార్థమేననీ, తేడాలు లేవనీ, అందర్నీ సమంగా చూడమనీ, అబద్ధాలాడవద్దనీ, ఒకరి సొమ్ముకు ఆశపడవద్దనీ, ఇంకొకరి కష్టాలు నీ కష్టాలుగా చూడమనీ అంటారు. అట్లా ప్రవర్తించేవాళ్లకి ఏది గతి ?

డబ్బు తుచ్ఛమైనదని చెప్పటం ఎంతసులభం ? డబ్బు లేకుండా ఒక్కపూట గడపటం ఎంతకష్టం ? ఎన్నడైనా తిండికి మాడావా ? నీకున్న శరీరకష్టమంతా మంచినీళ్ల కింద పారబోసినా నీ అవసరాలు సహంకూడా తీరకపోతే ఎట్లా ఉంటుందో నీకు తెలుసా ? వేలకు వేలు చేసుకునేవాళ్లు లక్షలు చేసుకోవటానికి పడేపాట్లు గురించిన నిరసన ఎప్పుడైనా వెలిబుచ్చావా? తిండికి లేనివాళ్లను గురించి ఎన్నడైనా ఒక్క మంచి మాట అన్నావా ? దరిద్రపుజన్మ అంటే ఏమిటో నీకు తెలుసా ? అందులో

ఆడబతుకెట్టాంటిదో ఆలోచించావా? ఆలోచించే టందుకు నీకు తీరలేదు.

ఈ కష్టజీవుల్ని గురించి నీకు ఆలోచించే శక్తిలేదు. నువ్వు చెప్పే నియమాలలో వాళ్లని ఉండమంటావు. నీ మాటవింటే వాళ్లు బాగుబడే పూచీయిస్తావా? లేక వాళ్లు నీ నీతిప్రకారం నడిచి బాగుపడలేరనీ, వాళ్లయిష్టం వచ్చిన నీతి వాళ్లు అవలంబించుకుంటారనీ సమాధానపడి తొలగిపోతావా? ఏదీచెయ్యవు. అర్చలేవు, తీర్చలేవు, చూస్తూ ఊరుకోలేవు.

నాకు తెలుసు, నీవన్నీ సదుద్దేశాలే. అందుచేత ఒకపని చెయ్యి: నువ్వు ప్రపంచాన్ని మార్చు-ఎట్లా మార్చుతావో నాకు తెలీదు! మాఅమ్మలాటివాళ్లు న్యాయమైన కలలు కనే అవకాశం కల్పించు. ప్రపంచం ఆవిడవాటి మనుష్యుల సహజ ప్రేరణల కనుకూలంగా మారుతుందనే విశ్వాసం కల్గించు. ప్రేమంటే ఆవిడ కర్థమయేటట్టు చెయ్యి. తనప్రేమ ప్రకటించుకునే శక్తి ఆవిడకియ్యి. సంఘాన్ని చూసి ఆవిడ బెదిరి పోకుండాచెయ్యి. జన్మఎత్తినఫలం మనో వాక్కాయాలా ఉల్లాసం ప్రకటించటమే నని ఆవిడకి తెలియజెప్పు. ఆవిడకి, పాపం, జన్మఎత్తటం చేసినపాపానికి శిక్ష అనుభవించడానికేననీ, అన్నికోరికలూ చంపుకోటానికేననీ, తనకు నిలవ నీడలేని సాంఘిక వ్యవస్థలో తన కాళ్లమీాద తానే నిలబడాలిగాని గత్యంతరం లేదనీ, బతికి ఉండటమే ఒక విషమ పరీక్ష అనీ, అవసరాలు తగ్గించుకుని, ఇంకా తగ్గించుకుని, కాస్తూ అర్థణాలూ "రేపటి"కోసం దాచుకోవటమే రేపనేది లేకుండా పొయ్యేదాకా కార్యక్రమమనీ ఆవిడ అనుకుంటున్నది. ఇదంతా ఆవిడ పుస్తకాల్లో చదివిందికాదు— నీవంటివాళ్లు రాసేపుస్తకాల్లో ఈవిషయాలెందుకుంటై?— అనుభవంవల్ల కట్టినబొప్పెలద్వారా నేర్చుకుంది.

ఇదంతా మార్చటం ఎట్లాగో నీకు తెలుసా? నీకు తెలీదు: నేను చెబుతాపట్టు.........

మహాత్ముని మరణం!

శ్రీ కుందుర్తి ఆంజనేయులు

1

ఇది మా గుండెలు కోసిందొక
విషాద కర వార్త!
మహాత్ముడిక మనకు లేడు!
మనకు మార్గదర్శి లేడు!!
జగతు విజ్ఞానంలో
సగం నేటితో నశించింది.
లోకోన్నత హిమశిఖరం
ధరణికి తలవాల్చింది!
శీలంతో దయతో లోకం
పాలించిన మహాశక్తి!
సత్యాహింసల గానంతో
కొండలు
కరిగించిన మహామూర్తి!
మహాత్ముడిక మనకు లేడు,
మనకు మార్గదర్శి లేడు.

2

అన్న చావువిని తమ్ములు
నిశ్చేష్ట ప్రతిమలైరి-
తండ్రి మరణవార్తనువిని
తనయులు కన్నులు కార్చిరి,
పితామహుడి మృతి విని మా
పసిపాపలు కెవ్వుమనిరి-
నీవుజాతికి - కాదుకాదు
ఈజగతికి సోదరుడవు
కన్నతండ్రివి, పితామహుడవు!
గౌరీ శంకరశిఖరం
కరిగి యేరుగాపారింది!
గంగానది శోకబాష్పములు
కాల్వలు కట్టింది!
తాజమహల్ హృదిగోళంలో
తమస్సు తెరవెలిసింది!
నీవు వాటికి సహోదరుడవు
వాటి కీర్తికి సహోదరుడవు

3

ఎవడో నీ కొక శత్రువు!
అజాతశత్రువు కొకశత్రువు!!
నీకు కాదు శత్రువు వాడు
లోకానికి శత్రువు!
నీవు వీరస్వర్గం పొందను
నిమిత్త మాత్రపు శత్రువు!
నీకు ద్రోహి, నాకు ద్రోహి
లోకానికి ద్రోహి వాడు!

మతం పిచ్చిలో దేశప్రతిష్ఠ
మట్టి పాలుచేసిన ద్రోహి.
తానేం చేస్తున్నాడో
ఎందుకు చేస్తున్నాడో
ముందు వెనుక లెరుగని ఒక
మూర్ఖ మతావేశపరుడు !
నీ కెవడో ఒక శత్రువు
లోకానికి శత్రువు!
అజాత శత్రువు కొక శత్రువు !!

4

నథూరాం వినాయక్ గోడ్సే !
నిన్నే మని పంలాభం ?
మతావేశమతి భ్రమణంలో
మహారాష్ట్రానికి మచ్చవు !
మా కందరికీ నీపై కోపం !
మహాత్మునికి నీమీద ప్రేమ !!
నథూరాం వినాయక్ గోడ్సే !
జూడస్ యిస్కారియట్
లాగుంది నీ పేరు.

5

మనదేశం పరదేశాల్లో
మహాత్ముడి దేశమైంది.
నీచరిత్ర మాచరిత్ర
ఈ శతాబ్ద కాలంలో
సత్యాహింసల విజయ
చరిత్ర ! నీ చరిత్ర !
మారణాయుధాలు లేక
మాయలు పన్నింది లేక
సకలకుటిల సమన్వితము
బలిష్టమౌ సామ్రాజ్యము
ఎదురొన్న సత్యవీర!
అర వెయేండ్ల మాకల
నిజమైె, జాతికి ముక్తి
సమకూర్చిన సాధు శీలుడు

మనుజకోటి కొకబంధువు
మనకు గురువు, మార్గదర్శి
మనలను విడనాడి చనిన
మహాత్మునికి శాంతి ! శాంతి ! !

నా దేశంలో —

★ శ్రీ పల్లా రామకోటయ్య

★

చనుబాలిడి దయసాకిన తల్లిని
ప్రేమమీరగా పెంచిన తండ్రిని
పాపమెరుంగని పసిపాపలను
బలిగొను నంతటి పరమ నీచులు— ఉన్నారా !
నా దేశములో ఉన్నారా ! !
ఉన్నారని నే ననుకోలేదే !

సర్వమానవుల సౌఖ్యము కొరకై
దేశసేవయే దీక్షగ బూనిన
అజాత శత్రుం డైన మహాత్ముని
అసువులు బలిగొను నట్టి రక్కసులు— ఉన్నారా !
నా దేశములో ఉన్నారా ! !
ఉన్నారని నే ననుకోలేదే !

సత్య, అహింసల జన్మభూమియని
పేరుగన్న బంగారు గడ్డలో
సాధువు, వృద్ధుడు, సంయమి యగు శ్రీ
గాంధి మహాత్ముని గాల్చు హంతకులు— ఉన్నారా !
నా దేశములో ఉన్నారా ! !
ఉన్నారని నే ననుకోలేదే !

★ ప్రియ బాపూజీ! ★

శ్రీ గిడుతూరి సూర్యం

ఓ ప్రియ బాపూజీ!
ఓ యుగ పురుషా!
మరపు రావోయి, నీ
మహా త్యాగాలు
మరపు రావోయీ!

బానిసత్వంలో
మగ్గిమగ్గి అలమటించిన
భారతదేశ స్వాతంత్ర్యం కొరకు
ఎన్నెన్ని ఉద్యమాలు,
ఎన్నెన్ని కఠోర
ఉపవాస దీక్షలు,
ఎన్నెన్ని కారాగృహ
ప్రాయోప వేశాలు
చేశావో —

చరిత్ర ఎరుగని
శాంతి సమరంతో
తెచ్చావు
పతిత జాతికి స్వేచ్ఛ,

ఇచ్చావు స్వరాజ్యసంపద
ప్రగతికి నడిచే
ఓ అనంత కాలా కృతీ!
వీడి పోయావా,
మానావ నట్టేట
విడిచి పోయావా ?

నీ వొసగిన
నవ భారతం
నీరు లేని మొక్కలా
వాడి పోతోందోయ్,
పరితపించి పోతోంది!
ఇంకెక్కడి బాపూజీ!
ఇంకెక్కడి
ఆ అమూల్య సందేశాలు!

ఈ భారతావనినే
భయంకర నిశీధంలో వదలి
ఓ రవీ! అస్తమించావా!

జ్యోతులు వెలిగించండి!

శ్రీ అనిశెట్టి సుబ్బారావు

★ ★ ★

నేను తాగిలేను, గుడ్డివాణ్ణి కాదు, అదేనాకు చిక్కు. ఉన్న వున్నట్లు స్పష్టంగా కన్పిస్తాయి, విన్పిస్తాయి. అధర్మం, అన్యాయం పట్టాభిషిక్తులై ధర్మ పన్నాలు పలుకుతున్నాయి. నా కవి విన బడవే! ఆశ్చర్యం. అట్టడుగున, పీఠంకింద మూల్గుతున్న కపాలాల నోళ్లు కక్కుతున్న అగ్నిజ్వాలలు కన్పిస్తున్నాయి. సభలలో, సన్మా నాలలో భూషణ వస్త్రాలంకృతులై నిలిచి సగర్వంగా సందేశాలిచ్చే మహామహుల రూపాలు కన్పిం చవే! ఆశ్చర్యం. రూపాలలోపలి గుండెల్లో కాపురమున్న పంజాలు, పడగలు విప్పిన లేచి నిద్రాముద్రి తమైన లోకంమీదికి ఎగసిపడే గర్జనలు విన్పిస్తున్నాయి.

జీవయాత్ర సాగించే సాధా రణులకు సముద్రగర్భంలో ఈదే తిమింగిలాలుకనబడవు. ఆకాశమవ తల బహుళశా రాజ్యంచేసే భగ వంతుణ్ణి ధ్యానం చేసేవారికి ఆదివ్య మంగళవిగ్రహం, నృత్యఖేలనం, సంగీతం విన్పిస్తాయి. నేను రెండూ కాదు.

సమాజ సముద్ర మడుగున తిరిగే తిమింగిలాలు, పగిలే అగ్ని పర్వతాలు కన్పిస్తున్నాయి నాకు. శూన్యంలో గోళాలు పరి భ్రమిస్తూ ఎప్పుడో భూమిని ఢీకొని పగల గొట్టాలని పన్నుతున్న కుట్రలు కన్పిస్తున్నాయి. నాకు భయంగావుంది.

*

భూమి — పశ్చిమాన్నుంచి తూర్పుకు; కాలం — గతంనుంచి భవిష్యత్తులోకి: ప్రయాణం చేస్తు న్నాను. నడిచి నడిచి తూర్పున ఒక ప్రాంతానికి వచ్చాను. గతం నుంచి ప్రస్తుతంలోకి వచ్చాను. అడుగులు తడబడుతున్నాయి

కళ్ళలో చీకటి పేరుకుంటున్నది. ఆగాను.

విద్యుద్దీపాలున్నాయి. కాని, కనబడటంలేదు. వినపడటంలేదు, వీనులున్నాయి. కాని ఇదెక్కడి రాజ్యం ?!

యాత్రామధ్యంలో ఎన్నెన్ని దేశాలు, కాలాలు చూచానో! కొన్ని చోట్ల బానిసలపునుకల గల గలలు విన్పించాయి. రాజుల వైభవ కాంతులు కన్పించాయి. భూస్వామి రం కెలువిన్పించాయి. మరచక్రాల కసాయినృత్యం కన్పించింది. కాని- కాని-ఇది చీకటిరాజ్యం. ఎక్కడా ఎన్నడూ లేని వైపరీత్యం. ఈ చీకటే పురిటిపాపల గొంతు నులుము తోంది. వృద్ధులపై గోరీలు కప్పు తోంది. నరుల గుండెల్లో వెలిగే జ్యోతుల్నే నేలరాచి మసిచేస్తోంది. ఏమివింత !

నా జ్యోతి వెలుగుతూనేవుంది రహస్యంగా. చీకటిని కొద్దిగాచీల్చి చూచాను.

"స్వాగతం. సుస్వాగతం. పవిత్రభారతభూమి, ఋషులు తీర్చిన బాటలో ప్రపంచదేశాలకు ప్రథమశ్రేణిలో నిలిచి మిమ్మాహ్వానిస్తున్నది. హిమాలయోన్నత శిఖరాలు, సముద్రాంతర తీరాలు మా కెల్లలు. స్వాగతం !"

తెల్లని గోడకంటించిన ఈ పోష్టరు సగం చిరిగి వేళ్లాడుతోంది.

ఐతే, రేడియోల్లో ఈస్వాగత వాక్యాలు వినబడుతూనే వున్నాయి. కాని, చుట్టూచీకటి రాజ్యం నిరాఘాటంగా సాగుతునే వుంది.

... ...

త్రోవనే నడుస్తున్నాను. గుండె లోపుండే జ్యోతిని జాగ్రతగా దాచుకుంటూ పల్లెవంకకు వెడు తున్నాను. డొంక. గట్లు. గట్ల మధ్య పొలాలు. పొలాలలో మంచెలు. మంచెలమీద వేళ్లకు వొడిసెల తగిలించుకొని కాపలా వాళ్లు సిద్ధంగా వున్నారు. కాపలా ఎందుకు ? మెల్లగా కాపలా మని షిని పిలిచాను. అడిగాను.

నవ్వాడు. వెక్కిరిస్తూనవ్వాడు. ఈన్యాయం తెలియనివాణ్ణి అనాగరికుణ్ణి, జంతువుని అనుకొని వుంటాడు.

అనాదినాడే ఒక్కొక్క రైతూ ఈ భూమిని ముక్కలుగా కోసుకున్నారు. ఈగడ్డ మీద పంటతో అతను బ్రతుకుతాడు. మరొక గడ్డలోకిఅతను ప్రవేశి స్తేఊరుకోరు.

ఏం చేస్తారు ?

పోలీసు లొచ్చి ఈడ్చుకు పోతారు. ఖైదులో తోస్తారు.

ఐతే, ఆ నేలంతా కనుచూపు మేరవరకూ గట్లులేకుండా వుందే ?

అది జమీందారుది.

వీళ్లందరికీ చేరెడేసి ముక్కలు, అతనికి ఓ, అంతపెద్దదా? వాళ్లంతా ఏంచేస్తున్నారు ?

పొలంపని. దున్నుతారు, వి త నం వేస్తారు, నీరుపోస్తారు, పండి స్తారు.

వాళ్లు దులుపుకుంటున్నారేం?

వెళ్లే సమయమయింది. మళ్లీ గింజలు పట్టుకుపోతే ఊరుకోరు. రోజు కూలిమాత్రం తీసుకోవాలి.

జమీందా రేంచేస్తాడు ? వీళ్లే పంటంతా కోసుకుపోతే ?

జమీందారు డబ్బు లెక్క చూసుకుంటాడు. తానేదారు మని ఆర్డరు కడతాడు. అతనిక్కడుండడు. రైతు గింజలు తీసుకుపోతే పోలీసు లొస్తారు.

వచ్చి ?

వచ్చికాల్చుతారు. తుపాకులు, తూటాలు. కాపలాదారు తిరిగి వెళ్లాడు. బానిసలువందలు, వేలుగా ముందుకునడచి పోతున్నారు.

వాళ్లవెంట నేనూ వెళ్లాను. అందులో వాళ్లు తమ ఆ ప్రబంధు వుల్ని గురించిగామాలు మాట్లాడు కుంటున్నారు.

"నిరుడు కరువొచ్చి వంద మందిని తీసుకుపోయింది. ఈయేడు కలరావచ్చి యాభైమందిని తీసుకు పోయింది. సోలెడుగూడ మిగలా ఇవ్వనంటున్నాడు తాణేదారు."

"అనుకున్నదానికి సోలెడు గూడ మిగులివ్వకపోతే చూద్దాం తడాఖా."

"తాతల నాటినుంచి ఇట్లాగే వుంది. తరతరాలనుంచీ ఇట్లాగే వుంది.ఎవడికోసమిస్తాడో చూద్దాం. అసలీభూముల్ని మనంపండించాం. మనం బ్రతకాలి!"

ఈ మూడో వ్యక్తి గుండెలో రహస్యంగా జ్యోతి ఒకటి వెలుగు

తోంది. వాళ్ళందరినీ రచ్చబండ దగ్గర ఆగమన్నాడు. కూర్చు న్నారు. తీవ్రంగా చూస్తున్నారు. ఇంటికెందు కెళ్ళలేదా వీళ్ళంతానని నేను వెళ్ళి శోధించాను. ఇళ్ళల్లో పొయిలు లేవు. పొట్టుగూడ లేదు. అందుకని రచ్చబండ దగ్గర కూచు న్నారు.

నేను తిరిగి వచ్చేసరికి అతను జ్యోతిని ధగధగా వెలుగనిస్తు న్నాడు. చీకటి చిట్లి, వందల వద నాలు జేవురుగా మారాయి. వందల పిడికిళ్ళు ఊపిరితో ఉత్సా హంతో బిగుసుకున్నాయి. వాళ్ళు నిలబడ్డారు. నినాదాలిచ్చారు. నిప్పులు కురిపిస్తున్నారు. నడుస్తు న్నారు. పొలాలవంకకు నడుస్తు న్నారు.

గట్లు చీల్చుతారట. కట్టలు కోస్తారట. పొలాలన్నీ కలిపి, పంట సిరినృత్యం సాగిస్తారట. జ్యోతులు అన్నీ వందల, వేల గుండెల్లో బాహాటంగా వెలుగుతున్నాయి. చీకటి పొదల్లోకి, గుహల్లోకిపోయి. దాక్కుంటున్నది.

ముందుకు నడుస్తున్నాను. చీకటి దేవతకు చీటీఅందిందేమో "టక్ టక్ "మంటూ బూట్లునామనుం నుగా పల్లెవేపు వెళుతున్నాయి తుపాకులు సన్నీలు లారీలలో నడుస్తున్నాయి. చీకటి దేవత తన అధికారం, అహంకారం నిలబెట్టు కోను దాడి వెడలింది.

నా జ్యోతిని రెండు చేతులతో కౌగిలించిదాచుకున్నాను. కన్నుల నుండి కిరణాలు ప్రసరిస్తాయని, పసిబడతారని కిందికి దించు కున్నాను. పెదవులు కుట్టివేశాను. చెట్టూపుట్టా దాటి వెళుతున్నాను.

కాలం దీనకంఠంతో అస్ప ష్టంగా పాడుతూ నాతో నేనడు స్తోంది. భూమిగారవర్ణంగా జాలిగా శోకం వెళ్ళబోసుకుంటూ పులకిస్తోంది. నడిచాను.

... ...

ఇక్కడ విద్యుద్దీపాలు పగలు గూడ వెలుగుతున్నాయి. జీవిత మాధుర్యాన్ని గూర్చి ఉపన్యా సాలుసాగుతున్నాయి. ఇదిపట్నం! పట్నవాసులంతా వీధుల్లోకివచ్చి ఒకరి వంక ఒకరుచూడకుండా ఎదురుపడుతూ తప్పుకుంటూ వెద

రిన గుంపులాగ ఎక్కడెక్కడికో వెడుతున్నారు. అది రైల్వేలట. వెళ్లాను. దాన్ని మూడు తరగ తులుగా విభజించారు. ఎందుకు? వెళ్లి చూచాను, ఆశ్చర్యం. అన్ని తరగతుల్లోను ప్రయాణీకులకు రెండేకళ్లు రెండే కాళ్లువున్నాయి. మరి తరగతులెందుకు? సినిమా లోకి వెళ్ళాను. అక్కడా అంతే. పుట్టు గుడ్డివాడికి లోకం చూడలే ననే దిగులేలేదు! అలాగే యీ మనుష్యులకు విపరీతం ఏమీ కన బడడం లేదు!

ఎంత ఘోరమైనా వూహించు కో! అది లోకంలో జరగడానికి అవకాశం వుంది. వీళ్ల గుండెల్లో జ్యోతులు వయస్సుహెచ్చిన కొద్దీ ఆరి కొడిగట్టాయి. కిందతరగతిని పైతరగతి పలకరించదు. ప్రతిష్ఠ! మరి. పై తరగతిని కిందితరగతి దిగలాగదు. కర్మ! మరి. భయం! మరి.

పట్నంలో ఒకవంక పెద్ద భవ నంలో ధీరోదారులు కొందరు సమావేశమైనారు. నోళ్లూ, కళ్లూ లేని ఈ మూఢప్రజల్ని పాలిం చటం వారి విధిగా ధర్మంగా ఊహించు కున్నారు. ఉన్న తరగ తుల్ని ఎలా నిలబెట్టాలో, చీకటి రాజ్యాన్ని ఎలా శాశ్వతం చెయ్యాలో, జ్యోతులు వెలిగించే వారికి ఏయే శిక్షా స్మృతులు నిర్మించాలో తీర్మానిస్తున్నారు.

కొన్ని వేల తుపాకులు, కొన్ని వేల మందులు తయారుచేయిస్తు న్నారు. కొన్ని కొత్తభవనాలు, కొన్ని కొత్తఖైదులు నిర్మించమ న్నారు. భూప్రదేశం గిరులు గీసి ఒకాయనకిచ్చారు. మిగిలినవాళ్లను వచ్చి ఆనకట్టలు కట్టమన్నారు. భూమిని పండించమన్నారు.

నేనుచూచి వచ్చిన పల్లెనుంచి పంటంతా రైలెక్కి వస్తున్నది. రైలుతోవ పక్క గ్రామాల్లో ప్రజలు తిండిలేక కుళ్లిపోతున్నారు.

ఇదేవిపరీతం!

పంటంతా పట్నంలో దిగింది. బండ్లమీద ఒక విశాలమైన యంత్రాగారంలో ప్రవేశించింది. ద్వారంవద్ద వేలకొలది వ్యక్తులు నిలబడ్డారు. మోకాళ్లవరకు పంచెలు, మోచేతులవరకు

చొక్కాలు, చేతుల గిన్నెల్లో జొన్న సంకటి. పనిలోకి చేర్చుకో మని ప్రాధేయపడుతున్నారు. పని లేదంటున్నారు.

అనుకున్నాను: పని లేదంటే ఏం ? హాయిగా ఇంటికివెళ్లిపడుకో రాదా! తర్వాత తెలుసుకున్నాను గదా ! పని లేనివాళ్లకు తిండిలే దని ప్రభుత్వం శాసించిందట! ఐతే? పనిమాత్రం లేదు.

ఇదే విపరీతం !

ఈ లక్షలాది ప్రజల గుండెల్లో జ్యోతులులేవు. జీవంచచ్చిన ఈ జాతికి జీవితమే ఒక దుస్వప్నం లాంటిది. పనిచేసిన వాళ్లంతా ఈ నిర్జీవ యంత్రానికి ఆహుతౌతు న్నారు. ఈ క్రూరయంత్రమే ఎవ రినో, ఎక్కడో వున్నవాణ్ణి పోషి స్తోంది. ఈ మనుష్యులు దిక్కులేక శిశువుల్లాగు ఏడుస్తున్నారు. చైతన్య జ్వాలతోవారిపైవిరుచుకు పడరు !

ఇదే విపరీతం !

'వెలిగించాలి, వెలిగించాలి, వెలిగించాలి' గుంపులలో కొందరు యువకుల గుండెలు ఇలాఘూర్ణిల్లుతు కుంటున్నాయి. ఆ గుండెల్లో జ్యోతులు ధగధగా వెలుగుతు న్నాయి. ఆ కాంతిలో వాళ్లకు త్రోవ కనపడుతోంది. మెల్లగా స్పష్టంగా పలకడంప్రారంభించారు.

"తిండి! తిండి ! భవనాల్లోపంట వుంది. మనకు ఆకలౌతోంది· అది తీసుకుందాం. యంత్రాగారంలో మనమేగదా పనిచేస్తోంది, దీని ద్వారం మీద 'శేట్' పేరు వ్రాశారేం ! ! పత్రికలు, రేడి యోల ద్వారా పాలకుల వాక్కులు మనల్ని మోసం చేస్తు న్నాయి."

గుంపులు దించిన తలలెత్తాయి. యంత్రశాల కూతపెట్టింది. ఎవ్వరూ కదల్లేదు. గుంపులు యోచిస్తు న్నాయి. వ్యక్తుల నరాలు విహ్వ లించి కొత్త జీవంతో కంపిస్తు న్నాయి.

"మనం పుట్టాం భూమిమీద, ఈ భూమిమీదే మనం బ్రతకాలి. మనం పండించుకుంటాం, మనం తింటాం. వీళ్ళెవరు నీతులు చెప్పేం దుకు ! వెలిగించుకోండి. ఇవిగో మా జ్యోతులు. కదలండి"

ఒక్కటొక్కటే గుండెలు వెలిగాయి. గుంపంతా ఒక దివ్యజ్యోతిలా ప్రజ్వరిల్లి నాకళ్ళు మిరుమిట్లు గొల్పుతోంది. నేనూ వెంట నడిచాను. గుంపు నడదివ్వెలుగా కదులుతోంది.

గుంపు కంఠమెత్తింది. పాడుతోంది. పాలకుల బ్రతుకులకు తుదిగీతం పాడుతోంది. కాఠిన్యం పగిలిందేమో, కాలం తెల్లవారుతోంది. నిద్రమత్తు విడిందేమో, భూమి పులకరిస్తోంది. గుంపునడిచే అడుగులతో భూమి 'దడ దడ దడ' మోగుతోంది.

చుట్టుపక్కల దాగిన చీకటి సైన్యం దగ్గరగా వస్తోంది. మెల్లగా నిశ్శబ్దంగా, చుట్టూ కమ్ముతోంది. రేడియో గొంతుకతో చీకటిదేవత కేక వేసింది. చీకటిసైన్యం జ్యోతిని బంధిస్తోంది. గుండెలతో పోరుస్తోంది. గుంపుకళ్లు చుక్కల్లాగ తళతళ లాడుతున్నాయి. బాష్ప వాయువు చుట్టలు చుట్టలుగా లేచి కన్నులపై కెగబడింది. పత్రికలు చీకటి సైన్యాన్ని హర్షించాయి. చెయ్యమన్నాయి. "జ్యోతులు వెలిగితే ఇదేచిక్కు. కనపడ కూడనివి కనపడతాయి. వినపడకూడనివి వినపడతాయి. మూర్ఖ ప్రజలు తప్పుదారి తొక్కుతారు. చీకటి దేవతజ్యోతులగుండెల్ని చీల్చాలి."

ఒకటొకటిగా గుండెలు బ్రద్దలై జ్యోతు లారుతున్నాయి. సైన్యం జ్యోతులు రగిల్చిన యువకుల కోసం వేటాడుతోంది. నాడాల కింద, చక్రాలకింద చితికిన కళ్లు, ఎముకలు ప్రాణ శకలాలుగా మూలుగుతున్నాయి. నెత్తురు మెల్లగా నేలమీద పాకుతోంది. సంగీతం పాడుతోంది. తనజీవితం పూర్తి కాకముందే భూమి తల్లి వొడిలోకి పంపుతున్నందుకు చీకటిశక్తుల్ని శపిస్తోంది. పారిపోయే జ్యోతుల్ని తుపాకు లార్పుతున్నాయి.

ఒక్క కేక. ఒక్క మూలుగు. ఒక్క శాపం. ఇలాగ కాలం రోదిస్తోంది. భూమి వొళ్లు గాయాలతో, పోట్లతో జ్వరంకాచి మూర్ఛ పడింది.

... ...

నాజ్యోతిని శరీరమంతటా ప్రసరింపజేశాను. ధగధగ లాడుతు

న్నాను. కాని, తుపాకీలు సన్నీలు చూచి మళ్ళీగుండెలో రహస్యంగా ఇముడ్చుకున్నాను. కళ్ళుపాలిపోయి వేళ్ళు వొణుకుతూ చిన్ని దీపాన్ని జాగ్రతగా రక్షిస్తున్నాయి. చీకటి దేవతకు ఇంకా నా వాసన వెయ్యలేదేమో—తారాడుతూ తిరుగుతున్నాను.

పల్లె నుంచి, పట్నం నుంచి మళ్ళీ ఒక దట్టమైన చీకటి తెర భూమిమీద వాలింది. కాలం ప్రస్తుతంలోనే నిలిచింది.

జ్యోతులు వెలిగించిన వాళ్ళందరినీ వేటాడి, పట్టితీసుకు పోతున్నారు. రోడ్లు గట్లు దాటి నేనూ వెంబడిస్తున్నాను. వాళ్ళ గుండెల్లో కాంతిని ఎక్కడ దాచుకున్నారో గాని, నిటారుగా నడుస్తున్నారు. వెనుక నుంచి రెండు వెకిలి నవ్వులు విన్పిస్తున్నాయి. యంత్రశాల ద్వారం మీది పేరు, తాణేదారు చిట్టా మీది పేరు నవ్వుతున్నాయి. వెనుకనుంచి దీనస్వరాలు మోగుతున్నాయి. పగిలిన గుండెలు వీళ్ళకోసం కేకలు పెడుతున్నాయి.

తోవ చీకటిలో తడిసి నడక సాగటంలేదు. ఆ తోవ గతంనుంచి ప్రస్తుతంలోకి సాగి వస్తోంది. నిశ్శబ్దంగా చుట్టూ తుపాకులు నడుస్తూ వీళ్ళందరినీ ఈడ్చుకుపోతున్నాయి. కొందరు తూలి పడిపోతున్నారు. తోవంతా పురాస్మృతులతో, పునుకులతో నిండివుంది. అక్కడ సోక్రేటస్ తాగి విసిరిన విషపాత్ర పడివుంది. జీసస్ గాయాలొలికిన నెత్తురుబొట్లు నిప్పుల్లా వెలుగుతున్నాయి.

అవెవరి కంఠాలు !

లూథర్, టైలర్, గాబ్రిల్ పెరీల గుండెలింకా కేకలు పెడుతున్నాయి.

“జ్యోతులు వెలిగించండి”!!

□ □ □

గాంధీజీ! ★

శ్రీ మల్లవరపు విశ్వేశ్వరరావు

గాంధీజీ! గాంధీ! నీ
కడుపులో తుపాకిగుండు
కాల్చి చంపుకున్నారా?
భరతపుత్రులే పితరుని
ప్రాణబలిని గొన్నారా?
స్వాతంత్ర్యం వచ్చిన యీ
స్వర్ణయుగం తొలిరోజున
పరతంత్రం బాపిన తమ
ప్రాపు తన్నుకున్నారా?
భరతపుత్రులే పితరుని
ప్రాణబలిని గొన్నారా?

బాపూజీ! బాపూ!
అమరత్వం పొందిన నీ
అమలినాత్మ జ్యోతిస్సై
ఆకాశం ఆవరించి
అశ్రుకణా లొల్కేనా?
అహింసార్ద్ర వీక్షణాల
ఆశీస్సులు చిల్కేనా?
కాఠిన్యములేని దివ్య
కరుణవాక్కు పల్కేనా?
నీదేహం కూల్చిన ఆ
నీచాత్ముని నీ కృపార
సోత్సంగమ్మున గదింప
ఊర్ధ్వలోక మండలాల
అభయహస్త ముద్రికతో
అంకిత మొనరించావా?

పాతాళపు లోతులకే
పడిపోయిన ఈ భారత
పంకిల మత్సర భూమికి
పావనమౌ నీ క్షమార్ద్ర
పక్ష శీతలచ్ఛాయల
బరపి రక్షనిడగ నభ
పథిని క్షణిక మాగావా?
ఆత్మరూపివైన ఓ మ
హాత్మ గాంధి! బాపూజీ!

మా కరముల నీ హత్యా
మాలిన్యం మాడ్చిందోయ్;
మా నరముల విద్వేషపు
మాత్సర్యం చిల్చిందోయ్,
మా సంఘము దేవుణ్ణే
మరణహత్య చేసిందోయ్,
మా స్వతంత్ర భానూదయ
మహిమ బుగ్గి కలిసిందోయ్!

నీచ భరత బానిసలకు
నీ బిచ్చం స్వాతంత్రం—
స్త్రైన్య మొసగు తల్లి రొమ్ము
దగ్ధం చేసిన హైందవ
దరిద్ర సంతానానికి
దక్కేనోయ్ ఈ స్వర్గం ?
గాంధీజీ! గాంధీ! నీ
కారుణ్యముతక్క భరత
ఖండానికి గతి ఏమోయ్ ?
గాంధీజీ! గాంధీ! నీ
క్షమాహృదియె కాఠిన్య
త్వము వహించి.కనువిచ్చిన
సస్యామల సుశ్యామల
స్వర్ణభూమి నుసికాదోయ్ ?
గాంధీజీ! గాంధీ! మా
కలుషపు పిస్తోలుగుండు
కడుపున దాచుకు నీ వా
గరళకంఠు కైలాసపు
క్రమకాంతి ధామానికి
కదలి పోయినావా ? మము
గంగపాలు చేశావా ?
గంగాజలముల నీ హృత్
కారుణ్యము నించావా ?
యమునా సైకతముల నీ
ఇహ దేహము కలిపావా ?
పితృహత్యా పాపాంబుధి
పుత్రు లీదలేరయ్యా,

సత్యాహింసాత్మా! నీ
క్షమాభిక్షు! క్షమాభిక్షు!
నిను హతమొనరించిన ఆ
ఇనుపగుండు అణుకణాలు
నలువది కోటుల గుండెల
నాటి నలుపుతున్నాయోయ్,
ఉన్మాదంతో జనములు
ఊర టుడిగి ఉన్నారోయ్
పాపోరగ వలయంలో
పట్టువడిన ప్రజాశక్తి
పాముకాటు తెలిసినంత
ప్రజ్వలించి పోతోందోయ్!
అమరలోక పరమపదము
నందిన ఓ హే మహాత్మ !!
మంబలార్పి దేశమునొక
కంటజూడవో గాంధీ!
కంట చూడకున్న వల్ల
కాడే మా స్వాతంత్ర్యం!
కాఠిన్యము పూనక నీ
కరుణాహింసా నిఝ్ఝరి
పాపతాపమును భస్మ
పటలం పాలై నొగిలే
భారత సంతానానికి
భాగీరథ కానిమ్మోయ్!
కైలాసపు శిఖరాగ్రపు
మందాకిని కెరటాలను
మృదుల భవన్నేత్రాంచల

పృథుల దయా వీక్షణాల
శమక్షమాశ్రు కణమ్ముల
శాంత దివ్య స్రోతస్విని
జేసి, అభయ మొసగుమోయి!

గరళకంఠు సహవాసీ!
కర్మచంద్ర గాంధీజీ!
అమరజీవి! బాపూజీ!

పూత స్వాతంత్ర్యాగమ
పుణ్యమహిమ నిలుపుమోయి,
జాతిక్షయ దుర్దినాన
ఆత్మశక్తి బరపుమోయి,
భూతలమున జాతి మత
ద్వేషవిషం బాపుమోయి,
నీ తుషార శాంతివర్ష
నిర్ఝరి నొలికించుమోయి—
పాపక్షము! పాపక్షమ!
పితృ హంతక పుత్రకుము!
జాతిజనక! బాపూజీ!
కాతరులను కావుమోయి
కైలాసపు రజతాముల
కారుణ్య ఛ్ఛటలబరపి
గాంధీజీ! గరళకంఠ!
కావుమోయి భరతత్మా!!
శిలువమీాది జీసస్సువై
బోధి నీడ బుద్ధునివై
విషచషకపు సోక్రటిసై
నశియింపని సత్యమువై
క్షమింపుము మా పాపము!
శమియింపుము మా తాపము!
నినుచంపిన నేరముకై
శిర మొగ్గిన భరతావని
క్షమాభిక్షకొర కంజలి
జాచివేచె నీ చితి కడ—
కరుణ శాంతి క్షమా కాంతి
కడల బరపు తున్నావా?
ఆత్మ రూపివై పాపుల
కభయ మొసగుతున్నావా?
నీ అహింస పక్షమ్ముల
నీడ హత్తుకున్నావా
నీపుత్రుల, ఈ హంతల,
ఈ దీనుల, నీభక్తుల?

బాపూజీ! బాపూ! నీ
పర మాశయ భరతాలయ
భవితవ్యపు నిర్మితికై
భవదీయ పునీతప్రాణ
బలి, పునాది చేశావా?
భరత భూమి బాశావా?
పర మాత్మను కలిశావా?

బాపూజీ! బాపూ! ఈ
ప్రాపంచపు పాపాలకు
ప్రక్షాళనగా రక్తము
పార బోసి పోయావా?

నీ పుత్రుల హస్తం నిను
నిలుపలేక పోయిందా?
నీ పుత్రుని దుష్టకరం
నీ గుండియ దూసిందా? —
మా పాపం పోయేనా?
నీ పుణ్యం నిలిచేనా? —
నీక్షమయే భావిసృష్టి!
నీ శాపం మా వినష్టి!

గరళకంఠ! కర్మచంద్ర!
గాంధీజీ! బాపూజీ!
ఆత్మరూప! అమృతకృపా!

ఖండిత భరతాంబ హృది న
ఖండభూతి నీ ప్రతీతి!

కలకాలపు దీపిక నీ
కరుణాహింసల సునీతి!
నత శిరులకు క్షమాభిక్ష!
నర జాతికి నీదు రక్ష!
హంతకులకు నీ నుసియే
అగుగావుత సత్యరథ్య!!
భావి భరత సారథి నీ
పవిత్రాత్మ దీధితి!
కర్మచంద్ర గాంధీ!
నిరత సత్య సంధీ!
బలి దానపు పంథీ!
పరమ దయా కంధీ!
పాపుల కయి మోడుపోయి
బాపూజీ! గాంధీ!

రచయితల కర్తవ్యం — (16 వ పేజీ తరువాయి)

వశాత్తు చీలిపోయిన ప్రజా ఉద్యమాలను ఏకం చేయ సమకట్టారు.

ఈ ఐక్య ప్రజా ఉద్యమానికి ఆశయాలు:

—మతదురహంకార ఫేసిజాన్ని నాశనం చేయాలి.

—ప్రభుత్వంలోనుంచి మతదురహంకార నాయకులను దోపిడీ ధనికవర్గ నాయకులను తొలగించాలి.

—ధనికులకు, జమీందారులకు, సంస్థానపతులకు, విదేశీ సామ్రాజ్య వాదులకు అనుకూలమైన పటేలు రాజీపంథాల నరికట్టాలి.

—న్యాయముగా సంపాదించే ఆస్తులకూ ఆస్తి హక్కులకూ రక్షణ ఇవ్వాలి. దురన్యాయమైన ప్రజాపీడాకరమైన ఆస్తినంతా, ముఖ్య పరిశ్రమలను జమీలను, సంస్థానాలను, దొంగమార్కెట్టు ధనాన్ని ప్రభుత్వం వశపరచుకోవాలి. మరో పద్ధతిలో వీటిని సాగనిచ్చే విధానాన్ని అంతమొందించాలి.

—దున్నేవాడికి భూమి, కష్టం చేసేవాడికే తిండి, అందరికీ విద్య, అందరికీ ఉద్యోగం చేకూర్చాలి.

—అల్పసంఖ్యాకుల ధన ప్రాణసంస్కృతులకు రక్షణ ఇవ్వాలి.

—స్వయంనిర్ణయ హక్కు ప్రాతిపదికతో భాషా ప్రయుక్త రాష్ట్రనిర్మాణం ద్వారా ఐక్యభారత ప్రజాతంత్రాన్ని నిర్మించాలి.

రచయితలకు విజ్ఞప్తి

అభ్యుదయ కాముకులైన రచయితలారా! మీరు కోరే నూతన అభ్యుదయం, నూతన సంస్కృతీనిర్మాణం, పైన వివరించిన నూతన ఆర్థిక రాజకీయ విధానం అమల్లోకొస్తేనేగాని సాధ్యపడదు. భారత నూతన ఆర్థిక రాజకీయ ప్రజాతంత్ర నిర్మాణానికి జరిగే పోరాటమే భారత నూతన ప్రజాసంస్కృతీ నిర్మాణానికి జరిగే పోరాటం! నూతన విశాలాంధ్ర ప్రజాతంత్రనిర్మాణానికి జరిగే పోరాటమే నూతన విశాలాంధ్ర సంస్కృతీ నిర్మాణానికి జరిగే పోరాటం! ఇది చల్లపల్లి నైజాం లాంటి భూస్వామ్య విధానానికీ, చుండూరు రెడ్డి, బిర్లాలాంటి దోపిడీ విధానానికీ, వీరి వెనుక నుండి వీరికి రక్షణ యిచ్చే సామ్రాజ్యవాద విధానానికి వ్యతిరేకం.

ఈ మహా సంగ్రామంలో రచయితలు ఏ పక్షం? ప్రజలపక్షంగా, ప్రజాఉద్యమ పక్షంగా, ప్రజాతంత్ర విధాన పక్షంగా ఉండాలి. గాంధీజీ హత్యలో జాతీయ స్వతంత్రానికీ, సంస్కృతికీ ఉన్న ప్రమాదాన్ని గుర్తించండి. మతదురహంకారాన్ని తెగడండి. మతరాజ్యం పేరుతో జమీందార్లు, సంస్థానపతులు, పెట్టుబడిదారులు, సామ్రాజ్యవాదులు చేసే దుర్మార్గాన్నీ కుట్రలనూ తెగడండి. పొరబడి మత దురహంకార ధోరణిలో బడ్డ యువకులకు, విద్యావంతులకు కనువిప్పును కలుగ చేయండి. ప్రజా ఉద్యమాన్ని, ప్రజా శౌర్యాన్ని కీర్తించండి. రచయితహృదయం జాగృతమైతే, రచయిత వాణి విక్రమిస్తే స్వార్థలోకం కూలిపోతుంది; స్వార్థరహిత ప్రజాలోకం జన్మిస్తుంది!

పరిషత్ సమీక్ష ★

(56 వ పేజీ తరువాయి)

ఇంతకూ మహాసభలో ప్రదర్శించబడినవివిధ నాటకాలూ, నాటికలూ, నృత్యాదికాలు మాత్రమే ప్రధానంగా ప్రజాదరణ పొందాయి.

ప్రత్యేకించి, నాటకాల్లో కెల్లా; మత కలహ కలుషితమైన నేటి జీవితంలోని అల్పత్వాన్నీ నైచ్యాన్నీ చిత్రించి, ఐక్యతనూ అన్యోన్యతనూ పురికొల్పే [1]'ఈనాడు' అనే నాటకమూ; నైజాం నిరంకుశ పరిపాలనలో మన తెలంగాణా ప్రజానీకం అనుభవిస్తున్న నరకయాతనలను వర్ణించి, తమ నిత్యజీవితం కోసం వాళ్ళెలా పోరాడుతున్నారో కళ్ళకు కట్టిన [2]'మాభూమి' నాటకమూ; నాటికల్లో మన రైతు జీవితాన్ని చిత్రించే [3]'పైపంట'; తెలంగాణా పోరాటాన్ని చిత్రించే [4]'తెలంగాణా నాటిక' ప్రేక్షకుల్లో నూతనోత్సాహాన్ని రేకెత్తించాయి; అందరి హృదయాల్లోనూ తమ కళాసందేశం నెలకొల్ప గలిగాయి.

ప్రథమబహుమతులు నాటకాల్లో ప్రదర్శనానికి 'ఈనాడు' కూ, రచనకు 'మాభూమి'కీ, నాటికల్లో ప్రదర్శనకూ, రచనకూ 'చేసిన పాపా'నికీ ఇచ్చారు.

నటనలో శ్రీమతి ఆర్. కోటేశ్వరమ్మ, శ్రీ ఎం. లక్ష్మి పెరుమాళ్లు, కొంగర జగ్గయ్యగార్లకూ బహుమతు లిచ్చారు.

ఇక తక్కిన నాటకాలలోనూ, నాటికల్లోనూ కూడా అభ్యుదయ ధోరణులే అధికంగా కనిపిస్తాయి. కాని, అస్పష్టం.

నృత్య ప్రదర్శనాల్లో, ప్రఖ్యాత నర్తకి శ్రీమతి తారాచౌదరి బృందం వారి వివిధ నృత్య ఖండాలు ప్రేక్షకుల్లో బాగానే ఆదరం పొందాయి.

బందరు జాతీయ నాట్యమండలి బాలికల నృత్యం ప్రశంసింప బడ్డది. కుమారి వసుంధర నృత్యం అందరి మన్ననలూ పొందింది.

ఈ ప్రదర్శనాల్లో దాదాపు రెండు వందలమంది కళాకారులు పాల్గొన్నారు. వారి సహకారమే పరిషత్తుకు ప్రాణం; అదే మహాసభా విజయానికి మూలం.

కాని, మహాసభలో ఈ కళాకారుల నందరినీ ఒకచోట సమావేశపరచి, ఒకరి నొకరికి ఎరుకపరచేందుకు గానీ, ఆయా నాటకాలనుగూర్చి ప్రదర్శనలను గూర్చి చర్చలు జరిపించేందుకు గానీ పరిషత్తు ప్రయత్నించ నేలేదు. ఎవరు ఎవరో ఎవరికీ తెలీదు; ఏదిఏమిటో కూడా అంతే.

ఈ విధంగా పరిషత్కార్య కర్తలు ప్రధానమైన విషయాలు పట్టించుకోక పోయినప్పటికీ, మహాసభలో పాల్గొన్న కళాకారుల ప్రతిభావిశేషమే సభా విజయాన్ని సాధించింది. ఇకముందైనా కార్యకర్తలు ఈసత్యం గుర్తించాలి.

— ప్రయాగ

---

1. రచయిత: శ్రీ ఆచార్య ఆత్రేయ; ప్రదర్శకులు: వెంకటగిరి ఎమెచ్యూర్సువారు.
2. రచయితలు: శ్రీ సుంకర సత్యనారాయణ, వాసిరెడ్డి భాస్కరరావు; ప్రదర్శకులు: ఆంధ్రప్రజా నాట్యమండలి—కృష్ణాదళం,
3. శ్రీ నార్ల వెంకటేశ్వరరావు; ప్రదర్శకులు: చీరాల జాతీయ నాట్యమండలి.
4. రచయిత: శ్రీ బొల్లిముంత శివరామకృష్ణ; ప్రదర్శకులు: దుగ్గిరాల ప్రజా నాట్యమండలి.

దరిద్ర నారాయణమూర్తి బాపూజీ ఆత్మశాంతికి

11-2-48 న పేదలకు అన్నదానము

చిత్రానికి 9-2-48 న ఈ దిగువ కేంద్రాలలో వచ్చు ఆదాయం ఆ యా చోట్లనే
వినియోగింప నిశ్చయించితిమి. ఆనాడు మహాజనులందరు చిత్రాన్ని
దర్శించి అన్నదానం సంతృప్తికరంగా జరపడానికి సహకారం
చేయ గోరుచున్నాము.

1948 జనవరి
2వ తేదీన
ఆంధ్రదేశమంతటా
విడుదల



BHARANI PICTURES MADRAS 6

భరణీ వారి

రత్నమాల

భానుమతి...సి.యస్.ఆర్.
డాక్టర్ సుబ్బారావు...ఆరణి.
హేమలత...నాగేశ్వరరావు


డైరెక్టర్...రామకృష్ణ

Story, Songs & Dialogues..SAMUDRALA... Music...SUBBARAMAN ...Dances..RAGHAVIAH...

6వ వారం

బెజవాడ
లక్ష్మీటాకీస్
....
కాకినాడ
మెజస్టిక్
....
రాజమండ్రి
మినర్వా
....
విజయనగరం
పూర్ణా
....
విశాఖపట్నం
పూర్ణా
....
బందరు
బృందావన్
....
గుంటూరు
న్యూసిటీ
....
తెనాలి
సత్యనారాయణ
....
ఏలూరు
గోపాలకృష్ణ
....
కర్నూలు
చాంద్

ఇట్లు
ప్రొడ్యూసర్ — డిస్ట్రిబ్యూటర్ — ఎగ్జిబిటర్



Wrapper Printed at Universal Printers, Bezwada